నంది పత్రిక

మా కలం - సామాన్యుడి బలం

GSTIN 37AMRPM5719R1ZX

జాతీయ తెలుగు దిన పత్రిక

RNI-APTEL/2023/88162

ఎడిటర్: మహేష్ యాదవ్ | తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ | సంపుటి : 4 | No: KNL/3-77(D)/2026-2028 | సంచిక : 242 | మంగళవారం 08 - 09 -2026 | పేజీలు : 12 | వెల-3

‘స్వచ్ఛ వాయు సర్వేక్షణ్’ అవార్డుల్లో ఏపీ హవా

అమరావతిపై నాకు అభ్యంతరం లేదు..

మా పార్టీ సీఎం అభ్యర్థి నేను కాదు
ఆ రెండు ముమ్మాటికీ ఫ్యాక్షన్ పార్టీలే..
ప్రజలకు గోరంత, తమకు కొండంత
విజయసాయిరెడ్డి సంచలన వ్యాఖ్యలు

“అమరావతిని రాజధానిగా ఒప్పుకోవడానికి నాకు ఎలాంటి అభ్యంతరం లేదు.. మనకు ఇష్టమున్నా లేకున్నా అమరావతిని రాష్ట్ర రాజధానిగా అంగీకరించి తీరాల్సిందే” అని మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో సరికొత్త రాజకీయ పార్టీ ఏర్పాటు చేయబోతున్నట్లు అధికారికంగా ప్రకటించిన ఆయన... భవిష్యత్ కార్యాచరణపై మీడియాతో మాట్లాడుతూ పలు ఆసక్తికర విషయాలను వెల్లడించారు. రాష్ట్రంలో పరిశ్రమలు నెలకొల్పి అభివృద్ధి సాధించడమే తమ లక్ష్యమని.. ఏపీని రూ. 12 లక్షల కోట్ల అప్పుల ఊబి నుంచి బయట పడేసేందుకే తమ కొత్త పార్టీ ఉద్భవిస్తోందని స్పష్టం చేశారు.

—స్వర్ణాంధ్ర విజన్— 2047తో ముందుకు

విజన్ ను క్షేత్రస్థాయిలో అమలు చేద్దాం
రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిద్దాం
కార్యకర్త బలంగా ఉంటేనే పార్టీకి బలం
టీడీపీ కార్యకర్త హుషారుగా ఉండాలి
ప్రతి నియోజకవర్గానికి కోటి కేటాయింపు
టెక్నాలజీతో వందేళ్ల పనిని పదేళ్లలోనే
వైసీపీది ఉగ్రవాదుల తరహా పాలిటిక్స్
ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక వ్యాఖ్యలు
లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో నేతలకు దిశానిర్దేశం

2లో

తెలుగుదేశం పార్టీ నిర్వహించిన లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు పార్టీ ఎమ్మెల్యేలు, నేతలకు కీలక దిశానిర్దేశం చేశారు. కార్యకర్తల రాజకీయ, ఆర్థిక సాధికారతకు కృషి చేయాలని, అదే సమయంలో స్వర్ణాంధ్ర విజన్-2047ను క్షేత్రస్థాయిలో అమలు చేసి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని స్పష్టం చేశారు. కార్యకర్త బలంగా ఉంటేనే పార్టీ బలంగా ఉంటుందని, వారిని నిరాశకు గురికాకుండా చూడాల్సిన బాధ్యత ఎమ్మెల్యేలదేనని ఆయన ఉద్ఘాటించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. “టీడీపీ కార్యకర్త హుషారుగా ఉంటే గెలుపును ఎవరూ ఆపలేరు. కార్యకర్తల్లో చాలా మంది పేదవారు ఉన్నారు. ప్రభుత్వ పథకాల ఫలాలు వారికి అందేలా చూడాలి. స్థానిక సంస్థల ఎన్నికల్లో బాగా పనిచేసిన వారికి, అక్కడి పరిస్థితులను బట్టి టికెట్లు కేటాయిస్తాం. వారు వ్యాపారాలు చేసుకుని అభివృద్ధి చెందేలా ఎమ్మెల్యేలు ప్రోత్సాహం, మార్గనిర్దేశం అందించాలి. ప్రజలు మెచ్చే విధంగా కార్యకర్తలకు న్యాయం చేస్తాం” అని హామీ ఇచ్చారు.

ఉద్యోగాల పేరుతో యూట్యూబర్ మోసం

శంషాబాద్ విమానాశ్రయంలో అరెస్ట్ 2లో

ప్రముఖ యూట్యూబర్ నందనను శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆమెపై ఇప్పటికే లుకౌట్ నోటీసులు పెండింగ్‌లో ఉండటంతో

నెల్లూరులో యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ కు ఘనస్వాగతం

స్వర్ణ భారత్ ట్రస్ట్ రజతోత్సవాలకు హాజరైన యూపీ సీఎం యోగి
నెల్లూరులో ఘన స్వాగతం పలికిన మంత్రులు నారాయణ, సత్యకుమార్
అక్షర విద్యాలయంలో నైపుణ్య శిక్షణా కేంద్రాన్ని పరిశీలన
శిక్షణ పొందుతున్న యువతతో ముఖాముఖి నిర్వహించిన ఆదిత్యనాథ్
ట్రస్ట్ సేవలను, విద్యాసంస్థల నిర్వహణను ప్రశంసించిన యూపీ సీఎం

2లో

ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యానాథ్ సోమవారం నెల్లూరు జిల్లా పర్యటనకు విచ్చేశారు. వెంకటాచలంలోని స్వర్ణ భారత్ ట్రస్ట్ 25వ వార్షికోత్సవ (రజతోత్సవ) వేడుకల్లో ముఖ్య అతిథిగా

నిరుద్యోగులపై బురదజల్లుతారా?

కష్టపడి మెగా డీఎస్సీ సాధించారు
ఏపీ మంత్రి రాంప్రసాద్ రెడ్డి ఫైర్



మెగా డీఎస్సీలో ప్రతిభతో ఉద్యోగాలు సాధించిన అభ్యర్థుల శ్రమను, వారి విజయాన్ని అవమానించేలా వైసీపీ నేతలు చౌకబారు ఆరోపణలు చేయడం అత్యంత బాధాకరమని ఏపీ మంత్రి రాంప్రసాద్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మెగా డీఎస్సీ సాధించిన అభ్యర్థులను వేధించడం, 2లో

మదనపల్లె లేడీ డాన్.. ఎవరీ కోనేటి సులోచన?

మదనపల్లెలో కలకలం రేపుతున్న ‘లేడీ డాన్’ కోనేటి సులోచన
ఆమె నివాసం, సోదరుడి ఇంటిపై పోలీసుల ఆకస్మిక దాడులు
భూ కబ్జాలు, ఫోర్జరీ పత్రాల ఆరోపణలతో 14 కేసులు నమోదు
రూ. 60 కోట్ల విలువైన ఆస్తులు, భారీగా డాక్యుమెంట్లు స్వాధీనం
2లో

ఆంధ్రప్రదేశ్‌లోని మదనపల్లెలో ‘లేడీ డాన్’గా పేరుపొందిన కోనేటి సులోచన నివాసంపై పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించడం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. కోట్ల రూపాయల విలువైన భూదందాలు, బెదిరింపులకు పాల్పడుతోందన్న ఆరోపణలతో పోలీసులు

అసెంబ్లీ వద్ద రచ్చ

సమావేశాల ప్రారంభానికి ముందు ఉద్రిక్తత
హామీల అమలుపై బీఆర్ఎస్ నేతల నిరసన
నల్ల టీషర్టులు ధరించి అసెంబ్లీకి నేతలు
నినాదాలు, ప్లకార్డులతో మూకుమ్మడి నిరసన
పోలీసులు అడ్డుకోవడంతో వాగ్వాదం, తోపులాట
అసెంబ్లీ మెయిన్ గేటు వద్ద హరీశ్‌రావును అరెస్ట్
మరింతగా నెలకొన్న ఉద్రిక్త వాతావరణం
పోలీసులతో వాగ్వాదంలో కేటీఆర్ కు గాయాలు
ప్రభుత్వ తీరుపై తీవ్రంగా మండిపడ్డ బీఆర్ఎస్
పోలీసుల తీరుపై తీవ్ర స్థాయిలో కేటీఆర్ ఆగ్రహం
తోపులాటలో గాయపడ్డ మహిళా ఎమ్మెల్యేలు
రాష్ట్రవ్యాప్తంగా నిరసనలకు బీఆర్ఎస్ పిలుపు

తెలంగాణ అసెంబ్లీ సమావేశాల ప్రారంభానికి ముందు అసెంబ్లీ ముందు ఉద్రిక్తత చోటు చేసుకుంది. కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలన, హామీల అమలుపై నిరసనగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నల్ల టీషర్టులు ధరించి అసెంబ్లీకి రావడం అసలు ఘర్షణకు కారణం అయింది. నినాదాలు, ప్లకార్డులతో వచ్చిన బీఆర్ఎస్ సభ్యులను పోలీసులు అడ్డుకోవడంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం, తోపులాట చోటుచేసుకుంది. 12లో

ఇది శాసనసభ కాదు.. కౌరవసభ..

సీఎం రేవంత్ సారీ చెప్పాలి

రేవంత్ ప్రభుత్వంపై హరీశ్ రావు ఫైర్
టీషర్టులతో మీరు పార్లమెంట్?కు వెళ్తారు
మేము టీషర్టులతో అసెంబ్లీకి రాకూడదా?
పోలీసుల అభ్యంతరంపై హరీశ్‌రావు
ఇది ముమ్మాటికీ దుశ్శాసన సభ..
మహిళా నేతల జుట్టు పట్టుకుని ఈడ్చేస్తారా?
శాంతియుతంగా నిరసనపై ఉక్కుపాదమా!
ఈ దాడి వెనుక రేవంత్ రెడ్డి కుట్ర ఉంది
బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

ఏపీలో పదో తరగతి అర్హతతో 913 ఉద్యోగాలు

12లో

ఈ నెలాఖరులోగా నియామకాలు పూర్తి చేయాలని ఆదేశం
ఇప్పటికే 1,294 పోస్టులను భర్తీ చేసినట్లు మంత్రి వెల్లడి
అర్హత: 10వ తరగతి, 25-45 ఏళ్ల వయసు, స్థానిక మహిళలు

ఆంధ్రప్రదేశ్‌లో ఉద్యోగాల కోసం నిరీక్షిస్తున్న మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం తీపికబురు

ఆ అధికారం మీకెక్కడిది?

పాంతన లేని నీటి లెక్కలతో
టీ-ప్రాజెక్టులకు కేటాయింపులా?
కేంద్ర జలసంఘాన్ని ప్రశ్నించిన ఏపీ
తెలంగాణకు అనుకూలంగా ఉంటున్నారు
నీటి లభ్యత తేల్చకుండానే
కాళేశ్వరం ప్రాజెక్టుకు అనుమతా?
120 టీఎంసీల నిల్వకు ఓకే అంటే..
180 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించారు
మా అభ్యంతరాలు పరిగణనలోకి
తీసుకోకుండా టీఏసీ ఎలా ఆమోదిస్తుంది?
గోదావరి జలాల లభ్యతపై 2023 స్టడీ
లెక్కలు తప్పుల తడకలు 12లో
కొత్తగా అధ్యయనం చేయాలి
కేటాయింపుల కోసం ట్రైబ్యునల్ వేయాలి
సమ్మక్క పాలమూరు ప్రాజెక్టులకు
అనుమతులివ్వొద్దు.. భేటీలో ఏపీ డిమాండ్
10 రోజుల్లో మళ్లీ సమీక్షిద్దామన్న చైర్మన్

పొంతన లేని నీటి లెక్కలతో తెలంగాణ ప్రాజెక్టులకు నీటి కేటాయింపులు చేసే అధికారం కేంద్ర జలసంఘాని(సీడబ్ల్యూసీ)కి ఎక్కడిదని ఆంధ్రప్రదేశ్ ప్రశ్నించింది. గోదావరి జలాల్లో నీటి లభ్యత తేల్చకుండానే కాళేశ్వరం ప్రాజెక్టుకు సాంకేతిక సలహా కమిటీ (టీఏసీ) ఎలా ఆమోదం తెలుపుతుందని నిలదీసింది. నీటి లభ్యతపై అధ్యయనం చేయకుండా.. కేటాయింపులు లేకుండా.. తమ అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోకుండా గణాంకాలు పదే పదే మార్చేస్తే ఎలాగని ప్రశ్నించింది. తక్షణమే గోదావరి జలాల్లో లభ్యతపై కొత్తగా అధ్యయనం చేపట్టాలని పట్టుబట్టింది. తమ అభ్యంతరాలను

స్వర్ణాంధ్ర విజన్-2047తో ముందుకు

జిల్లాల్లో, నియోజకవర్గాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించే బాధ్యతను మంత్రులు తీసుకోవాలని, లేనిపక్షంలో వారే జవాబుదారీగా ఉండాల్సి వస్తుందని హెచ్చరించారు. స్వర్ణాంధ్ర విజన్-2047 డాక్యుమెంట్‌పై సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా దృష్టి సారించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన విజన్‌కు నియోజకవర్గాల స్థాయిలో ఎమ్మెల్యేలు తమ ఆలోచనలతో విలువ జోడించాలని (వాల్యూ ఎడిషన్) సూచించారు. "విజన్ ప్లాన్ అమలు చేస్తే అభివృద్ధి సాధ్యమవడమే కాదు, ఎన్నికల్లోనూ గెలుపు ఖాయం. పేద-ధనిక మధ్య అంతరాలు తగ్గించడమే ఈ విజన్ ప్రధాన లక్ష్యం. ఆర్థిక కష్టాలు ఉన్నప్పటికీ, ప్రతి నియోజకవర్గానికి రూ.1 కోటి చొప్పున కేటాయించాలని నిర్ణయించాం" అని తెలిపారు.కేంద్ర మంత్రులుగా ఉన్నవారు జాతీయ స్థాయిలో శాఖలను పర్యవేక్షిస్తున్న స్ఫూర్తితోనే తమ జిల్లాలను అభివృద్ధి చేయాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. ప్రజాప్రతినిధుల్లో ఉన్నత విద్యావంతులు, రిటైర్డ్ ఉద్యోగులు, పారిశ్రామికవేత్తలు ఉన్నారని, వారంతా తమ అనుభవంతో విజన్ డాక్యుమెంట్లను అధ్యయనం చేసి, వినూత్నంగా ఆలోచించాలని కోరారు. "వందేళ్లలో జరిగే పనులను పదేళ్లలో పూర్తి చేసే టెక్నాలజీ ఇప్పుడు అందుబాటులో ఉంది. ప్రతి ఎమ్మెల్యే అకుంఠిత దీక్షతో పనిచేస్తే అద్భుతాలు సృష్టించవచ్చు" అని చంద్రబాబు అన్నారు. పెట్టుబడులను ఆకర్షించేందుకు 28 కొత్త పాలసీలు తీసుకొచ్చినట్లు ఆయన గుర్తుచేశారు. మరోవైపు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు కేవలం గౌరవం ఇవ్వడమే కాకుండా, వారికి రాజకీయ, ఆర్థిక సాధికారత కల్పించడమే అధినేత చంద్రబాబు నాయుడు ప్రధాన లక్ష్యమని పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. మంగళగిరిలో జరిగిన టీడీపీ లీడర్‌షిప్ శిక్షణా సదస్సులో 'రాజకీయ, ఆర్థిక సాధికారత' అనే అంశంపై ఆయన ప్రసంగించారు. 2040 నాటికి దేశంలో సాధారణ తలసరి ఆదాయం రూ.50 లక్షలకు చేరితే, టీడీపీ కార్యకర్తల కుటుంబాల ఆదాయం నీతివంతమైన మార్గాల్లో రూ.75 లక్షలు దాటాలనేది చంద్రబాబు ఆకాంక్ష అని ఏలూరి వెల్లడించారు. అధికారంలో ఉన్నా, లేకపోయినా నిరంతరం ప్రజల్లో ఉండే కోటి మందికి పైగా సభ్యులున్న ఏకైక పార్టీ టీడీపీ అని ఆయన కొనియాడారు. కార్యకర్త ఆర్థికంగా నిలదొక్కుకున్నప్పుడే పార్టీ మరింత బలోపేతం అవుతుందని అన్నారు. నారా లోకేశ్ ఆలోచనతో కార్యకర్తలకు రూ.5 లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పిస్తున్నామని, తల్లిదండ్రులను కోల్పోయిన కార్యకర్తల పిల్లలకు ఎన్టీఆర్ మోడల్ స్కూళ్ల ద్వారా నాణ్యమైన విద్య అందిస్తున్నామని తెలిపారు. టీడీపీ సభ్యత్వ కార్డు కేవలం గుర్తింపు మాత్రమే కాదని, అది ఆ కుటుంబానికి పార్టీ ఇస్తున్న బీమా, విద్య, వైద్య, ఉపాధి భరోసా అని వర్ణించారు. సాధారణ విద్యార్థి నాయకుడిగా ఉన్న తనకు ఎలాంటి రాజకీయ నేపథ్యం లేకపోయినా, కేవలం ప్రతిభ ఆధారంగా మూడుసార్లు ఎమ్మెల్యేగా అవకాశం కల్పించిన ఘనత చంద్రబాబుదేనని ఏలూరి గుర్తుచేసుకున్నారు. పార్టీలో సిఫార్సులకు తావులేదని, ప్రతిభకే పట్టం కడతారని స్పష్టం చేశారు. నారా లోకేశ్ నేతృత్వంలో 'కార్యకర్తే అధినేత' అనే సిద్ధాంతంతో నవతరం నాయకత్వాన్ని నిర్మిస్తున్నామని తెలిపారు. ప్రతి ఒక్కరూ "నా తెలుగుదేశం – నా బాధ్యత" అనే నినాదాన్ని స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు.

కాగా ముఖ్యమంత్రి చంద్రబాబు కేవలం తెలుగుదేశం పార్టీ ఆస్తి కాదని, యావత్ తెలుగు జాతి ఆస్తి అని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అభివర్ణించారు. టీడీపీ లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో భాగంగా 'స్వర్ణాంధ్ర విజన్ 2047' డాక్యుమెంట్‌పై ఆయన ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయకత్వ దార్శనికతను, ఆయన రూపొందించిన విధానాల వల్ల కలిగిన ప్రయోజనాలను ఉదాహరణలతో వివరించారు. ప్రతినిధుల హర్షధ్వానాల మధ్య ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. "వాట్ చంద్రబాబు థింక్స్ టుడే, నేషన్ థింక్స్ టుమారో (చంద్రబాబు ఈరోజు ఆలోచించింది, దేశం రేపు ఆలోచిస్తుంది)" అనేది అక్షర సత్యమని పయ్యావుల అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు చంద్రబాబు రూపొందించిన 'విజన్-2020' దేశంలోనే తొలి విజన్ డాక్యుమెంట్ అని, దానిని చూశాకే అనేక రాష్ట్రాలు తమ విజన్ పత్రాలను తయారు చేసుకున్నాయని గుర్తుచేశారు. నాడు విజన్-2020ని కొందరు అవహేళన చేసినా, అదే రాష్ట్రానికి దిక్సూచిగా మారిందని తెలిపారు. చంద్రబాబు దూరదృష్టికి ఐటీ రంగం అభివృద్ధి ఒక నిదర్శనమని పయ్యావుల పేర్కొన్నారు. హైటెక్ సిటీ ఏర్పాటుకు ముందే వందల సంఖ్యలో ఇంజనీరింగ్ కాలేజీలను ఏర్పాటు చేసి మానవ వనరులను సిద్ధం చేశారని, అందుకే ఇంజనీరింగ్ పూర్తిచేసిన యువతకు ఐటీ ఉద్యోగాలు వెంటనే లభించాయని వివరించారు. ఆయన ప్రణాళిక వల్లే నేడు ప్రపంచవ్యాప్తంగా తెలుగువారు ఐటీ నిపుణులుగా అత్యధిక ఆదాయం ఆర్జిస్తున్నారని అన్నారు. జలవనరుల నిర్వహణలో చంద్రబాబును 'వాటర్ మ్యాన్'గా అభివర్ణించారు.

పట్టిసీమ ద్వారా 500 టీఎంసీల గోదావరి జలాలను కృష్ణా డెల్టాకు తరలించి, ప్రకాశం బ్యారేజీని 200 సార్లు నింపిన ఘనత చంద్రబాబుదేనని ప్రశంసించారు. 2024లో విధ్వంసానికి గురైన రాష్ట్రాన్ని తిరిగి వికాసం వైపు నడిపిస్తున్నారని అన్నారు. నియోజకవర్గాల వారీగా విజన్ ప్లాన్‌లను అమలు చేస్తున్న ఏకైక రాష్ట్రం ఏపీ అని, ఈ విషయంలో నీతి ఆయోగ్‌తో కలిసి పనిచేస్తూ జాతీయ స్థాయిలో ప్రశంసలు అందుకున్నామని పయ్యావుల తెలిపారు. నేతలంతా ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడమే లక్ష్యంగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు.

ఆ అధికారం మీకెక్కడిది?

పట్టించుకోకుండా సాంకేతిక ఆమోదం ఇవ్వడాన్ని ఆక్షేపించింది. గోదావరి, కృష్ణా నదీ జలాలపై ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య నెలకొన్న వివాదాల పరిష్కారం కోసం సోమవారం ఢిల్లీలో జల సంఘం చైర్మన్ అనుపమ్ ప్రసాద్ అధ్యక్షతన జల వివాదాల సమన్వయ కమిటీ సమావేశమైంది. కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ), గోదావరి నదీ యాజమాన్య బోర్డు (జీఆర్ఎంబీ) చైర్మన్లు.. ఏపీ జల వనరుల శాఖ సలహాదారు ఎం.వెంకటేశ్వరరావు, ఈఎన్‌సీ కె.నరసింహమూర్తి, అంతరాష్ట్ర విభాగం సీఈ రాధాకృష్ణ, సూపరింటెండెంట్ ఇంజనీర్ రాజేశ్వరి, డీఈ ఏసుబాబు, పోలవరం-బనకచర్ల నోడల్ ఆఫీసర్ రాంచందర్‌రావు, ఈఈ రమేశ్.. తెలంగాణ నీటి పారుదల శాఖ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, నీటిపారుదల శాఖ కార్యదర్శి శ్రీధర్, ఈఎన్‌సీ రవికుమార్ తదితరులు హాజరయ్యారు. జల సంఘం తీరును ఆంధ్రప్రదేశ్ నేరుగా ప్రశ్నించడంతో.. సమావేశం ఒక్కసారిగా వేడెక్కింది. ఇప్పటిదాకా జల సంఘం తీసుకున్న నిర్ణయాలకు తలూపడం మినహా రాష్ట్రాలు ఇలా ఎదురుతిరిగి ప్రశ్నించడం చాలా అరుదు.
అనుమతుల్లేకుండా చేపడుతున్న ప్రాజెక్టులకు సాంకేతిక అనుమతులు ఇవ్వడాన్ని ఏపీ గట్టిగా తప్పుబట్టింది. దీంతో జల సంఘం నివ్వెరపోయింది. కాళేశ్వరం ప్రాజెక్టును 120 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో నిర్మించడానికి అనుమతులిస్తే.. తెలంగాణ 180 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించిందని.. ఒక ప్రాంతంలో ప్రాజెక్టు నిర్మాణానికి అనుమతులిస్తే.. మరో ప్రాంతంలో నిర్మిస్తే ఎందుకు అభ్యంతరం వ్యక్తం చేయలేదని ఏపీ ప్రశ్నించింది. గోదావరి జలాల లభ్యతపై కొత్తగా అధ్యయనం చేయాలని భేటీలో పలుసార్లు డిమాండ్ చేసింది. 2023లో చేసిన అధ్యయనం ఉందన్న జలసంఘం వాదనను నిర్ద్వంద్వంగా తోసిపుచ్చింది. ఈ లెక్కలన్నీ తప్పులతడకలుగా కొట్టివేసింది. అవి పొంతన లేకుండా.. రాష్ట్ర విభజన చట్టానికి విరుద్ధంగా ఉన్నాయని పేర్కొంది. జల సంఘం తెలంగాణకు సానుకూలంగా వ్యవహరిస్తోందని ఆరోపించింది. గోదావరి ట్రైబ్యునల్ ఆదేశాలు, రాష్ట్ర విభజన చట్టం మార్గదర్శకాలకు విరుద్ధంగా ఆ రాష్ట్రం ప్రాజెక్టులు నిర్మిస్తున్నా ఎందుకు నిరోధించడం లేదని నిలదీసింది. అనుమతుల్లేకుండా తెలంగాణ నిర్మిస్తున్న సమ్మక్క, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులకు అనుమతులివ్వొద్దని కోరింది. కాళేశ్వరం ప్రాజెక్టుకు నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు ఇచ్చినందున టీఏసీ నిర్ణయంపై పునఃసమీక్షించాల్సిందేనని డిమాండ్ చేసింది. గోదావరి జలాల కేటాయింపుల కోసం ట్రైబ్యునల్ వేయాలని స్పష్టంచేసింది. శ్రీశైలం జలాశయం నుంచి విద్యుదుత్పత్తి నిలిపేయాలన్న కృష్ణా బోర్డు ఆదేశాలను తెలంగాణ బేఖాతరు చేస్తోందని.. యథేచ్ఛగా విద్యుదుత్పాదన కొనసాగిస్తోందని.. అలాంటప్పుడు కేంద్ర సంస్థకు ఉన్న అధికారాలేమిటని ప్రశ్నించింది. నదుల అనుసంధానంలో భాగంగానే పోలవరం-బనకచర్ల అనుసంధాన పథకం చేపడుతున్నామని తెలిపింది. ఈ ప్రాజెక్టుపై తెలంగాణ అభ్యంతరం వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో గోదావరిలో నీటి లభ్యతను లెక్కకట్టాలని డిమాండ్ చేసింది. రెండు రాష్ట్రాలకు ఆమోదయోగ్యమైన రీతిలో నీటి లెక్కలను నిరూపించాలని కోరింది. గోదావరి నుంచి గత 2 నెలల్లో దాదాపు వెయ్యి టీఎంసీలు సముద్రం పాలయ్యాయని.. కళ్ల ముందు వృథా అవుతున్న నీళ్లను వాడుకునేందుకు పోలవరం-నల్లమలసాగర్ ప్రాజెక్టు చేపడితే తెలంగాణ అభ్యంతరం తెలుపడం సరికాదని తెలిపింది. కేంద్రం వద్ద పరిశీలనలో ఉన్న ఈ ప్రాజెక్టు ముందస్తు సాధ్యాసాధ్యాల నివేదిక (పీఎఫ్ఆర్)కు క్లియరెన్స్ ఇవ్వాలని కోరింది. గోదావరిలో నీటి లభ్యతపై జలసంఘం లెక్కలపై తమకున్న సందేహాలను తీర్చి.. ఈ ప్రాజెక్టుకు సాంకేతిక ఆమోదం ఇవ్వాలని విజ్ఞప్తి చేసింది.

అనుమతులకు విరుద్ధంగా నిర్మాణాలు.. కాళేశ్వరం ఎత్తిపోతలు, పాలమూరు-రంగారెడ్డి, సమ్మక్క ప్రాజెక్టులను 2014కు ముందు ఉమ్మడి రాష్ట్రంలోనే అనుమతులు వచ్చాయని, పాత ప్రాజెక్టులకే పేర్లు మార్చామని, కొత్త ప్రాజెక్టులేమీ చేపట్టలేదని తెలంగాణ సలహాదారు ఆదిత్యనాథ్‌దాస్ పేర్కొనగా.. ఆ ప్రాజెక్టుల నిర్మాణం ఏ ప్రాంతంలో చేపట్టేందుకు అనుమతులిచ్చారో చెప్పాలని ఏపీ సలహాదారు వెంకటేశ్వరరావు ప్రశ్నించారు. అనుమతులకు విరుద్ధంగా తెలంగాణ కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించిందన్నారు. 'కాళేశ్వరం ప్రాజెక్టు సామర్థ్యం ఎంతకు అనుమతులు వచ్చాయి.. ఎంత సామర్థ్యంతో నిర్మించారు? అనుమతులకు భిన్నంగా ప్రాజెక్టులు నిర్మిస్తే ఎలా' అని ప్రశ్నించారు. 2023 నాటి గోదావరి జలాల అధ్యయన గణాంకాలను తాము అంగీకరించబోమన్నారు. కొత్తగా అధ్యయనం చేయాల్సిందేనని స్పష్టం చేశారు. దీంతో ఈ అంశాలపై పది రోజుల్లో మరోసారి సమీక్షిద్దామని జలసంఘం చైర్మన్ అన్నారు. అందులో చర్చించేందుకు ముందస్తుగా అజెండా పంపాలని రెండు రాష్ట్రాలకూ సూచించారు.

అసెంబ్లీ వద్ద రచ్చ..

ఈ క్రమంలో బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అసెంబ్లీలోకి నల్ల టీషర్టులతో వెళ్లేందుకు అనుమతి లేదని పోలీసులు చెప్పడంతో హరీశ్‌రావు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. పోలీసుల తీరుకు నిరసనగా హరీశ్‌రావు బ్లాక్ టీషర్ట్ విప్పి బనియన్‌తో అసెంబ్లీలోకి వెళ్లేందుకు ప్రయత్నం చేశారు. ఎమ్మెల్యే అనిల్ జాదవ్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేక్ సహా పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కూడా ఇదే విధంగా టీషర్టులు విప్పి నిరసన తెలిపారు. దీంతో పోలీసులు వారిని అడ్డుకున్నారు. అసెంబ్లీ మెయిన్ గేటు వద్ద హరీశ్‌రావును అరెస్ట్ చేయడంతో కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ క్రమంలోనే నల్ల టీషర్ట్ ధరించి అసెంబ్లీకి రావడంపై పోలీసులు అభ్యంతరం చెప్పడాన్ని హరీశ్‌రావు ప్రశ్నించారు. రాహుల్ గాంధీ టీషర్ట్ ధరించి పార్లమెంట్‌కు వెళ్తే తప్పు లేనప్పుడు.. తాము నల్ల టీషర్టులు వేసుకుని నిరసన తెలపడం ఎందుకు తప్పని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వం తమ నిరసనను అడ్డుకుంటోందని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు.ఇక.. బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్.. పోలీసుల తీరుపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. పోలీసులు డ్యూటీ చేయండి, కానీ అతి చేయకండి అంటూ వ్యాఖ్యలు చేశారు. 2 ఏళ్లలో తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని.. వార్నింగ్ ఇచ్చారు. పోలీసులతో వాగ్వాదంలో తనకు అయిన గాయాలను.. మీడియాకు కేటీఆర్ చూపించారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వ తీరుపై తీవ్రంగా మండిపడ్డారు. మరోవైపు.. అసెంబ్లీ మెయిన్ గేటు వద్ద చోటుచేసుకున్న పరిణామాలపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు తమతో అమానుషంగా ప్రవర్తించారని ఆరోపించారు. తన చీర పట్టుకుని లాగేశారని.. బూటు కాళ్లతో తొక్కారని ఆమె కన్నీళ్లు పెట్టుకున్నారు. మహిళా ఎమ్మెల్యేల పట్ల కూడా పోలీసులు తీరును మార్చుకోవాలని ఆమె మండిపడ్డారు. మరోవైపు మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి అసెంబ్లీ మెయిన్ గేటు వద్ద అస్వస్థతకు గురై కిందపడిపోయారు. కొద్దిసేపు ఆయన స్పృహ కోల్పోయినట్లు బీఆర్ఎస్ నేతలు తెలిపారు. దీంతో అక్కడ ఉన్న పార్టీ నేతలు, కార్యకర్తల్లో ఆందోళన నెలకొంది. ఆయన తన కాలికి అయిన గాయాన్ని కూడా మీడియాకు చూపించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తవుతున్న నేపథ్యంలో ఇచ్చిన హామీల అమలు తీరును ప్రశ్నించేందుకు నల్ల దుస్తులతో అసెంబ్లీకి వచ్చినట్లు బీఆర్ఎస్ సభ్యులు తెలిపారు. ఇటీవల రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశమైన 22ఏ భూముల అంశాన్ని కూడా సభలో ప్రధానంగా ప్రస్తావించేందుకు ఆ పార్టీ సిద్ధమైంది. మరోవైపు అసెంబ్లీ వద్దకు వచ్చిన బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలతో పోలీసులు, సెక్యూరిటీ సిబ్బంది అనుచితంగా ప్రవర్తించారని హరీష్ రావు ఆరోపించారు. సునీతా లక్ష్మారెడ్డి చీర లాగి దారుణంగా ప్రవర్తించారని అన్నారు. మంత్రిగా సేవలు అందించిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని సైతం జుట్టు పట్టి లాగడం మహిళల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని తెలుపుతుందని ఎద్దేవా చేశారు. అక్కాచెల్లెమ్మలతో ఇంత దుర్మార్గంగా ప్రవర్తించడాన్ని నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనకు పిలుపునిచ్చినట్లు హరీష్ రావు తెలిపారు. మేం సభలో లేని సమయంలో ప్రధాన ప్రతిపక్షం లేకుండా వివాదాస్పద 22 ఏ నిషేధిత భూముల అంశంపై చర్చ జరపడం సరికాదన్నారు. తాము చేసేది తప్పు కాదంటే, ఎలాంటి అవినీతి, అక్రమాలు జరగలేదని భావిస్తే బీఆర్ఎస్ సభ్యులు సభకు వచ్చినప్పుడు చర్చ జరగపాలని హరీష్ రావు ప్రభుత్వానికి సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై ప్రశ్నిస్తామన్న భయంతో మేం లేని సమయం చూసి సభలో చర్చిస్తున్నారు. ప్రజల పట్ల చిత్తశుద్ధి ఉంటే కనుక మేం సభకు వచ్చినప్పుడు కీలకమైన నిషేధిత భూముల అంశంపై చర్చ జరగాలని ప్రభుత్వానికి హరీష్ రావు సూచించారు. పోలీసుల తోపులాటలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేతికి, నుదిటికి గాయాలైనట్లు తెలుస్తోంది. మాజీ మంత్రులు హరీష్ రావు, జగదీశ్ రెడ్డి కిందపడిపోయారు. తమను పోలీసులు అడ్డుకోవడంతో అసెంబ్లీ గేటు వద్ద హరీష్ రావు తన చొక్కా విప్పేశారు. నల్ల టీషర్టుతో లోపలికి అనుమతించకపోవడంతో హరీష్ రావు బనియన్‌తో నిరసన తెలుపగా, ఆయనతో పాటు వేముల ప్రశాంత్ రెడ్డి, కల్వకుంట్ల సంజయ్ సహా పలువురు నేతలను పోలీసులు అరెస్ట్ చేసి తెలంగాణ భవన్‌కు తరలించారు. అసెంబ్లీలోకి వెళ్లకుండా పోలీసులు తమపై అమానుషంగా ప్రవర్తించారని పార్టీ నేతలు ఆరోపించారు. మరోవైపు, మహిళా ప్రజాప్రతినిధుల పట్ల పోలీసులు అత్యంత దుర్మార్గంగా ప్రవర్తించారని బీఆర్ఎస్ నేతలు మండిపడ్డారు. అసెంబ్లీకి వెళ్తున్న సమయంలో ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి చీరను పోలీసులు లాగడంతో ఆమె కన్నీళ్లు పెట్టుకుంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడ్డారు. అలాగే మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రా రెడ్డిని జుట్టు పట్టుకుని ఈడ్చుకెళ్లడం మహిళల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉన్న గౌరవం ఇదేనా అని పోలీసుల తీరుపై తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. సోమవారం అసెంబ్లీ సమావేశాల ప్రారంభం సందర్భంగా అసెంబ్లీ గేటు వద్ద పోలీసుల అక్రమ అరెస్టులు, దాడుల ఘటనలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పార్టీ నిర్ణయించింది.

మెగా డీఎస్సీపై ఆరోపణలు నిరాధారం.. వేధిస్తే కఠిన చర్యలు: ఏపీ ప్రభుత్వం

ఏపీ మెగా డీఎస్సీ 2025 నియామకాలపై గత పది రోజులుగా సోషల్ మీడియా, ఇతర మాధ్యమాల్లో వస్తున్న ఆరోపణలను రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. స్పోర్ట్స్ కోటా సహా ఇతర నియామకాల్లో ఎలాంటి అక్రమాలు జరగలేదని, మొత్తం ప్రక్రియ అత్యంత పారదర్శకంగా జరిగిందని స్పష్టం చేసింది. అమరావతిలోని విద్యాభవన్ లో పాఠశాల విద్యాశాఖ కమిషనర్ తమీమ్ అన్సారియా, రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) వైస్ చైర్మన్ అండ్ ఎండీ భరణి సంయుక్తంగా మీడియా సమావేశం నిర్వహించి పూర్తివివరాలు వెల్లడించారు. ఉపాధ్యాయులను లక్ష్యంగా చేసుకుని వేధింపులకు పాల్పడితే కఠినమైన క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.స్పోర్ట్స్ కోటా నియామకాలు పారదర్శకం: శాప్ స్పోర్ట్స్ కోటా ఎంపికలు కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగానే జరిగాయని శాప్ ఎండీ భరణి తెలిపారు. తుది జాబితాకు ముందు 1:5 నిష్పత్తిలో అభ్యర్థుల జాబితాను విడుదల చేసి, 2025 ఆగస్టు 8 నుంచి 14 వరకు అభ్యంతరాలకు అవకాశం

అమరావతిపై నాకు అభ్యంతరం లేదు..

కేవలం రెడ్డి, కమ్మ సామాజిక వర్గాల వారే సీఎం స్థానంలో ఉండాలా? ఆయన ప్రశ్నించారు. బీసీలతో సహా అన్ని వర్గాలకు సమాన అవకాశాలు కల్పిస్తామని... తమ పార్టీలో ఏకంగా 66 శాతం ప్రాధాన్యత యువతకే ఇస్తామని హామీ ఇచ్చారు. ఇదే సమయంలో ఆయన మరొక సంచలన ప్రకటన చేశారు. తన పార్టీకి తాను సీఎం అభ్యర్థిని కాదని స్పష్టం చేశారు. బాల్ ఠాకరే తరహాలో కేవలం 'మెంటర్' గా మాత్రమే దిశానిర్దేశం చేస్తానని తేల్చిచెప్పారు. తన కుటుంబ సభ్యులు ఎవరూ కూడా పదవుల్లో ఉండరని స్పష్టం చేశారు. రాష్ట్రం విడిపోయినప్పుడు రూ. 1.02 లక్షల కోట్లుగా ఉన్న అప్పులు, గత 12 ఏళ్ల పాలనలో రూ. 12 లక్షల కోట్లకు ఎలా చేరాయని... ఆ సొమ్ము ఎవరి జేబుల్లోకి వెళ్లిందని ప్రశ్నించారు. విపరీతంగా పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలు, విద్యుత్ ఛార్జీలు, ఇంటి అద్దెలను అదుపులోకి తీసుకురావడమే తమ పార్టీ ప్రధాన ధ్యేయమని వెల్లడించారు. మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి ఏపీ రాజకీయాలపై సంచలన వ్యాఖ్యలు చేశారు. త్వరలో తాను ఏర్పాటు చేయబోయే నూతన రాజకీయ పార్టీ జెండా, అజెండాను ప్రకటించే ముందు, రాష్ట్రంలోని సమస్యలను ప్రజల ముందు ఉంచుతానని స్పష్టం చేశారు. ఏపీకి ఇప్పుడు మూడో ప్రత్యామ్నాయం ఎంతో అవసరమని, ఈ విషయాన్ని ప్రజలకు వివరిస్తానని ఆయన తెలిపారు. విజయవాడలో సోమవారం పలు కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన, ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న వైసీపీ, టీడీపీ, జనసేన పార్టీలకు ప్రజా సమస్యలను పట్టించుకునే పరిస్థితి లేదని విజయసాయిరెడ్డి విమర్శించారు. ముఖ్యంగా రాష్ట్ర రాజకీయం మొత్తం రెండు పార్టీల చుట్టూనే తిరుగుతోందని, వైసీపీ, టీడీపీల మధ్య ఫ్యాక్షన్ తరహా యుద్ధం జరుగుతోందని ఆరోపించారు. ఈ పార్టీలకు పోలీసులు కూడా మద్దతు ఇస్తున్నారని ఆయన వ్యాఖ్యానించారు. టీడీపీ, వైసీపీలు ఫ్యాక్షన్ కుటుంబ రాజకీయ పార్టీలని విజయసాయిరెడ్డి అభివర్ణించారు. ఆరు కోట్ల ప్రజానీకం, రాష్ట్ర సంపదను ఏ పార్టీ దోచుకోవాలనే హక్కు కోసం ఈ రెండు పార్టీలు పోటీ పడుతున్నాయని ఆయన తీవ్రస్థాయిలో విమర్శించారు. "ప్రజలకు గోరంత, తమకు కొండంత" అన్నట్లుగా ఈ పార్టీల తీరు ఉందని, అందుకే రాష్ట్రానికి మరో రాజకీయ ప్రత్యామ్నాయం అవసరమని ఆయన నొక్కి చెప్పారు.

ఉద్యోగాల పేరుతో యూట్యూబర్ మోసం

విమానాశ్రయంలో ఆమెను గుర్తించి అరెస్ట్ చేశారు. అనంతరం ఆమెను ఇబ్రహీంపట్నం పోలీసులకు అప్పగించారు. వివరాల్లోకి వెళితే.. నందన, ఆమె భర్త కలిసి లండన్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తామని పలువురి నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేశారని ఆరోపణలు ఉన్నాయి. ఈ మోసంపై బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇబ్రహీంపట్నం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసులో భాగంగానే ఆమెపై లుకౌట్ నోటీసులు జారీ అయ్యాయి. ఈ క్రమంలో సోమవారం శంషాబాద్ విమానాశ్రయానికి వచ్చిన నందనను ఇమ్మిగ్రేషన్ అధికారులు గుర్తించి, ఎయిర్‌పోర్ట్ పోలీసులకు సమాచారం అందించారు. వారు వెంటనే ఆమెను అదుపులోకి తీసుకుని, కేసు విచారణ చేస్తున్న ఇబ్రహీంపట్నం పోలీసులకు అప్పగించారు. ఈ ఘటనకు సంబంధించి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది. పోలీసులు కేసు దర్యాప్తును కొనసాగిస్తున్నారు.

నెల్లూరులో యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ కు ఘనస్వాగతం

పాల్గొనేందుకు ఆయన జిల్లాకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయనకు రాష్ట్ర మంత్రులు డాక్టర్ పొంగూరు నారాయణ, వై. సత్యకుమార్ సాదరంగా స్వాగతం పలికారు.అక్షర విద్యాలయం పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌లో దిగిన యోగికి మంత్రులతో పాటు మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు కుమార్తె, ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ దీపా వెంకట్, కుమారుడు హర్షవర్ధన్, ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, జిల్లా కలెక్టర్, ఎస్పీ తదితరులు స్వాగతం పలికారు. అనంతరం యోగి అక్షర విద్యాలయం ప్రాంగణంలో ఉన్న సోమా సాంకేతిక శిక్షణ కేంద్రాన్ని సందర్శించారు.అక్కడ నైపుణ్య శిక్షణ పొందుతున్న యువతీయువకులతో ఆయన ముఖాముఖి నిర్వహించారు. వారికి అందుతున్న సాంకేతిక శిక్షణ, భవిష్యత్ అవకాశాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్వర్ణ భారత్ ట్రస్ట్ అందిస్తున్న సేవలను, అక్షర విద్యాలయం ద్వారా గ్రామీణ యువతకు ఉపాధి కల్పనకు చేస్తున్న కృషిని యోగి ఆదిత్యానాథ్ ప్రశంసించారు. ప్రాంగణంలో విద్యార్థులు నిర్వహించిన స్కేటింగ్ ప్రదర్శనను కూడా ఆయన ఆసక్తిగా తిలకించారు. మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు స్ఫూర్తితో 2001లో ఏర్పాటైన స్వర్ణ భారత్ ట్రస్ట్, గ్రామీణ యువతకు ఉచిత నైపుణ్య శిక్షణ, ఆరోగ్య సేవలు అందిస్తూ 25 ఏళ్లు పూర్తి చేసుకుంది. ఈ రజతోత్సవ వేడుకల్లో భాగంగా యోగి ఆదిత్యానాథ్ భోజనానంతరం ట్రస్ట్ ప్రాంగణానికి చేరుకుని, అక్కడ నిర్వహిస్తున్న ఇతర సేవా కార్యక్రమాలను పరిశీలిస్తారు. అనంతరం ప్రజా మందిరంలో జరిగే ప్రధాన సభలో ముఖ్య అతిథిగా ప్రసంగిస్తారు. ఆయన పర్యటన నేపథ్యంలో జిల్లా యంత్రాంగం పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసింది.

నిరుద్యోగులపై బురదజల్లుతారా?

వారిపై బురదజల్లడాన్ని వైసీపీ నేతలు వెంటనే మానుకోవాలని హితవు పలికారు. 2018 డీఎస్సీలో తృటిలో ఉద్యోగం కోల్పోయినప్పటికీ నిరాశ చెందకుండా.. ఏడేళ్ల పాటు పట్టుదలతో, రాత్రింబవళ్లు తేడా లేకుండా చదివ

అర్హులైన పేదలకు పింఛన్లు అందేలా చూడాలి

అధికారులతో బీజేపీ నేతల చర్చ

సచివాలయంలో దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని విజ్ఞప్తి సచివాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేసిన బీజేపీ నేతలు

నంది పత్రిక కర్నూలు ప్రతినిధి రాష్ట్ర ప్రభుత్వం నూతన పింఛన్ల మంజూరు ప్రక్రియను ప్రారంభించిన నేపథ్యంలో, కల్లూరు మండల పరిధిలోని స్వర్ణ భగవాన్ నగర్ సచివాలయాన్ని సోమవారం బీజేపీ నాయకుల బృందం సందర్శించింది. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బంది, సంక్షేమ అధికారులతో సమావేశమై అర్హులైన పేదలందరికీ పింఛన్లు సత్వరమే అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.అర్హులెవరూ నష్టపోకూడదు బీజేపీ మండల ఉపాధ్యక్షుడు నాగేంద్రుడు: ఈ సందర్భంగా బీజేపీ కల్లూరు మండల ఉపాధ్యక్షుడు నాగేంద్రుడు ప్రత్యేకంగా మాట్లాడుతూ.. "ప్రభుత్వం అందించే సామాజిక భద్రతా పింఛన్లు నిరుపేదలకు, వృద్ధులకు, వికలాంగులకు జీవనాధారం. అర్హత ఉండి పింఛన్లు రాని వారి పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని అధికారులు మానవతా దృక్పథంతో వ్యవహరించాలి. సాంకేతిక కారణాలు లేదా నిర్లక్ష్యం వల్ల ఏ ఒక్క నిరుపేద అర్హుడూ పింఛన్ కోల్పోకూడదు. కొత్తగా దరఖాస్తు చేసుకునే పేదలకు సచివాలయ సిబ్బంది పూర్తి సమాచారం అందించి సహకరించాలి. ప్రతి ఒక్క దరఖాస్తును నిష్పక్షపాతంగా, వేగంగా పరిశీలించి పైఅధికారులకు నివేదించి అర్హులందరికీ న్యాయం జరిగేలా చూడాలి" అని ఆయన అధికారులను గట్టిగా డిమాండ్ చేశారు.

కొత్త దరఖాస్తుల స్వీకరణ వేగవంతం చేయాలి: బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు యాదవ్ మాట్లాడుతూ, గ్రామంలో పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న అర్హులైన లబ్ధిదారుల వివరాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. రాజకీయాలకు అతీతంగా, పారదర్శకంగా దరఖాస్తుల పరిశీలన జరగాలని స్పష్టం చేశారు. అలాగే పింఛన్ రాని అర్హులైన గ్రామస్థులు తగిన ధ్రువీకరణ పత్రాలతో సచివాలయానికి వచ్చి వెంటనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పాల్గొన్న నాయకులు:ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు యాదవ్, బీజేపీ కల్లూరు మండల ఉపాధ్యక్షుడు పి .నాగేంద్రుడు, మండల నాయకులు కే. భాస్కర్, రైతు నాయకులు, స్థానిక కార్యకర్తలు మరియు సచివాలయం సిబ్బంది జయరాం, లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

టిడిపి, వైకాపా రాహు కేతువులు.

దొందూ దొందే.

స్థానిక ఎన్నికల్లో రెండు పార్టీలను చిత్తుచిత్తుగా ఓడించండి. గుడ్, ఓల్డ్,గ్రాండ్ కాంగ్రెస్ పార్టీని గెలిపించండి. డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి.

కడప.07-09-2026, త్వరలో జరగబోవు స్థానిక ప్రభుత్వాల ఎన్నికల్లో ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని రాజ్యసభ మాజీ సభ్యులు,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు.సోమవారం కడపలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో తులసిరెడ్డి మీడియా సమావేశంలో మాట్లాడుతూ టిడిపి, వైకాపా పార్టీలు రాష్ట్రానికి పట్టిన రాహు కేతువులని,దొందూ దొందే అని విరుచుకుపడ్డారు. వైకాపా పార్టీ అరచేతిలో వైకుంఠం చూపించగా, టిడిపి అరచేతిలో కైలాసం చూపిస్తోందన్నారు.ఆ రెండు పార్టీలది సవతుల కొట్లాటగా తయారైందన్నారు.

వైకాపా ప్రభుత్వం. వైకాపా పార్టీ రాష్ట్రాన్ని అప్పుల,అరాచక, అవినీతి,మద్య, జూద,డ్రగ్స్,గంజాయి ఆంధ్ర ప్రదేశ్ గా తయారుచేసి అధికారం కోల్పోయింది అన్నారు.

కూటమి ప్రభుత్వం. అతని కంటే ఘనుడు ఆచంట మల్లన్న అన్నట్లు చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం అంతకంటే అధ్వాన్నంగా తయారైందన్నారు. రాష్ట్రం అప్పుల కుప్ప అయింది.నిత్యవసర వస్తువుల ధరలు సామాన్యునికి అందుబాటులో లేవు. మద్యం,గంజాయి, డ్రగ్స్ విచ్చలవిడి అయ్యాయి అని తులసి రెడ్డి ధ్వజమెత్తారు.

కడప నగరాభివృద్ధి. కాంగ్రెస్ హయాంలోనే 2004 నవంబర్ 17న కడప మున్సిపాలిటీ కార్పొరేషన్ కావడం జరిగింది. 2004 – 2014 మధ్య కాంగ్రెస్ పాలనలో కడప నగరంలో అద్భుతమైన ప్రగతి జరిగింది.

1. రిమ్స్ వైద్య కళాశాల ఏర్పాటు. 2. డెంటల్ కళాశాల ఏర్పాటు. 3. నర్సింగ్ కళాశాల ఏర్పాటు. 4. స్పోర్ట్స్ స్కూల్ ఏర్పాటు. 5. క్రికెట్ స్టేడియం ఏర్పాటు. 6. సెంట్రల్ స్కూల్ ఏర్పాటు. 7. విమానాశ్రయం ఆధునికీకరణ. 8. యోగి వేమన విశ్వవిద్యాలయం ఏర్పాటు.9. శాటిలైట్ సిటీ ఏర్పాటు. 10. సింగపూర్ టౌన్షిప్ ఏర్పాటు. 11. బుగ్గ వంకపై 4 హై లెవెల్ బ్రిడ్జిలు ఏర్పాటు 12. బుగ్గ వంక సుందరీకరణ.

కాంగ్రెస్ పాలనలో సంక్షేమ కార్యక్రమాలు.

1. ఆరోగ్యశ్రీ. 2. 108 సేవలు.3. 104 సేవలు. 4. ఫీజు రీయింబర్స్మెంట్ 5. పావలా వడ్డీ పథకం.6. అభయహస్తం.7. అమ్మ హస్తం 8. బంగారు తల్లి పథకం.

కాంగ్రెస్ పాలనలో సామాజిక న్యాయం. 1. ఎస్సీలకు 15% రిజర్వేషన్లు. 2. ఎస్టీలకు 6% రిజర్వేషన్లు. 3. బీసీలకు విద్యా ఉద్యోగాలలో 25 శాతం స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్లు. 4. ముస్లిం మైనారిటీలకు విద్యా ఉద్యోగాలలో 4 శాతం రిజర్వేషన్ లు. 5. ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ కు చట్టబద్ధత.

కాంగ్రెస్ పార్టీ అందరి పార్టీ. మిగతా పార్టీలు కొందరి పార్టీలు. రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో వైకాపా, టీడీపీల ప్రలోభాలకు లోను కాకుండా హస్తం గుర్తుపై ఓటు వేసి గుడ్,ఓల్డ్,గ్రాండ్ పార్టీ అయిన కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని తులసి రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మీడియా సమావేశంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు అబ్దుల్ సత్తార్, ప్రముఖ సంఘ సేవకులు సయ్యద్ సలావుద్దీన్, డిసిసి ఉపాధ్యక్షులు సిరాజుద్దీన్, కదిరి ప్రసాద్ గౌడ్, కోటపాటి లక్ష్మయ్య, కేకేసి జిల్లా చైర్మన్ దాసరి శ్రీనివాసులు, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మైనుద్దీన్, మైనార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కమాల్ భాష, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలగిరి శివ, కేకేసి నగర చైర్మన్ షామీర్ హుస్సేన్, మహిళా కాంగ్రెస్ మాజీ జిల్లా అధ్యక్షురాలు శ్యామలమ్మ, డిసిసి ప్రధాన కార్యదర్శి సుధాకర్, డిసిసి కోశాధికారి పాలెం హరిప్రసాద్, జహూర్ అహ్మద్, ఆసిఫ్ అలీ ఖాన్, పఠాన్ అబిద్ ఖాన్, కొర్ర గంగాధర్, సాంబశివుడు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఉత్తన్న, అమర్నాథ్ రెడ్డి, తోపిరెడ్డి, ఐచర్ రమణ, గంగాధర్ పుల్లి రిపు, పవన్, వెంకటరమణ, వంశీ ,మోతిలాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ, జౌళి శాఖ మంత్రి సవితమ్మ ని కలిసిన విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్ పర్సన్ కమ్మరి పార్వతమ్మ డైరెక్టర్ తునికి పాటి శివ

కర్నూల్ సిటీ నంది పత్రిక అమరావతిలో రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మాత్యులు సవితమ్మ ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంక్షేమ మరియు అభివృద్ధి కార్పొరేషన్ చైర్ పర్సన్ కమ్మరి పార్వతమ్మ మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా సెప్టెంబర్ 17న జరగనున్న విశ్వకర్మ జయంతి యజ్ఞ మహోత్సవాన్ని రాష్ట్రస్థాయి వేడుకగా నిర్వహించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ప్రతి సంవత్సరం ప్రభుత్వం జీ.ఓ. ఇచ్చి, నిధులు కేటాయించి ఈ వేడుకను అధికారికంగా నిర్వహిస్తున్న విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.ఈ ఏడాది వేడుకను విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో మంత్రి సవితమ్మ అధ్యక్షతన, రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు , ఉప ముఖ్యమంత్రి వర్యులు కొణిదల పవన్ కళ్యాణ్ విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ని ప్రత్యేక అతిథులుగా ఆహ్వానించి ఘనంగా నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు దీనికి మంత్రి సవితమ్మ సానుకూలంగా స్పందిస్తూ, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని కమ్మరి పార్వతమ్మ తెలిపారు.



ప్రజలతో ప్రత్యక్ష సంభాషణే పరిష్కార మార్గం

ఫిర్యాదుల పరిష్కారానికి క్షేత్రస్థాయిలోకి వెళ్లాల్సిందే ప్రజా ఫిర్యాదుల స్వీకరణకు 18 అర్జీలు నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు

కర్నూల్ సిటీ నంది పత్రిక కర్నూలు నగర ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుని, వాటికి సత్వర పరిష్కారం చూపేందుకు ప్రజలతో ప్రత్యక్ష సంభాషణే అత్యంత ప్రభావవంతమైన మార్గమని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు పేర్కొన్నారు. ప్రజల నుంచి వివిధ రూపాల్లో అందుతున్న ఫిర్యాదులను పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో పర్యటించి వాస్తవ పరిస్థితులను పరిశీలించాలని ఆయన స్పష్టం చేశారు.స్థానిక ఎస్బీఐ ఎంప్లాయీస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో మొత్తం 18 అర్జీలు స్వీకరించారు. ప్రతి అర్జీని సంబంధిత శాఖల ద్వారా పరిశీలించి, సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని కమిషనర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్.జి.వి. కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, ఎస్.ఈ. రమణమూర్తి, ప్రజారోగ్య అధికారి డాక్టర్ ఎం. రఘు, డిసిపి శబ్నం శాస్త్రీ, ఏసీపీ నాగరాజు, కార్యదర్శి నాగరాజు, మేనేజర్ జునైద్, ఆర్వోలు క్రిస్టోఫర్, వాజిద్ తదితర అధికారులు పాల్గొన్నారు.



షేక్ హాజీ గౌస్ గారికి శ్రీ కాళోజీ నారాయణరావు జాతీయ పురస్కారం

కడప నంది పత్రిక ప్రతినిధి సెప్టెంబర్ 07 ఖాజీపేట–వైఎస్ఆర్ కడప జిల్లా– నెల్లూరు జిల్లా నెల్లూరు పట్టణంలో దేవి శెట్టి స్వాములు రాజేశ్వరి కళ్యాణ మండపంలో విద్యా ప్రదాత, స్వర్గీయ శ్రీ ముప్పవరపు వెంకటేశ్వరరావు గారు విశ్రాంత అధ్యాపకులు, స్వర్గీయ శ్రీమతి ముప్పవరపు ఆదిలక్ష్మి గారు జ్ఞాపకార్థాలతో ,యం.వి రావు ఫౌండేషన్ చైర్మన్ యం.లీలా మోహన్ కృష్ణ గారి ఆధ్వర్యంలో జరిగిన జాతీయ పురస్కారాల కార్యక్రమంలో సూక్ష్మ నిర్మాణాల కళాకారులు, కవి షేక్ హాజీ గౌస్ గారికి శ్రీ కాళోజీ నారాయణరావు జాతీయ పురస్కారం సినీ గీత రచయిత, నటుడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉగాది పురస్కార గ్రహీత సాధనాల వెంకటస్వామి నాయుడు గారు, ఎం.బి లోకనాథ్ రిటైర్డ్ ప్రిన్సిపాల్ గారు వారి చేతుల మీదుగా ఈ పురస్కారం అందుకున్నాను.

బొంగు వారి పెళ్లి వేడుకల్లో రెడ్డం

కడప నంది పత్రిక ప్రతినిధి సెప్టెంబర్ 07 ఖాజీపేట మండలం అగ్రహారానికి చెందిన బొంగు సిద్దేశ్వరిదివంగత బొంగు శ్రీనివాసులు కనిష్ట కుమారుడు మణికంఠ, లక్ష్మీల వివాహ వేడుకలు సోమవారం శ్రీ నాగనాథేశ్వర స్వామి కోనలోని శ్రీ కాశినాయన గుడి కళ్యాణ మండపంలో ఘనంగా జరిగాయి. ఈ వివాహ వేడుకలకు వైఎస్సార్సీపీ రాష్ట్ర కార్యదర్శి రెడ్డం వెంకటసుబ్బారెడ్డి హాజరై నూతన వధూవరులను అక్షింతలు వేసి ఆశీర్వదించారు. నూతన దంపతులు కలకాలం సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు.

ఆమరణ దీక్షకు సిద్ధం

తాహసిల్దార్ కార్యాలయాన్ని ముట్టడించిన సీపీఐ నాయకులు

కొత్తపల్లి – నంది పత్రిక: ఎన్నినో ప్రభావంతో కరువుతో అల్లాడుతున్న కొత్తపల్లి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని లేకపోతే వచ్చే సోమవారం ఆమరణ దీక్షకు దిగుతామని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.రమేష్ బాబు హెచ్చరించారు. సోమవారం సీపీఐ మండల కార్యదర్శి వెంకటశివుడు ఆధ్వర్యంలో రైతులతో కలిసి తహసిల్దార్ కార్యాలయాన్ని ముట్టడి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాట్లాడుతూ మండలంలోని 12 గ్రామాల్లో 7 వేల హెక్టార్లలో రైతులు పంటలు సాగు చేశారన్నారు. ఎల్సినో ప్రభావం పల్ల ఇప్పటికే 6 వేల హెక్టర్లలో పంటలను చెడగొట్టి పశువులకు మేతగా ఉపయోగిస్తూ నష్టాల ఊబిలో రైతులు ఉన్నారన్నారు. నష్ట పోయిన రైతులకు ఎకరాకు రూ. 50వేలు చెల్లించాలన్నారు. శ్రీశైలం ప్రాజెక్టుకై సర్వం త్యాగం చేసిన మండల రైతాంగానికి కనీసం త్రాగడానికి కూడా నీరు అందించలేని స్థితిలో పాలకులు ఉన్నారంటే సిగ్గు చేటన్నారు. సిద్దాపురం ఎత్తిపోతలను కొత్తపల్లి మండలానికి విస్తరింప చేసి దాని ద్వారా మండలంలోని కొత్తపల్లి, గువ్వలకుంట్ల, వీరాపురం, పాలెం చెరువు, నందికుంట, బావాపురం తదితర గ్రామాల ప్రజలకు, రైతులకు త్రాగు, సాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మండలాన్ని కరువు మండలంగా ప్రకటించకపోతే వచ్చే సోమవారం ఆమరణ దీక్షకు రైతాంగం. సిద్ధపడుతుందని హెచ్చరించారు. విషయాన్ని తహసీల్దార్ ఉమారాణి తెలియజేయగా ఆమె ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెలతానని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు తాలూకా కార్యదర్శి ప్రతాప్, సీపీఐ నాయకులు దూద్ పీరా, మహిళా సమైక్య నాయకులు మూర్తిజూబీ, రైతు సంఘం నాయకులు షేక్షావలి, లింగారెడ్డి, బీమలింగం, సురేష్ బాలకృష్ణ, పెద్ద రాజు, చిన్న స్వామి, శ్రీనివాసులు, మోహన్ పుల్లారెడ్డి, రైతులు పాల్గొన్నారు..!

అఖిల్ ను పరామర్శించిన తులసి రెడ్డి.

కడప.07-09-2026, కడప జిల్లా యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నంది మండలం వెంకటసుబ్బయ్య(అఖిల్) ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. ఈ విషయం తెలిచిన రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు సిరాజుద్దీన్, కదిరి ప్రసాద్ గౌడ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు మైనుద్దీన్, అమర్నాథ్ రెడ్డి,ఉత్తన్న,తోపిరెడ్డి రవీంద్రనాథరెడ్డి, ఐచర్ రమణ తదితరులు పరామర్శించారు. అఖిల్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

లీడర్షిప్ కాన్క్లేవ్లో పాల్గొన్న కర్నూలు జిల్లా టీడీపీ అధ్యక్షురాలు గుడిసె ఆది కృష్ణమ్మ

కర్నూల్ సిటీ నందిపత్రిక మంగళగిరి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహిస్తున్న రెండు రోజుల లీడర్షిప్ కాన్క్లేవ్ శిక్షణ తరగతుల్లో కర్నూలు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు గుడిసె ఆది కృష్ణమ్మ పాల్గొన్నారు.పార్టీ నాయకత్వ పటిమను పెంపొందించడం, పార్టీ సిద్ధాంతాలు, ప్రజలతో మరింత సమర్థవంతంగా మమేకం కావడం, కార్యకర్తలతో సమన్వయం, పార్టీ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించడం వంటి అంశాలపై ఈ రెండు రోజుల శిక్షణ తరగతుల్లో అవగాహన కల్పిస్తున్నారు. నాయకులు, కార్యకర్తల్లో నాయకత్వ లక్షణాలను మరింతగా పెంపొందించి, పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడమే ఈ శిక్షణ తరగతుల ప్రధాన ఉద్దేశ్యమని పేర్కొన్నారు.



వైఎస్సార్‌సీపీ జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో ఖాజీపేట నాయకులు

కడప నంది పత్రిక ప్రతినిధి సెప్టెంబర్ 07 : కడప నగరంలోని కడప కన్వెన్షన్ హాల్‌లో సోమవారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో మైదుకూరు నియోజకవర్గం, ఖాజీపేట మండలానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ డి. మురళీమోహన్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పీవీ రాఘవ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు డి.బి. కొండారెడ్డి ఖాజీపేట మండలం నుంచి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతం, క్షేత్రస్థాయిలో పార్టీ కార్యక్రమాల నిర్వహణ, ప్రజా సమస్యలపై చర్చించారు. రాబోయే రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సమావేశంలో నిర్ణయించారు. నియోజకవర్గంలో పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తూ ప్రజలకు మరింత చేరువ కావాలని నాయకులు పేర్కొన్నారు.

ఆశ వర్కర్స్ కు కనీస వేతనాలు ఇవ్వాలి. ఏఐటీయూసీ

కర్నూల్ సిటీ నంది పత్రిక గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న ఆశ వర్కర్లు కు శ్రమ దోపిడి గురవుతున్నారని సుప్రీంకోర్టు తీర్పు మేరకు సమాన పనికి సమాన వేతనాలు అమలు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నక్కి లెనిన్ బాబు,ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమజాబి డిమాండ్ చేశారు. సోమవారం నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని పి జి ఆర్ ఎస్ జిల్లా జాయింట్ కలెక్టర్ కి వినతి పత్రం అందించారు. కరోనా లాంటి అతి భయంకరమైన కాలంలో ప్రజలకు వైద్య సేవలు అందించడంలో కీలకపాత్ర పోషించిన ఆశ వర్కర్లకు కనీస వేతనాలు రావడం లేదని కేవలం పదివేల రూపాయలతో ఎలా జీవిస్తారని ప్రశ్నించారు. కనీస వేతనం నెలకి 26 వేల రూపాయలు ఇవ్వడంతోపాటు 8 గంటల పని విధానాన్ని అమలు చేయాలని జనాభా పెరుగుతున్న నేపథ్యంలో ఆశా వర్కర్స్ ఉద్యోగాలు పెంచాలని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో 24 గంటలు ఉండాలని నిబంధనతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. స్కూల్ పిల్లల పథకాన్ని కూడా అమలు చేయాలని, ఆశ వర్కర్స్ ను ప్రభుత్వ ఉద్యోగులుగా రెగ్యులర్ చేసి సమాన వేతనాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు నరసరావు నగర అధ్యక్షులు జి చంద్రశేఖర్, ఈశ్వర్, డిప్యూటీ జనరల్ సెక్రెటరీ రామాంజనేయులు, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్ పట్ల ప్రజల్లో నమ్మకాన్ని పెంచాలి..!

జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

ఎల్‌నినో ప్రభావం, ప్రత్యామ్నాయ చర్యలపై ప్రజల్లో అవగాహన పెంచాలి

కడప, బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 7 నంది పత్రిక : ప్రజా సమస్యల పరిష్కారంలో నాణ్యత, పారదర్శకతతో పాటు ప్రజల్లో నమ్మకాన్ని పెంపొందించాలని... "ఎల్‌నినో" వాతావరణ మార్పులకు అనుగుణంగా ప్రత్యామ్నాయ చర్యలు, సాగు విధానాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ సభాభవన్ లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి.. జేసీ డా. నిధి మీనా తోకలిసి ప్రజల నుంచి నేరుగా వినతిపత్రాలు స్వీకరించారు. అనంతరం అధికారులతో జిలా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజల నుంచి అందిన ప్రతి అర్జీని క్షేత్రస్థాయిలో పరిశీలించి వాస్తవ పరిస్థితులను తెలుసుకున్న తర్వాతే తగిన పరిష్కారం చూపాలని సూచించారు. అర్జీల పరిష్కారంలో జాప్యానికి తావులేకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. పిజిఆర్ఎస్ వ్యవస్థపై అధికారులు పారదర్శకంగా వ్యవహరిస్తూ.. ప్రజల్లో నమ్మకాన్ని పెంపొందించాలన్నారు. ప్రజల్లో పీజీఆర్ఎస్ ద్వారా పరిష్కరించిన ఫిర్యాదులపై ప్రజల అభిప్రాయం ప్రభుత్వానికి ఎంతో ముఖ్యమని పేర్కొంటూ, అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో పీజీఆర్ఎస్ ఫీడ్‌బ్యాక్ క్యూఆర్ కోడ్‌లను తప్పనిసరిగా ప్రదర్శించాలని ఆదేశించారు. అలాగే ప్రజలు తమ ఫిర్యాదుల స్థితిగతులను టోల్‌ఫ్రీ నంబర్ 1100కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని తెలిపారు. తహసీల్దార్లు, శాఖాధిపతులు, పీజీఆర్ఎస్ సిబ్బంది ప్రజలకు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాలని ఆదేశించారు.

ఎల్ నినో ప్రభావంపై ప్రజల్లో అవగాహన పెంచాలి.. ఎల్‌నినో ప్రభావంతో వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పులను దృష్టిలో ఉంచుకుని ప్రత్యామ్నాయ చర్యలు, ప్రత్యామ్నాయ సాగు విధానాలపై జిల్లా ప్రజలు, రైతుల్లో అవగాహన పెంచాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు. వాతావరణ మార్పులు అనుగుణంగా పంటల సాగు, ప్రకృతి వ్యవసాయ విధానాలు, సేంద్రియ ఎరువుల వినియోగం, భూగర్భ జలాల సంరక్షణ, భూతాపాన్ని తగ్గించే చర్యలు, సాగు మరియు తాగునీటి పొదుపు వంటి అంశాలపై గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని రైతులు, ప్రజలకు విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్వో మల్లికార్జునుడు, డీసీవో వెంకట సుబ్బయ్య, డిప్యూటీ కలెక్టర్లు జాన్ ఇర్విన్, డీఆర్డీఏ పీడీ రాజ్యలక్ష్మి, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

విచారణ జరిపి చట్టపరంగా న్యాయం చేస్తాం

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమానికి 104 ఫిర్యాదులు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదుల పై త్వరితగతిన స్పందించి, పరిష్కరించాలని పోలీసు అధికారులను ఆదేశించిన కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్

కర్నూల్ సిటీ నంది పత్రిక కర్నూల్ కొత్తపేటలోని కర్నూల్ టూ టౌన్ పోలీస్ స్టేషన్ ప్రక్కన ఉన్న ఎస్పీ క్యాంపు కార్యాలయంలో కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు.జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం కు వచ్చిన ప్రజల సమస్యల వినతులను స్వీకరించి ఫిర్యాది దారులతో జిల్లా ఎస్పీ మాట్లాడి వారి యొక్క సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఈ రోజు మొత్తం 104 ఫిర్యాదులు వచ్చాయి.

వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని ... 1) నా భర్త మృతి చెందిన తర్వాత ఆయన భాగానికి రావాల్సిన ఆస్తి ఇవ్వకుండా , పొలంలో వరి నాటు వేయకుండా కుటుంబ సభ్యులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని, వారి పై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని కృష్ణగిరి మండలం, చిట్యాల గ్రామానికి చెందిన విజయలక్ష్మి ఫిర్యాదు చేశారు. 2) రుణాలు, ఉద్యోగాలు, నాన్ రిఫండబుల్ ఫండ్ కింద మల్టీ స్పెషాలిటి హాస్పిటల్స్ , రీసెర్చ్ సెంటర్లు ఏర్పాటు చేయిస్తామని దళిత శక్తి ఫౌండేషన్ పేరుతో పెద్ద మొత్తంలో డబ్బులు తీసుకుని కొందరు వ్యక్తులు మోసాలకు పాల్పడ్డారని చర్యలు తీసుకోవాలని కర్నూలు మండలం , స్టాంటన్‌పురం కు చెందిన మన్సూర్ అహ్మద్ ఫిర్యాదు చేశారు.3) విశాఖపట్నం, నెల్లూరు జిల్లాలలో పోర్టు ఏరియాలలో తన కుమారుడికి ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి మోసం చేసిన వ్యక్తి పై చర్యలు తీసుకోవాలని కర్నూలు శ్రీరామ్‌నగర్‌కు చెందిన లక్ష్మీదేవి ఫిర్యాదు చేశారు. 4) రస్తా ఇవ్వకుండా తన అన్న సుంకన్న ఇబ్బందులకు గురిచేస్తున్నారని, అతనిపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని కృష్ణగిరి మండలం, ఆగవెల్లి గ్రామానికి చెందిన పరమేష్ ఫిర్యాదు చేశారు. 5) కర్ణాటక గుల్బర్గా జెస్కాంలోని ఎలక్ట్రికల్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి ఫోర్జరీ సంతకాలతో మోసం చేసి రూ.5 లక్షలు తీసుకున్న ఇద్దరు వ్యక్తుల పై చర్యలు తీసుకోవాలని కోసిగి కి చెందిన ఒక వ్యక్తి ఫిర్యాదు చేశారు. 6) దిగువపాడుకు చెందిన కొందరు వ్యక్తులు ఫోన్ కాల్స్ చేసి రూ.లక్ష ఇవ్వాలని బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని కర్నూలు షరీఫ్‌నగర్‌కు చెందిన సాయికుమార్ ఫిర్యాదు చేశారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటి పై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేస్తామని, సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఈ సంధర్భంగా కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ హామీ ఇచ్చారు.ఈ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ హుస్సేన్ పీరా , సిబలు శివశంకర్, ఇస్మాయిల్ , మస్తాన్ వలి లు పాల్గొన్నారు.

ఏపీ పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో విజేతలుగా నిలిచిన .. కర్నూలు రేంజ్ పోలీసు క్రీడాకారులు.

మొత్తం 86 పతకాలు సాధించిన పోలీసు క్రీడాకారులు .

పోలీసు మహిళల విభాగంలో ఓవరాల్ ఛాంపియన్‌షిప్ లో మొదటి స్థానం.

పోలీసు పురుషుల విభాగంలో రెండవ స్థానం.

విజేతలను అభినందించిన కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ ఐపీఎస్

కర్నూల్ సిటీ నంది పత్రిక ఇటీవల గుంటూరు నాగార్జున యూనివర్సిటీలో సెప్టెంబర్ 1 నుంచి 4వ తేదీ వరకు నిర్వహించిన ఏపీ పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో కర్నూలు రేంజ్‌కు 86 పతకాలు రావడం జరిగిందని కర్నూల్ రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ ఐపీఎస్ సోమవారం కర్నూల్ రేంజ్ డిఐజీ కార్యాలయంలో తెలిపారు. కర్నూలు, నంద్యాల, వైఎస్ఆర్ కడప, అన్నమయ్య) జిల్లాల 54 మంది పోలీసు అధికారులు, సిబ్బంది వివిధ క్రీడాంశాల్లో ప్రతిభ కనబరిచారన్నారు.26 బంగారు, 32 వెండి, 28 కాంస్య పతకాలతో మొత్తం 86 పతకాలు సాధించారన్నారు. అథ్లెటిక్స్, వెయిట్‌లిఫ్టింగ్, త్రోబాల్, టెన్నిస్ తదితర క్రీడాంశాల్లో పోలీసు క్రీడాకారులు విజయం సాధించారన్నారు. మహిళల విభాగంలో ఓవరాల్ ఛాంపియన్‌షిప్ గా మొదటి స్థానం సాధించారన్నారు.పురుషుల విభాగంలో రెండవ స్థానంలో నిలిచారన్నారు. అలాగే సైంటిఫిక్ ఎయిడ్స్ ఇన్ ఇన్వెస్టిగేషన్ అండ్ క్రిమినాలజీ డ్యూటీ మీట్ విభాగంలో కర్నూలు రేంజ్‌కు చెందిన ఇన్‌స్పెక్టర్ కు ప్రథమ బహుమతి సాధించారన్నారు. ఈ సందర్భంగా సోమవారం కర్నూలు రేంజ్ డీఐజీ కార్యాలయంలో పతకాలు సాధించిన క్రీడాకారులను కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ ఐపీఎస్ అభినందించారు.క్రీడలు పోలీసు సిబ్బందిలో శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం, క్రమశిక్షణ పెంపొందిస్తాయని తెలిపారు.కర్నూలు రేంజ్‌కు మంచి పేరు తీసుకువచ్చిన పోలీసు క్రీడాకారులు భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని డీఐజీ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కర్నూలు ఏఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణ మోహన్, నంద్యాల ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, పోలీసు క్రీడాకారులు పాల్గొన్నారు.

రైల్వే బ్రిడ్జి నిర్మాణ పనులు త్వరగా పూర్తిచేసి ట్రాఫిక్ సమస్య నుండి నగర ప్రజలను కాపాడండి

సిపిఐ నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి

కర్నూల్ సిటీ నంది పత్రిక భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ కర్నూల్ నగర సమితి ఆధ్వర్యంలో సోమవారం కొత్త బస్టాండ్ దగ్గర ఉన్న ఈద్గా ఎదురుగా రైల్వే బ్రిడ్జి పనులు కొన్ని నెలలుగా నత్త నడకన సాగుతున్నాయి, రైల్వే బ్రిడ్జి పనులు త్వరగా పూర్తి చేసి ట్రాఫిక్ సమస్యల నుండి నగర ప్రజలను కాపాడాలని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ నగర సమితి ఆధ్వర్యంలో సుందరయ్య సర్కిల్ నుంచి ర్యాలీగా వచ్చి రైల్వే బ్రిడ్జి పనులు జరిగే దగ్గర ధర్నా చేపట్టడం జరిగింది ఈ ధర్నా కార్యక్రమానికి అధ్యక్షులుగా సిపిఐ నగర కార్యవర్గ సభ్యులు బిసన్న అధ్యక్షతన ధర్నా జరిగింది ఈ కార్యక్రమంలో సిపిఐ నగర కార్యదర్శి పి రామకృష్ణారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులుకె శ్రీనివాసులు పాల్గొన్నారు ఈ సందర్భంగా పి.రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ గత ఆరేడు నెలలుగా రైల్వే బ్రిడ్జి పనులు నత్త నడకన సాగుతుందని రైల్వే బ్రిడ్జి పనులు నెమ్మదిగా సాగడం ద్వారా కర్నూల్ నగరంలోని ప్రజలు ట్రాఫిక్ సమస్యతో అనేక ఇబ్బందులకు గురవుతున్నారని కొన్ని సందర్భాల్లో అయితే ట్రాఫిక్ లో అంబులెన్స్ ను ఇరుక్కుని పోయి పేషెంట్ ప్రాణాలు పోయినటువంటి పరిస్థితి ఉన్నదని తక్షణమే రైల్వే బ్రిడ్జి పనులు పూర్తి చేసి నగర ప్రజలను ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా కాపాడాలని జిల్లా కలెక్టర్ కి మున్సిపల్ కమిషనర్ కి రైల్వే అధికారులను వారు డిమాండ్ చేశారు లేని పక్షంలో ప్రజలతో సంతకాల సేకరణ చేపట్టి ఈ ఆందోళన కార్యక్రమంలో ప్రజలను భాగస్వామ్యం చేస్తామని వారు అన్నారు అలాగే నగరంలో ఎక్కడ చూసినా నగర ప్రజలు ట్రాఫిక్ తో ఇబ్బందులు పడుతున్నారు ఈ నగరానికి ఒక మంత్రి ఇద్దరు ఎమ్మెల్యేలు ప్రాతినిధ్య వహిస్తున్నప్పటికీ ట్రాఫిక్ తో ఇబ్బంది పడుతున్న ప్రాంతాల దగ్గర ఫ్లై ఓవర్ బ్రిడ్జిలు నిర్మాణం చేయాలనే కనీస ఆలోచన ప్రజా ప్రతినిధులు లేకపోవడం చాలా బాధాకరమని వారన్నారు తక్షణమే రైల్వే బ్రిడ్జి పనులను పూర్తి చేసి రహదారిని త్వరగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ధర్నా సందర్భంగా ప్రభుత్వా అధికారులను వారు డిమాండ్ చేశారు ఈ ధర్నా కార్యక్రమంలో సిపిఐ నగర కార్యవర్గ సభ్యులు నాగరాజు, అన్వర్, కుమార్, నల్లన్న, రామచంద్ర, భద్ర కుమారు శాఖ కార్యదర్శి ధనలక్ష్మి, సుంకన్న, నాగరాజు, వెంకటేశ్వరమ్మ, నాగరాజు, చంటి, మున్ని, సుంకన్న, రాజు, ప్రసాదు, అశోకు, మరియు పార్టీ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

9న నంద్యాలలో ఏపీ మీడియా ఫెడరేషన్ సమావేశం

బండి ఆత్మకూరు నంది పత్రిక సెప్టెంబర్ 7: ఈనెల 9న నంద్యాలలో ఆంధ్రప్రదేశ్ మీడియా ఫెడరేషన్ వ్యవస్థాపకులు ఢిల్లీ బాబు రెడ్డి సహకారంతో జర్నలిస్టుల సమావేశాన్ని నిర్వహించనున్నట్లు నంద్యాల జిల్లా మీడియా ఫెడరేషన్ కన్వీనర్ పిట్టం నాగవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. నంద్యాలలోని రామకృష్ణ పి జి కళాశాలలో జర్నలిస్టుల సమావేశాన్ని నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. నవ్యాంధ్రప్రదేశ్ నిర్మాణంలో భాగంగా కొత్త రాష్ట్రంలో అనేక రకాలైన సవాలను ఎదుర్కొంటున్న ప్రజలతోపాటు,ఆంధ్రప్రదేశ్ మీడియా ఫెడరేషన్ సభ్యులు కూడా భాగస్వాములు అవుతున్నారని పేర్కొన్నారు. కొన్ని జర్నలిస్టు సంఘాలు రాష్ట్రంలో ఉన్నప్పటికీ అవి ఉమ్మడి రాష్ట్రాల్లోనే పనిచేస్తున్నాయని అన్నారు. వారి ఆశయాలు కార్యక్రమాలు పద్ధతులు పాత రీతిలోనే ఉన్నాయని అన్నారు. రాష్ట్ర విభజన తర్వాత పని ప్రారంభించి కొత్త రిజిస్ట్రేషన్ లతో ఆంధ్ర ప్రదేశ్ లో మీడియా ఫెడరేషన్ పనిచేస్తుందని అన్నారు. ప్రత్యేక రీతిలో పోరాట ప్రతిమను పెంపొందించుకొని కేవలం రాష్ట్రంలో ఉన్న జర్నలిస్టుల సంక్షేమం కొరకు మాత్రమే ఆవిర్భవించిందని అన్నారు. ప్రభుత్వం ఇస్తున్న రాయితీల కోసం ఈ వృత్తిలో పనిచేస్తున్న వారిని బేషరతుగా తిరస్కరిస్తామని అన్నారు. జర్నలిస్టు వృత్తికి అంకితమై పని చేసే వారిని వృత్తిపై ఆధారపడి పనిచేస్తున్న జర్నలిస్టు మిత్రులకు అండగా నిలిచి ఇతర రాష్ట్రాలలోని వారికి అమలవుతున్న సంక్షేమ పథకాలను వృత్తి సంబంధమైన అంశాలపై వారికి అవగాహన కల్పించి వాటి సాధనకు మీడియా ఫెడరేషన్ పోరాటం సాగిస్తుందని అన్నారు. జిల్లాలో జర్నలిస్టు సోదరులకు సమస్యలు ఏర్పడిన తరుణంలో వాటిని పరిష్కరించేందుకు జిల్లా అడ్ హాక్ కమిటీ ప్రత్యేకంగా పనిచేస్తుందని అన్నారు.ఈ బాటలో ప్రయత్నాలలో కార్యక్రమాలలో అందరి సహకారం ఆశిస్తూ కొత్త పంథాలో ముందుకు సాగేందుకు జర్నలిస్టు మిత్రులు చేయూతనివ్వాలని జిల్లా ఆహ్వాన కమిటీ సభ్యులు నాగ వర్ధనరెడ్డి,శివకుమార్ రెడ్డి, ఎం శ్రీనివాసులు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశానికి మైనార్టీ శాఖ మంత్రి ఫరూక్, రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి,నంద్యాల పార్లమెంటు సభ్యురాలు డాక్టర్ శబరి,ఎమ్మెల్యేలు బుడ్డా రాజశేఖర్ రెడ్డి,అఖిలప్రియ, గౌరు చరితారెడ్డి , జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియ, జిల్లా ఎస్పీ సునీల్ షోరాన్, నంద్యాల బిజెపి జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు, జిల్లా టిడిపి ప్రధాన కార్యదర్శి ఫిరోజ్, శాంతిరాం విద్యాసంస్థల చైర్మన్ శాంతి రాముడు, రామకృష్ణ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ జి రామకృష్ణారెడ్డి, తోపాటు జిల్లాలోని మాజీ ఎమ్మెల్యేల తోపాటు, కర్నూలు అనంతపురం నెల్లూరు జిల్లాలకు చెందిన మీడియా ఫెడరేషన్ ప్రతినిధులతో పాటు, జిల్లాలోని మీడియా ఫెడరేషన్ ప్రతినిధులు అందరూ హాజరవుతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని జర్నలిస్టు మిత్రులందరూ పాల్గొని జయప్రదం చేయాలని నంద్యాల జిల్లా మీడియా ఫెడరేషన్ ఆహ్వాన కమిటీ విజ్ఞప్తి చేసింది.

చిన్న విగ్రహాలతో వినాయక చవితి జరుపుకుందాం

ఏడు లక్షల మంది తాగునీటి అవసరాలకే నీటికి తొలి ప్రాధాన్యత

1 లేదా 1.5 అడుగుల లోపు మట్టి విగ్రహాలతో పండుగ జరుపుకుందాం

బకెట్లు, టబ్బుల్లో స్థానికంగానే నిమజ్జనం చేసుకుందాం

ఇప్పటికే తెచ్చుకున్న పెద్ద విగ్రహాల భద్రత కోసం ఐదు ప్రత్యేక మైదానాలు

వర్షాలు కురిస్తే వినాయక ఘాట్ వద్ద నీటిని నిల్వ చేసేందుకు అడ్డుకట్ట నిర్మాణం

నగర ప్రజలు, వినాయక ఉత్సవ కమిటీలు సహకరించాలి

నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు

కర్నూల్ సిటీ నంది పత్రిక ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితుల కారణంగా నీటి లభ్యత తగ్గిన నేపథ్యంలో ఈ ఏడాది వినాయక చవితి పండుగను చిన్న మట్టి విగ్రహాలతో నిర్వహించుకుని, స్థానికంగానే నిమజ్జనం చేసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు నగర ప్రజలకు పిలుపునిచ్చారు. నగరంలోని ఏడు లక్షల మంది ప్రజల తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని తాగునీటిని వినాయక నిమజ్జనం కోసం వినియోగించలేమని స్పష్టం చేశారు. సోమవారం స్థానిక ఎస్‌బీఐ ఎంప్లాయీస్ కాలనీలోని నగరపాలక సంస్థ సమావేశ భవనంలో మున్సిపల్, జలవనరుల శాఖ అధికారులతో కలిసి కమిషనర్ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. వినాయక నిమజ్జనం కోసం నగరపాలక సంస్థ అన్ని విధాలా సిద్ధంగా ఉందని, అయితే ప్రస్తుత నీటి పరిస్థితుల కారణంగా కేసీ కెనాల్‌లోని వినాయక ఘాట్‌కు నిమజ్జనం కోసం నీటిని విడుదల చేసే పరిస్థితి లేదన్నారు. సుంకేసుల, గాజులదిన్నె తదితర జలాశయాలు, ప్రాజెక్టుల్లో అదనపు నీరు అందుబాటులో లేదని తెలిపారు. మంత్రి టీజీ భరత్, కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి, జలవనరుల శాఖ అధికారులతో కలిసి నిమజ్జనానికి నీటి లభ్యతపై సాధ్యాసాధ్యాలన్నింటినీ పరిశీలించినట్లు పేర్కొన్నారు.కేసీ కెనాల్‌కు ప్రధాన నీటి వనరైన సుంకేసుల జలాశయంలో నీటి నిల్వలు గణనీయంగా తగ్గాయని కమిషనర్ తెలిపారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న నీటిని నగర ప్రజల తాగునీటి అవసరాలకే వినియోగించాల్సిన పరిస్థితి ఉందన్నారు. గతంలో సుంకేసుల జలాశయంలో సుమారు 1.20 టీఎంసీలు, గాజులదిన్నె ప్రాజెక్టులో సుమారు 2.28 టీఎంసీలు, సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులో సుమారు 4,410 మిలియన్ లీటర్లు అంటే 0.16 టీఎంసీల నీటి నిల్వలు ఉండగా, మొత్తం సుమారు 3.64 టీఎంసీల నీటి లభ్యత ఉండేదని వివరించారు. అయితే ప్రస్తుతం వర్షాభావ పరిస్థితుల కారణంగా నీటి నిల్వలు గణనీయంగా తగ్గిపోయాయని తెలిపారు. ప్రస్తుతం గాజులదిన్నె ప్రాజెక్టులో సుమారు 1.561 టీఎంసీల నీటి నిల్వ మాత్రమే అందుబాటులో ఉందని కమిషనర్ తెలిపారు. ఈ నీటిని రానున్న రోజుల్లో రోజుకు సుమారు 40 నుంచి 45 క్యూసెక్కుల చొప్పున సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుకు సరఫరా చేస్తూ, నగరంలోని సుమారు ఏడు లక్షల మంది ప్రజల తాగునీటి అవసరాలకు వినియోగిస్తే నవంబర్ మాసం వరకు మాత్రమే సరిపోయే అవకాశం ఉందన్నారు. అక్టోబర్‌లో తుంగభద్ర జలాశయం నుంచి సుంకేసులకు నీటిని విడుదల చేయించేందుకు అవసరమైన నీటి కోటాను కోరే వరకు అందుబాటులో ఉన్న నీటి వనరులను అత్యంత పొదుపుగా వినియోగించాల్సిన అవసరం ఉందన్నారు. అదేవిధంగా హంద్రీ-నీవా ప్రధాన కాలువలో కూడా ప్రస్తుతం ఉన్న నీటి లభ్యత ఈ నెల 21వ తేదీ వరకు మాత్రమే ఉంటుందని కమిషనర్ తెలిపారు. ఆ తర్వాత కాలువలో నీటి లభ్యత ఉండే అవకాశం లేకపోవడంతో హంద్రీ-నీవా కాలువలో కూడా వినాయక నిమజ్జనం నిర్వహించే పరిస్థితి లేదని స్పష్టం చేశారు.తుంగభద్ర ఎగువ ప్రాంతాలైన కర్ణాటకలో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో నీటి ప్రవాహం పెరిగి సుంకేసులకు నీరు వస్తుందని తొలుత ఆశించామని, అయితే తుంగభద్ర జలాశయం కూడా ఆశించిన స్థాయిలో నిండని పరిస్థితి నెలకొందని కమిషనర్ తెలిపారు. దీంతో సుంకేసులకు అదనపు నీటి ప్రవాహం లేకపోవడంతో కేసీ కెనాల్‌లోని వినాయక ఘాట్‌కు నిమజ్జనం కోసం నీటిని విడుదల చేయడం సాధ్యం కాదన్నారు. ఈ పరిస్థితుల్లో నగర ప్రజలందరూ విజ్ఞతతో వ్యవహరించి 1 నుంచి 1.5 అడుగుల లోపు ఉండే చిన్న మట్టి విగ్రహాలను మాత్రమే ప్రతిష్ఠించి పూజించాలని కమిషనర్ సూచించారు. ఇళ్లలో, వీధుల్లో చిన్నపాటి విగ్రహాలను ప్రతిష్ఠించి, పూజల అనంతరం బకెట్లు, టబ్బుల్లోనే స్థానికంగా నిమజ్జనం చేసుకోవాలని కోరారు. పెద్ద విగ్రహాలను తీసుకురావద్దని, ఇప్పటికే ఆర్డర్ ఇచ్చి ఉంటే వీలైనంత వరకు రద్దు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఇప్పటికే పెద్ద గణనాథుని విగ్రహాలను తెచ్చుకున్న వారు వాటిని నిమజ్జనం చేయకుండా భద్రపరచుకునేందుకు ఐదు ప్రత్యేక మైదానాలను ఎంపిక చేసినట్లు కమిషనర్ తెలిపారు. సుంకేసుల రోడ్డులోని రైల్వే పట్టాల పక్కన, ఎంఆర్‌సీ ఫంక్షన్ హాల్ పక్కన, వెంకటరమణ కాలనీలోని పర్యాటక హోటల్ వెనుక ఉన్న ఖాళీ మైదానంతో పాటు ఏ.క్యాంపు, జొహరాపురం ప్రాంతాల్లోని ఖాళీ మైదానాలను ఇందుకోసం పరిశీలించినట్లు పేర్కొన్నారు. పెద్ద విగ్రహాలను వచ్చే ఏడాది వరకు భద్రపరచుకునేలా ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. అయితే గణనాథుని ఆశీస్సులతో పండుగలోపు వర్షాలు కురిస్తే, వర్షపు నీరు వృథాగా పోకుండా వినాయక ఘాట్ వద్ద నిల్వ చేసేందుకు అడ్డుకట్ట నిర్మిస్తున్నామని కమిషనర్ తెలిపారు. వర్షాలు కురవకపోతే ఘాట్‌లో నిమజ్జనానికి సరిపడా నీరు ఉండదని స్పష్టం చేశారు. వర్షాల కారణంగా తగినంత నీరు లభ్యమైతే నిమజ్జన ఏర్పాట్లపై తదుపరి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.తాగునీటి అవసరాలే అత్యంత ప్రాధాన్యమైనవని, అందుబాటులో ఉన్న నీటిని ప్రజల తాగునీటి అవసరాల కోసం కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కమిషనర్ పేర్కొన్నారు. నగర ప్రజలు, వినాయక ఉత్సవ కమిటీలు, నిర్వాహకులు వాస్తవ పరిస్థితులను అర్థం చేసుకుని నగరపాలక సంస్థకు, జలవనరుల శాఖకు పూర్తి సహకారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.సమావేశంలో నగరపాలక ఎస్ఈ రమణమూర్తి, నీటిపారుదల శాఖ కర్నూలు సర్కిల్ ఎస్ఈ జి. శైలేశ్వర్, హంద్రీ-నీవా సర్కిల్-1 ఎస్ఈ రాజన్ బాబు, హంద్రీ-నీవా డివిజన్-2 కార్యనిర్వహణ ఇంజినీర్ ఎన్. ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలపై ధరల భారాన్ని మోపుతున్న పాలకుల విధానాలకు వ్యతిరేకంగా సెప్టెంబర్ 9న నిరసనలు,ధర్నాలు జయప్రదం చేయండి

సిపిఐ జిల్లా కార్యదర్శి బి గిడ్డయ్య

కర్నూలు సిటీ నంది పత్రిక దేశంలో 2014 నుంచి 2026 వరకు నిత్యావసర వస్తువుల ధరలు సామాన్య ప్రజలపై పెనుభారంగా మారాయి. బియ్యం, కందిపప్పు, మినప్పప్పు, పెసరపప్పు, శనగపప్పు వంటి పప్పుధాన్యాల ధరలు పెరిగాయి. వంటనూనె, పాలు, చక్కెర, ఉప్పు ధరలు కూడా పెరిగాయి. ఉల్లి, టమాటా, బంగాళాదుంప, వంకాయ వంటి కూరగాయల ధరలు తరచూ సామాన్యుడి అందుబాటును దాటుతున్నాయి.ఇది సాధారణ ధరల పెరుగుదల కాదు ప్రజల జీవనంపై జరుగుతున్న ఆర్థిక దాడి.కార్మికుడి కూలి ఆశించిన స్థాయిలో పెరగడం లేదు. రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర రావడం లేదు. చిరు వ్యాపారుల వ్యాపారాలు సంక్షోభంలో ఉన్నాయి. మధ్యతరగతి కుటుంబాలు నెల జీతంతో నెలాఖరుకు చేరుకోవడం కష్టంగా మారింది. మరోవైపు నిత్యావసర వస్తువుల ధరలకు మాత్రం అదుపు లేకుండా పోయింది.

ఆదాయం తక్కువ ధరలు ఎక్కువ. రైతుకు గిట్టుబాటు లేదు వినియోగదారుడికి ఉపశమనం లేదు. పప్పులు, నూనెలు, నిత్యావసరాల ధరలు విపరీతంగా పెరిగాయి. పేదవాడి పళ్లెంలో పప్పు తగ్గుతుండగా, దళారీలు, నిల్వదారుల లాభాలు పెరుగుతున్న పరిస్థితి నెలకొంది. కూరగాయల ధరలు ప్రతిరోజూ కొత్త భారం ఉల్లి, టమాటా, బంగాళా దుంప, వంకాయ వంటి కూరగాయల ధరలు ఎప్పుడు పెరుగుతాయో, ఎప్పుడు తగ్గుతాయో సామాన్యుడికి అర్థంకాని పరిస్థితి ఏర్పడింది. రైతు పొలంలో తక్కువ ధర, వినియోగదారుడి మార్కెట్‌లో ఎక్కువ ధర ఉండటానికి ప్రధాన కారణం మధ్యవర్తులు, దళారీలు, నిల్వదారుల దోపిడీ అని పార్టీ భావిస్తోంది.రైతు నష్టపోతున్నాడు వినియోగదారుడు నష్టపోతున్నాడు దళారీ మాత్రం లాభపడుతున్నాడు.

పెట్రోల్‌డీజిల్ ధరల భారం 2014 ఏప్రిల్‌లో ఢిల్లీలో పెట్రోల్ ధర లీటరుకు ₹72.26, డీజిల్ ₹55.49 ఉండగా, 2026 సెప్టెంబర్‌లో ఢిల్లీలో పెట్రోల్ ₹102.12, డీజిల్ ₹95.20గా ఉన్నాయని అధికారిక గణాంకాలు వెల్లడిస్తున్నాయి. పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదల రవాణా ఖర్చులు, వ్యవసాయ ఖర్చులు, సరుకు రవాణా వ్యయాలను పెంచుతూ చివరకు ప్రతి నిత్యావసర వస్తువు ధరపై ప్రభావం చూపుతోంది.ఇంధన ధరలు పెరిగితే రవాణా ఖర్చులు పెరుగుతాయి. రవాణా ఖర్చులు పెరిగితే నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతాయి. ఈ మొత్తం భారాన్ని చివరకు మోసేది సామాన్య ప్రజలే. వంటగ్యాస్ ధరను తగ్గించాలి వంటగ్యాస్ ధరలు కూడా పేద, మధ్యతరగతి కుటుంబాలపై తీవ్ర ఆర్థిక భారాన్ని మోపుతున్నాయి. ప్రతి కుటుంబానికి అందుబాటులో ఉండే ధరకు వంటగ్యాస్ అందించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. గ్యాస్ ధరలను తగ్గించి సామాన్య కుటుంబాలపై భారాన్ని తగ్గించాలి.నల్లబజారు, అక్రమ నిల్వలు, దళారీ వ్యవస్థను అరికట్టాలి నల్లబజారు, అక్రమ నిల్వలు, కృత్రిమ కొరత, దళారీ వ్యవస్థను అరికట్టడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయి. ప్రజల కొనుగోలు శక్తిని పెంచకుండా ధరలు పెరగడానికి అవకాశం కల్పించడం ద్వారా సామాన్య ప్రజలను అప్పులు, ఆర్థిక ఇబ్బందుల వైపు నెట్టివేస్తున్నారు.ప్రజల అవసరాల కంటే కార్పొరేట్ల లాభాలకు ప్రాధాన్యతనిచ్చే విధానాలను వ్యతిరేకిస్తూ సీపీఐ ప్రజల పక్షాన పోరాటాన్ని ఉధృతం చేయాలి. సెప్టెంబర్ 9న రాష్ట్రవ్యాప్తంగా ధరల పెరుగుదలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు నిర్వహించాలి.జిల్లా కేంద్రాలు, నియోజకవర్గ కేంద్రాలు, మండల కేంద్రాలు, పట్టణాలు, గ్రామాల్లో ప్రజలను సమీకరించి ఆందోళనలు నిర్వహించాలి.కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు, మహిళలు, యువత, విద్యార్థులు, చిరు వ్యాపారులు, మధ్యతరగతి ప్రజలను పెద్ద సంఖ్యలో సమీకరించి ధరల వ్యతిరేక పోరాటాన్ని విస్తృత ప్రజా ఉద్యమంగా మలచాలి.

విద్యా సంస్కరణల స్ఫూర్తికి 'శిక్షా రత్న' కిరీటం



బాల అకాడమీ ప్రిన్సిపాల్ మాధవీలతకి ప్రతిష్ఠాత్మక పురస్కారం

హైదరాబాద్. సెప్టెంబర్ 07 . (నంది పత్రిక): విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దుతూ, విద్యారంగంలో నూతన సంస్కరణలకు శ్రీకారం చుడుతూ, పాఠశాల అభివృద్ధికి విశేష కృషి చేస్తున్న బాల అకాడమీ ప్రిన్సిపాల్ మాధవీలతకి ప్రతిష్ఠాత్మక 'శిక్షా రత్న అవార్డు2026 లభించింది. ఉపాధ్యాయ దినోత్సవం2026 సందర్భంగా హరి యూనివర్సిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో మాధవీలత ని విద్యారంగంలో ఆమె అందిస్తున్న విశిష్ట సేవలను గుర్తించి ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారంతో ఘనంగా సత్కరించారు.విద్యారంగంలో విశేష సేవలు అందిస్తున్న ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు మరియు విద్యా రంగంలో నూతన మార్పులకు కృషి చేస్తున్న విద్యావేత్తలను గుర్తించి అందించే ఈ పురస్కారం మాధవీలత కి దక్కడం బాల అకాడమీకి గర్వకారణంగా నిలిచింది.విద్యను కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం చేయకుండా, విద్యార్థుల్లో ప్రతిభ, సృజనాత్మకత, క్రమశిక్షణ, విలువలు, నాయకత్వ లక్షణాలను పెంపొందించేలా నూతన ఆలోచనలను అమలు చేస్తూ ఆమె పాఠశాల ప్రగతికి విశేషంగా కృషి చేస్తున్నారు. విద్యార్థుల సమగ్ర వికాసమే లక్ష్యంగా పలు విద్యా, సాంస్కృతిక, క్రీడా కార్యక్రమాలను ప్రోత్సహిస్తూ పాఠశాలను అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారు.ఈ సందర్భంగా మాధవీలత మాట్లాడుతూ, "ఈ అవార్డు నా వ్యక్తిగత గౌరవం మాత్రమే కాదుఁ బాల అకాడమీ కుటుంబంలోని ప్రతి ఉపాధ్యాయుడు, విద్యార్థి, తల్లిదండ్రుల సమిష్టి కృషికి దక్కిన గుర్తింపు" అని పేర్కొన్నారు. ఈ పురస్కారం తన బాధ్యతను మరింత పెంచిందని, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం మరింత అంకితభావంతో పనిచేస్తానని తెలిపారు. "ఒక మంచి విద్యార్థిని తీర్చిదిద్దడం అంటే ఒక మంచి భవిష్యత్తును నిర్మించడం" అనే స్ఫూర్తితో పనిచేస్తున్న మాధవీలత కి శిక్షా రత్న పురస్కారం లభించడం పట్ల బాల అకాడమీ యాజమాన్యం, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.ఈ పురస్కారం బాల అకాడమీ విద్యా ప్రస్థానంలో మరో మైలురాయిగా నిలిచిందని, మాధవీలత సాధించిన ఈ ఘనత విద్యా రంగంలో మరింత ఉత్తేజంతో ముందుకు సాగేందుకు స్ఫూర్తినిస్తుందని వారు పేర్కొన్నారు.



శాంతిరామ్ ఇంజినీరింగ్ కళాశాలలో "స్మార్ట్ ఇండియా అంతర్గతహ్యాకథాన్2026"

నంద్యాల ప్రతినిధి. సెప్టెంబర్ 07 . (నంది పత్రిక): శాంతిరామ్ ఇంజినీరింగ్ కళాశాల (అటానమస్), నంద్యాలలో "స్మార్ట్ ఇండియా అంతర్గత హ్యాకథాన్ 2026" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఎస్ఆర్ఈసీ ఐఈఈఈ విద్యార్థి విభాగం సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకత, సాంకేతిక నైపుణ్యాలు మరియు సమస్య పరిష్కార సామర్థ్యాలను పెంపొందించడంపై దృష్టి సారించారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎం.వి. సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ, విద్యార్థులు పరిశ్రమలు మరియు సమాజం ఎదుర్కొంటున్న సమస్యలకు వినూత్నమైన సాంకేతిక పరిష్కారాలను రూపొందించాలని సూచించారు. అనంతరం ఎలక్ట్రానిక్స్ మరియు కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డా. వై. మల్లికార్జునరావు మాట్లాడుతూ, హ్యాకథాన్‌ల ద్వారా విద్యార్థుల్లో కొత్త ఆలోచనలు, బృంద స్ఫూర్తి మరియు ఆచరణాత్మక నైపుణ్యాలు అభివృద్ధి చెందుతాయని తెలిపారు.ఈసీఈ విభాగం సమన్వయకర్త డా. ఎన్. ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ, విద్యార్థులు తమ వినూత్న ఆలోచనలను ప్రాజెక్టులుగా అభివృద్ధి చేసి, వాస్తవ సమస్యలకు సమర్థవంతమైన పరిష్కారాలను అందించాలని సూచించారు.ఈ హ్యాకథాన్‌లో స్మార్ట్ ఆటోమేషన్, స్మార్ట్ వాహనాలు, రోబోటిక్స్, వ్యవసాయం, ఆరోగ్య సాంకేతికత, సుస్థిర ఇంధనం, సైబర్ భద్రత, స్మార్ట్ విద్య, విపత్తు నిర్వహణ తదితర అంశాలపై విద్యార్థులు తమ వినూత్న ఆలోచనలను ప్రదర్శించారు. కార్యక్రమంలో అధ్యాపకులు మరియు అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు జెనరేటివ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పై అవగాహన

నంద్యాల ప్రతినిధి. సెప్టెంబర్ 07 . (నంది పత్రిక): శాంతిరామ్ ఇంజనీరింగ్ కాలేజీ లో జన్‌ఏఐ లంచ్ పడ్ ఎక్స్‌ప్లోర్ క్రియేట్ అంశంపై రెండు రోజుల కార్యక్రమం సెప్టెంబర్ 7, 8 తేదీల్లో ఘనంగా నిర్వహిస్తున్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎం.వి. సుబ్రమణ్యం ఆధ్వర్యంలో, మొదటి సంవత్సరం హెచ్ఓడీ డా. బి. శేషయ్య పర్యవేక్షణలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.ఈ కార్యక్రమానికి పరిశ్రమ రంగంలో 30 సంవత్సరాలకు పైగా అనుభవం కలిగిన మిస్టర్ నివర్తి శ్రీకాంత్ (మాజీ సత్యం, మాజీ టెక్ మహీంద్రా), అలాగే 6 సంవత్సరాలకు పైగా అనుభవం కలిగిన బిజినెస్ అనలిటిక్స్ నిపుణుడు మిస్టర్ యశ్వంత్ వసరుల వ్యక్తులుగా పాల్గొని విద్యార్థులకు మార్గనిర్దేశం చేయనున్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు జెనరేటివ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పై ప్రాథమిక అవగాహనతో పాటు, వివిధ ఏఐ సాధనాల వినియోగం, ప్రాంప్ట్‌ల రూపకల్పన, ప్రయోగాత్మక అభ్యాసం, సృజనాత్మక ఆలోచనలు మరియు ఎఐ ఆధారిత పరిష్కారాల రూపకల్పన వంటి అంశాలపై శిక్షణ అందించనున్నారు.కార్యక్రమ సమన్వయకర్తలుగా డా. ఎస్. అల్లాహుద్దీన్ మరియు డా. ఎం. మధు శేఖర్ వ్యవహరిస్తున్నారు.విద్యార్థుల్లో ఆధునిక కృత్రిమ మేధస్సు సాంకేతికతపై అవగాహన పెంపొందించడంతో పాటు, భవిష్యత్‌లో పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా అవసరమైన నైపుణ్యాలను అభివృద్ధి చేసుకునేందుకు ఈ కార్యక్రమం ఎంతో దోహదపడుతుందని కళాశాల యాజమాన్యం పేర్కొంది.

నూతన పింఛన్లకు దరఖాస్తులు స్వీకరణ.. ఎంపీడీవో గోపికృష్ణ

జూపాడుబంగ్లా, సెప్టెంబర్: 7 :(నంది పత్రిక) ఎన్టీఆర్ భరోసా పథకం కింద కొత్త పింఛన్ల మంజూరుకు అర్హుల నుంచి ఈనెల 16వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించునట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి డి. గోపికృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. వృద్ధాప్య, వితంతు, మత్స్యకారులు, చేనేత, డప్పు కళాకారులు, కల్లుగీత కార్మికులు, ట్రాన్స్ జెండర్లు, దరఖాస్తు చేసుకోవచ్చని కోరారు. దరఖాస్తు తో పాటు ఆధార్ కార్డు, తెల్లరేషన్ కార్డు, ఆదాయ కులదవీకరణ పత్రాలు జమ చేయాలన్నారు. ఎవరైతే పెన్షన్లకు అర్హులు ఉన్నారో వారి వారి పంచాయతీ డెవలప్మెంట్ అధికారుల ద్వారా సచివాలయం డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫర్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్ ద్వారా మీ స్వర్ణ గ్రామ నుండి దరఖాస్తు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. పింఛన్లకు దరఖాస్తు చేసుకున్న వారు పెన్షన్ నమోదు చేసినట్టుగా రశీదు పొందాలన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

తెలుగు గంగ ప్రధాన కాలువ ద్వారా త్రాగునీటి అవసరాలకు నీటి విడుదల.

రుద్రవరం ప్రతినిధి సెప్టెంబర్ 07 (నంది పత్రిక): వెలుగోడు బ్యాలెన్స్ రిజర్వాయర్ నుంచి తెలుగంగ ప్రధాన కాలువ ద్వారా త్రాగునీటి అవసరాల కోసం నీటిని విడుదల చేసినట్లు ఆళ్ల గడ్డతెలుగంగ ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మురళీకృష్ణ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఉన్నతాధికారులు వెలుగోడు బ్యాలెన్స్ రిజర్వాయర్ నుంచి 1000 క్యూసెక్కుల నీటిని విడుదల చేయడం జరిగిందన్నారు. ఈ నీటిని రుద్రవరం, ఆళ్లగడ్డ, చాగలమర్రి, సిరివెళ్ల మండలాలలోనిచెరువులు, కుంటలునింపడం ద్వారా భూగర్భ జలాలు పెరిగి రైతుల బోరు బావుల్లో కూడా భూగర్భ జలాలు పెరిగి నీరు సమృద్ధిగా వస్తుందన్నారు. కావున ప్రజలు రైతులు నీటిని వృధా చేయకుండా త్రాగునీటి అవసరాల కోసం ప్రజలు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

నగరపాలక సంస్థకు 38 వినతులు.

కమిషనర్ ఎం.జయకృష్ణ.

తిరుపతి బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 7 నంది పత్రిక నగరపాలక సంస్థ కార్యాల యంలో సోమవారం నిర్వహిం చిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 32 వినతులు వచ్చా యని కమిషనర్ ఎం.జయకృష్ణ తెలిపారు. సోమవారం తిరుపతి నగరపాలక సంస్థ కార్యాల యంలో డయల్ యువర్ కమిష నర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాలను నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో ఫోన్ ద్వారా 12 మంది, కార్యాలయంకు నేరుగా వచ్చి 26 మంది వినతులు సమర్పించి తమ సమస్యలు తెలిపారు. శివజ్యోతి నగర్ లో రోడ్డులో యూడీఎస్ కాలువలు, సిసి రోడ్డు ఏర్పాటు చేయాలని, టిడిఆర్ బాండ్లు ఇప్పించాలని, ఎమ్మార్ పల్లి టీటిడి ప్లాట్స్ లో తెలుగుగంగ నీరు సక్రమంగా రావడం లేదని, ప్రకాశం పార్కు నందు వాకింగ్ ట్రాక్ మరమ్మతులు చేయించాలని, శ్రీనివాసపురంలో ఉన్న వేస్ట్ షాప్ వలన ఇబ్బందిగా ఉంది పరిష్కరించాలని, మంచాల వీధిలో తెలుగుగంగ లైన్ కొరకు తవ్విన కాలు వలు పూడ్చాలని, ఎన్.జి.ఓ. కాలనీలో రోడ్లపై పార్కింగ్ ఎక్కువయ్యిందని, కపిలతీర్థం కాలు వలో పిచ్చి మొక్కలు ఎక్కువ కావడం వలన దోమలు ఎక్కువగా ఉన్నాయి పరిష్కరించాలని, పాత మునిసిపల్ ఆఫీస్ వద్ద ట్రాఫిక్ సిగ్నల్స్ పనిచేయలేదు పరిష్కరించాలని, ప్రజల నుండి వచ్చిన సమస్యలను ఆయా విభాగాల అధికారులకు పంపి చర్యలు చేపడతామని కమిషనర్ తెలుపారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ శారదా దేవి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, రెవిన్యూ ఆఫీసర్ సేతు మాధవ్, ఏసీపీ లు పార్వతి ప్రియ, మూర్తి, మేనేజర్ హసీమ్, శానిటరీ సూపర్వైజర్లు చెంచయ్య, సుమతి మరియు సిబ్బంది పాల్గొన్నారు.

వారసుల హక్కులు పక్కనపెట్టి భూమి మ్యూటేషన్.. ఆన్‌లైన్‌లో అక్రమ నమోదు!

రెవెన్యూ రికార్డుల్లో కలకలం!

పోరుమామిళ్ల, సెప్టెంబర్ 7(నంది పత్రిక): పేదల భూముల విషయంలో రెవెన్యూ రికార్డుల నిర్వహణపై మరోసారి ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పోరుమామిళ్ల మండలం బొప్పాపురం గ్రామంలో 1987లో డీకేటీ పట్టా కింద మంజూరైన భూమికి సంబంధించి ఆన్‌లైన్ రికార్డుల మార్పుపై కుటుంబ సభ్యుల మధ్య వివాదం నెలకొంది. బాధితుడు ఆనందరావు తెలిపిన వివరాల ప్రకారం.. బొప్పాపురం గ్రామంలోని సర్వే నంబర్ 187-1లో 15-08-1987న డీకేటీ పట్టా కింద 1.79 ఎకరాల భూమి తమ కుటుంబానికి మంజూరైందని తెలిపారు. ఈ భూమికి సంబంధించి తమ తల్లి చాటకొండ జీవమ్మకు ముగ్గురు సంతానం ఉన్నారని పేర్కొన్నారు.అయితే తమ కుటుంబంలోని ఒక వ్యక్తి ఎలాంటి ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ లేదా ఇతర వారసత్వ ఆధారాలు సమర్పించకుండానే రెవెన్యూ రికార్డుల్లో తన పేరును నమోదు చేయించుకుని ఆన్‌లైన్‌లో భూమిని మార్చుకున్నారని ఆనందరావు ఆరోపించారు. ఈ వ్యవహారంపై ఇప్పటికే కలెక్టర్ కార్యాలయంలో పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ న్యాయం జరగలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

వారసత్వ మార్పుకు ఆధారాలు ఉన్నాయా? ఒక వ్యక్తి మాత్రమే తన పేరుపై భూమిని మ్యూటేషన్ చేయించుకున్నట్లయితే, ఆ మార్పుకు సంబంధించిన దరఖాస్తు, వారసుల వివరాలు, కుటుంబ సభ్యుల ధ్రువీకరణ/వారసత్వ ఆధారాలు, పాత రెవెన్యూ రికార్డులు, విచారణ వివరాలు, సంబంధిత నోటీసులు మరియు ఆన్‌లైన్ మ్యూటేషన్‌కు ఆధారమైన పత్రాలు పరిశీలించాల్సిన అవసరం ఉందని బాధితుడు కోరుతున్నారు.

అన్ని వారసులకు హక్కు ఉన్న సందర్భంలో, మిగిలిన వారసుల హక్కులను పరిగణనలోకి తీసుకోకుండా ఒక్కరి పేరుపై రికార్డు మార్పు చేశారు. ఏ ఆధారాలపై, ఏ అధికారి అనుమతితో ఆన్‌లైన్ మార్పు చేశారు? అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది.

జేసీ, ఆర్డీవో సమగ్ర విచారణ చేయాలి తన తల్లి పేరుతో ఉన్న భూమికి సంబంధించి జరిగినట్లు చెబుతున్న ఆన్‌లైన్ మార్పుపై జాయింట్ కలెక్టర్ (జేసీ), ఆర్డీవో స్థాయి అధికారులు సమగ్ర విచారణ చేపట్టి, పాత డీకేటీ రికార్డులు, అసైన్‌మెంట్ రిజిస్టర్, కుటుంబ వారసుల వివరాలు, మ్యూటేషన్ దరఖాస్తు, ఆన్‌లైన్ ఎంట్రీకి ఆధారమైన పత్రాలు పరిశీలించాలని ఆనందరావు విజ్ఞప్తి చేశారు. నిజంగా ఫ్యామిలీ సర్టిఫికెట్ లేదా సరైన వారసత్వ ఆధారాలు లేకుండానే రికార్డు మార్చి ఉంటే బాధ్యులపై చర్యలు తీసుకుని, అర్హులైన వారసుల హక్కులను కాపాడాలని ఆయన కోరారు.

బీమా చేయండి.. ధీమాగా ఉండండి జీవిత బీమాతో కుటుంబానికి ఆర్థిక భరోసా

ప్రతి ఒక్కరూ బీమా చేయించుకోవాలి: బద్వేలు ఎల్ఐసీ బ్రాంచ్ మేనేజర్ జనార్దన్

బద్వేలు,సెప్టెంబర్ 7(నంది పత్రిక): జీవిత బీమా మనిషి జీవితానికి భరోసాతో పాటు కుటుంబ భవిష్యత్తుకు ఆర్థిక రక్షణ కల్పిస్తుందని బద్వేలు ఎల్ఐసీ బ్రాంచ్ మేనేజర్ జనార్దన్ పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తమ అవసరాలకు అనుగుణంగా జీవిత బీమా చేయించుకుని ధీమాగా జీవించాలని ఆయన సూచించారు. ఏఏఓలు కృష్ణమోహన్‌రావు, లలిత కూడా బీమా ప్రాధాన్యతను వివరించారు.బద్వేలు ఎల్ఐసీ కార్యాలయంలో 70 వసంతాల్లోకి అడుగుపెడుతున్న శుభసందర్భంగా వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా క్విజ్ పోటీలను నిర్వహించి, విజేతలకు బహుమతులను అందజేశారు.అనంతరం సీనియర్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ బాను ప్రసాద్ శర్మను శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎల్ఐసి లియాపి లీడర్ చవ్వా వెంకట రామిరెడ్డి, చెన్నయ్య డెవలప్‌మెంట్ ఆఫీసర్లు నరేష్, రామిరెడ్డి, శివారెడ్డి,భగీరథ ఎల్ఐసీ ఏజెంట్లు తదితరులు పాల్గొన్నారు.



గణేష్ ఉత్సవ నిర్వాహకులు పోలీసు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి

మండపాల ఏర్పాటుకు ముందస్తు అనుమతి తప్పనిసరి.. డీజేలకు అనుమతి లేదు ట్రాఫిక్, అగ్నిప్రమాద నివారణ చర్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి: ఎస్ఐ బి. సురేష్

వెలుగోడు, సెప్టెంబర్ 07 (నంది పత్రిక):వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని వెలుగోడు మండల వ్యాప్తంగా వినాయక మండపాలను ఏర్పాటు చేసే నిర్వాహకులు పోలీసు శాఖ జారీ చేసిన నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని వెలుగోడు సబ్ ఇన్స్పెక్టర్ బి. సురేష్ పేర్కొన్నారు. వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంతమైన వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా సురక్షితంగా నిర్వహించేందుకు నిర్వాహకులు, పోలీసు శాఖలకు సహకరించాలని ఆయన భక్తులకు సూచించారు. ఈ సందర్భంగా ఎస్ఐ బి. సురేష్ మాట్లాడుతూ.. ఉత్సవాల సందర్భంగా మండపాల వద్ద భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ఎంతో ముఖ్యమన్నారు. మండపాల ఏర్పాటుతో పాటు విద్యుత్, ట్రాఫిక్, అగ్నిప్రమాద నివారణ, శాంతిభద్రతలకు సంబంధించిన అంశాల్లో నిర్వాహకులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు.

ముందస్తు అనుమతి తప్పనిసరి: వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసే నిర్వాహకులు పోలీసు శాఖ సూచించిన విధంగా ముందస్తుగా అనుమతి పొందాలని ఎస్ఐ తెలిపారు. 'గణేష్ ఉత్సవ్' వెబ్‌సైట్ ద్వారా అవసరమైన అనుమతుల కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనుమతులు పొందిన అనంతరం మాత్రమే మండపాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

డీజేలకు అనుమతి లేదు: వినాయక ఉత్సవాల సందర్భంగా డీజేలు వినియోగించేందుకు ఎలాంటి అనుమతి లేదని ఎస్ఐ బి. సురేష్ చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా డీజేలను ఏర్పాటు చేసి అధిక శబ్దంతో ప్రజలకు ఇబ్బంది కలిగించరాదన్నారు ముఖ్యంగా రాత్రి వేళల్లో శబ్ద కాలుష్యానికి కారణమయ్యే విధంగా కార్యక్రమాలు నిర్వహించకూడదని సూచించారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా మండపాల ఏర్పాటు:

వినాయక మండపాలను ఏర్పాటు చేసే సమయంలో ప్రజల రాకపోకలకు, వాహనాల సంచారానికి ఎలాంటి ఆటంకం కలగకుండా చూడాలని ఆయన సూచించారు. ప్రధాన జాతీతాలు, ఇరుకైన ట్రాఫిక్ సమస్యలు తలెత్తే విధంగా మండపాలు ఏర్పాటు చేయరాదన్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అవసరమైన భద్రతా ఏర్పాట్లు చేసుకోవాలని తెలిపారు.

అగ్నిప్రమాదాల నివారణకు ముందస్తు జాగ్రత్తలు: మండపాల వద్ద విద్యుత్ వైరింగ్, లైటింగ్ తదితర ఏర్పాట్ల విషయంలో నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ సూచించారు. అగ్నిప్రమాదాలు సంభవించకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, అత్యవసర పరిస్థితుల్లో భక్తులను సురక్షితంగా బయటకు తీసుకెళ్లేందుకు వీలుగా అందుబాటులో ఉంచాలని సూచించారు.నిమజ్జనానికి నిర్దేశించిన మార్గాలు, సమయాలే పాటించాలి వినాయక విగ్రహాల నిమజ్జనం సందర్భంగా పోలీసు శాఖ సూచించిన నిర్దేశిత మార్గాలు, సమయ వేళలను మాత్రమే పాటించాలని ఎస్ఐ బి. సురేష్ పేర్కొన్నారు. నిమజ్జన ఊరేగింపుల సమయంలో ట్రాఫిక్ సమస్యలు, అవాంఛనీయ ఘటనలు

చోటుచేసుకోకుండా పోలీసుల సూచనలకు అనుగుణంగా వ్యవహరించాలన్నారు.మత సామరస్యానికి భంగం కలిగించే చర్యలకు దూరంగా ఉండాలి: వినాయక మండపాల వద్ద ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు తావు ఇవ్వకూడదని ఎస్ఐ హెచ్చరిక. ఇతర మతాల మనోభావాలను దెబ్బతీసే విధంగా పాటలు, ప్రసంగాలు లేదా ఇతర కార్యక్రమాలు నిర్వహించరాదన్నారు. మత సామరస్యాన్ని కాపాడేలా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు.నిబంధనలను ఉల్లంఘించిన పక్షంలో సంబంధిత నిర్వాహకులు బాధ్యత వహించాల్సి ఉంటుందని ఎస్ఐ బి. సురేష్ తెలియజేసారు. వినాయక చవితి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, సోదరభావంతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ పోలీసు శాఖకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు."ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణే పోలీసు శాఖ ప్రధాన లక్ష్యం. ఉత్సవ నిర్వాహకులు నిబంధనలు పాటిస్తే గణేష్ ఉత్సవాలు మరింత ప్రశాంతంగా, సురక్షితంగా జరుగుతాయి" అని ఎస్ఐ బి. సురేష్ పేర్కొన్నారు.

వి బి ఆర్ ద్వారా తెలుగు గంగ కాలువకు 1000 క్యూసెక్కుల నీరు విడుదల



బండి ఆత్మకూరు నంది పత్రిక సెప్టెంబర్ 7: నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియ ఆదేశాల మేరకు వెలుగోడు రిజర్వాయర్ నుండి తెలుగు గంగ ప్రధాన కాలువకు సోమవారం మధ్యాహ్నం 1000 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ప్రజల తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకొని అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. మధ్యాహ్నం జలమండలి శాఖ ఎస్ ఇ, శంకర రెడ్డి, డీఈఈ వెంకటేశ్వర్లు, ఏఈలు ఉదయ్ కుమార్ రెడ్డి, రఘు రాముడు వెలుగోడు రిజర్వాయర్ వద్ద పూజలు నిర్వహించారు. అనంతరం రిజర్వాయర్ ద్వారా ప్రధాన కాలువకు 1000 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. నీటిని విడుదల చేసేముందు శ్రీశైలం, ఆళ్ల గడ్డ ఎమ్మెల్యేలు, బుడ్డా రాజశేఖర్ రెడ్డి, అఖిల ప్రియకు తెలుగు గంగ అధికారులు సమాచారం అందించారు. వారి సూచనల మేరకు తెలుగు గంగ రిజర్వాయర్ ద్వారా ప్రధాన కాలువకు నీటిని విడుదల చేశారు. ప్రధాన కాలువకు నీటిని విడుదల చేసేముందు నంద్యాల జిల్లాలోని 37 బ్లాకులను అధికారులు మూసివేశారు. 63వ కిలోమీటర్ వద్ద ఉన్న గండ్లేరు రిజర్వాయర్ నీటితో నింపడం జరుగుతుందని తద్వారా ఆళ్ల గడ్డ ప్రజలకు తాగునీరు అందే సౌకర్యం ఏర్పడుతుందని ఎస్ ఇ శంకర్ రెడ్డి పేర్కొన్నారు. తర్వాత చెరువులన్నింటినీ ప్రజల తాగునీటి అవసరాల కొరకు నింపడం జరుగుతుందని ఆయన తెలిపారు. గత 60 రోజుల కాలం నుండి ఎల్నినో ప్రభావం కారణంగా వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ కారణంగా బోర్లలో కూడా భూగర్భ జలాలు ఇంకిపోవడంతో, తాగునీటికి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం రిజర్వాయర్ నుండి తెలుగుగంగ ప్రధాన కాలువకు నీరు విడుదల చేయడం వల్ల బోర్లు రీఛార్జి అయ్యే అవకాశం ఉంది. తెలుగు గంగ ప్రధాన కాలువకు సాగునీటిని

విడుదల చేయడంలో నంద్యాల జిల్లాలోని ఇరువురు మంత్రులతో పాటు, జిల్లా ఎమ్మెల్యేలు చొరవ చూపారు. రాష్ట్రంలో ఎల్లీనో ప్రభావం కారణంగా వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో నంద్యాల జిల్లా ప్రజలు తా గునీటి సమస్యను ఎదుర్కొంటున్నారని, ఈ విషయంలో తక్షణ చర్యలు చేపట్టాలని, నంద్యాల జిల్లా ఇన్చార్జి మంత్రి పయ్యావుల కేశవ్, మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్, రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, జిల్లా ఎమ్మెల్యేలు బుడ్డా రాజశేఖర్ రెడ్డి, కోట్ల జయ సూర్య ప్రకాశ్ రెడ్డి, గౌరు చరితారెడ్డి, గిత్త జయసూర్య వారం రోజుల క్రితం నీటిపారుదల శాఖ మంత్రి డాక్టర్ నిర్మల రామానాయుడు కు విజ్ఞప్తి చేశారు. సకాలంలో వర్షాలు పర్యకపోవడం వల్ల అందుబాటులో ఉన్న నీటి వనరులను వినియోగించి అవసరమైన నీటిని విడుదల చేయాలని విజయవాడలో మంత్రి నిమ్మలను కలిసి విజ్ఞప్తి చేయడం జరిగింది. ఈ విషయంపై నిమ్మల సానుకూలంగా స్పందించారు. మంత్రులు, జిల్లా ఎమ్మెల్యేలు చేసిన విజ్ఞప్తి మేరకు, వెలుగోడు రిజర్వాయర్ నుండి తెలుగు గంగ ప్రధాన కాలువకు 1000 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. నీటిని విడుదల చేయించడంలో చొరవ చూపిన మంత్రులకు ఎమ్మెల్యేలకు జిల్లాలోని రైతాంగం కృతజ్ఞతలు

తెలియజేస్తూ ఉన్నారు. కర్నూలు కడప కాలువ తో పాటు, కుందూ నదికి నీటిని విడుదల చేయించడంలో ఎమ్మెల్యేలు చొరవ చూపారు. ఈనెల మూడవ తేదీన బానకచర్ల రెగ్యులేటర్ ద్వారా సంత జుటూరు పిక్ అప్ ఆనకట్ట నుండి 1000 క్యూసెక్కుల నీటిని కుందూ నదికి, కేసీ కాలువ కు నీటిని విడుదల చేయించారు. రైతాంగం సమస్యలను దృష్టిలో పెట్టుకొని తాగు నీటిని విడుదల చేయించడంలో చొరవ చూపిన శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి కి రైతులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

ఆత్మకూరు మున్సిపాలిటీ ప్రజలకు నీటి ఎద్దడి లేకుండా చేయడమే బుడ్డా రాజశేఖర్ రెడ్డి ధ్యేయం:: సింగిల్ విండో చైర్మన్ ఎ. షహబుద్దిన్.

నంది పత్రిక ఆత్మకూరు.. ఈ ఏడాది ఎల్నినో ప్రభావంతో వర్షాలు లేకపోవడం వలన ఆత్మకూర్ మున్సిపాలిటీ ప్రజలు ఇబ్బంది పడకూడదు అని శ్రీశైలం శాసనసభ్యులు బుడ్డా రాజశేఖరరెడ్డి ఆదేశాలతో ఆత్మకూర్ మున్సిపాలిటీ కమిషనర్ బేబీ ఆధ్వర్యంలో కొన్ని ప్రాంతాల్లో బోర్లు వేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సింగిల్ విండో చైర్మన్ షహబుద్దిన్ మాట్లాడుతూ ఎల్నినో ప్రభావం వలన ఆత్మకూర్ మున్సిపాలిటీ నందు నీటి ఎద్దడి రాకుండా ముందుచూపుగా శ్రీశైలం శాసనసభ్యులు బుడ్డా రాజశేఖర్ రెడ్డి కొన్ని ప్రాంతాల్లో బోర్లు వేయించి, పట్టణ ప్రజలు ఇబ్బంది పడకుండా చూడడమే తమ ధ్యేయంగా పనిచేస్తున్నారని, దీనిని ప్రతి ఒక్కరూ గుర్తించుకోవాలన్నారు. వీరి వెంట తెలుగుదేశం పార్టీ రాష్ట్ర తెలుగు యువత కార్యవర్గ సభ్యులు వెన్న శ్రీధర్ రెడ్డి,యూనిట్ ఇంచార్జ్ ఆన్సర్ అలీ, ఆయా వార్డు అధ్యక్షులుఅమ్ములా,కాజముద్దీన్, న్యామతుల్లా టిడిపి నాయకులు జలీల్, రాఘవాచారి ,మహబూబ్, శ్రీను, షఫీ మున్సిపల్ ఏఈ షాహిద్ సిబ్బంది జీవన్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

కృపానగర్‌లో అభివృద్ధికి మరో అడుగు.. రూ.4 లక్షలతో సీసీ రోడ్డుకు శంకుస్థాపన

పోరుమామిళ్ల, సెప్టెంబర్ 7 (నంది పత్రిక)కడప జిల్లా పోరుమామిళ్ల మండలం అక్కలరెడ్డిపల్లె పంచాయతీ పరిధిలోని కృపానగర్‌లో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. జెడ్పీ నిధులు రూ. 4 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డుకు ఎంపీటీసీ రవి ఆధ్వర్యంలో శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు.గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం నిధులు కేటాయిస్తూ అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తోందని ఈ సందర్భంగా స్థానికులు పేర్కొన్నారు. సీసీ రోడ్డు నిర్మాణంతో కృపానగర్ వాసుల రాకపోకలకు ఇబ్బందులు తొలగి, రహదారి సౌకర్యం మెరుగుపడనుందని తెలిపారు.పల్లెల అభివృద్ధే లక్ష్యంగా రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, వీధి దీపాలు తదితర మౌలిక వసతులపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని గ్రామస్తులు కోరారు. తమ ప్రాంతంలో సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు కావడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు కొనసాగితే ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందడంతో పాటు పల్లెల రూపురేఖలు మారే అవకాశం ఉందని స్థానికులు అభిప్రాయపడ్డారు.

స్థానిక ఎన్నికల్లో జనసేన జెండా ఎగరాలి.. ప్రతి పంచాయతీలో ప్రజలకు అభివృద్ధి అందాలి: శీలంశెట్టి లక్ష్మయ్య

పోరుమామిళ్ల: 7 (నంది పత్రిక):రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన పార్టీ శ్రేణులు సమష్టిగా పనిచేసి ప్రతి పంచాయతీలో పార్టీ జెండా ఎగరేయాలని పోరుమామిళ్ల మండల జనసేన అధ్యక్షుడు శీలంశెట్టి లక్ష్మయ్య పిలుపునిచ్చారు. విదేశాల్లో ఉన్న పార్టీ అభిమానులు, కార్యకర్తలు సైతం ఎన్నికల సమయంలో స్వగ్రామాలకు చేరుకుని పార్టీ విజయానికి కృషి చేయాలని కోరారు.రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో ప్రతి మండలం, ప్రతి పంచాయతీలో జనసేన జెండా ఎగరేయడమే పార్టీ ఆశయమని లక్ష్మయ్య పేర్కొన్నారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ, గ్రామ పంచాయతీ, మున్సిపల్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అన్ని స్థానాల్లో పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. ఇప్పటివరకు ఉన్న జనసేన లో సమన్వయాన్ని మరింత బలోపేతం చేసుకుంటూ, స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన పార్టీ సమర్థవంతంగా ముందుండాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామస్థాయిలో ప్రజల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయడంతో పాటు, అభివృద్ధిని ప్రజలకు చేరువ చేయడమే లక్ష్యంగా పనిచేయాలని అన్నారు.గతంలో అనేక మంది ముఖ్యమంత్రులు, ఉప ముఖ్యమంత్రులు, మంత్రులు అధికారంలోకి వచ్చినప్పటికీ ప్రజలు ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగలేదని లక్ష్మయ్య విమర్శించారు. అయితే పవన్ కళ్యాణ్ ప్రజా సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తున్నారని పేర్కొన్నారు. 2014-2019 కాలంలో జరిగిన అభివృద్ధితో పాటు, 2019-2024 మధ్య ప్రజలు ఎదుర్కొన్న పరిస్థితులను కూడా ప్రజలు గమనించారని అన్నారు. ప్రస్తుతం జనసేన వచ్చిననంతరం రహదారుల అభివృద్ధి, సాగునీటి వసతులు, రైతులకు సంబంధించిన సంక్షేమ కార్యక్రమాలు, గ్రామీణ మౌలిక వసతుల కల్పన వంటి అంశాలకు ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు.అదేవిధంగా గతంలో ఎంతోమంది ఎంపీటీసీలు, జడ్పిటిసిలు, సర్పంచులు ఉన్నప్పటికీ కొన్ని ప్రాంతాలలో సరైన అభివృద్ధి లేదు.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలంలోనూ, రాష్ట్ర విభజన అనంతరం కూడా కడప జిల్లాకు సాగునీటి సమస్య పూర్తిస్థాయిలో పరిష్కారం కాలేదని లక్ష్మయ్య అన్నారు. ప్రస్తుతం పవన్ కళ్యాణ్ ప్రత్యేక శ్రద్ధతో వైఎస్సార్ కడప జిల్లాకు నీటి వసతులు కల్పించి కృషి చేసారు అని పేర్కొన్నారు. ప్రజల దాహం తీర్చేందుకు, రైతులకు సాగునీరు అందించేందుకు నీటి వనరుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వడం నిజమైన అభివృద్ధికి నిదర్శనమని అన్నారు."ప్రజలు కోరుకునేది ఇదే.. అభివృద్ధి కనిపించాలి, సమస్యలకు పరిష్కారం లభించాలి. రానున్న స్థానిక ఎన్నికల్లో ప్రజలు అభివృద్ధిని గమనించి జనసేనకు అవకాశం ఇస్తే గ్రామాల అభివృద్ధి ఎలా ఉంటుందో చూపిస్తాం" అని శీలంశెట్టి లక్ష్మయ్య అన్నారు. స్థానిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని జనసేన నాయకులు, కార్యకర్తలు ఇప్పటి నుంచే గ్రామస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉంటూ పార్టీని మరింత బలోపేతం చేయాలని ఆయన కోరారు.

నిరుపేదలకు ఇంటి స్థలం, నిర్మాణానికి రూ.4 లక్షలు ఇవ్వాలి..

సిపిఐ. ఆర్డీఓ, తహసీల్దార్‌కు సిపిఐ వినతి..

బనగానపల్లె సెప్టెంబర్ 7నందిపత్రిక బనగానపల్లె: గ్రామీణ ప్రాంతాల్లో సొంత ఇల్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న నిరుపేద కుటుంబాలకు ప్రభుత్వం మూడు సెంట్ల ఇంటి స్థలాన్ని కేటాయించి, ఇంటి నిర్మాణానికి రూ.4 లక్షల ఆర్థిక సహాయం అందించాలని కోరుతూ భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) బనగానపల్లె మండలం సమితి ఆధ్వర్యంలో బనగానపల్లె ఆర్డీఓ, కి తహసీల్దార్ కి వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా సిపిఐ నాయకులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో అనేక మంది పేదలు సొంత ఇల్లు లేక అద్దె ఇళ్లలో, పూరి గుడిసెల్లో జీవనం సాగిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ భూములను గుర్తించి అర్హులైన ప్రతి ఇల్లు లేని నిరుపేద కుటుంబానికి మూడు సెంట్ల ఇంటి స్థలం మంజూరు చేయాలని, ఇంటి నిర్మాణానికి రూ.4 లక్షల ఆర్థిక సహాయం అందించాలని వినతిపత్రం లో కోరినట్లు తెలిపారు. అర్హులైన పేదలు ఇంటి స్థలం కోసం దరఖాస్తు చేసుకునేందుకు వచ్చినప్పుడు అధికారులు దరఖాస్తులను స్వీకరించాలని , వాటిని పరిశీలించాలి కాని కొన్ని గ్రామ సచివాలయాల్లో అధికారులు అర్జీలు తీసుకోవడం లేదు తీసుకున్న తిరిగి వెనక్కి ఇస్తున్నారు ఇది సైరైన పద్ధతి కాదని సిపిఐ నాయకులు ఆర్డీవో గారికి ఫిర్యాదు చేయడం జరిగింది అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. పేదల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించి, వారికి గౌరవప్రదమైన నివాస వసతి కల్పించాలని సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి ఏ శివయ్య సిపిఐ సీనియర్ నాయకులు జి సంజీవులు సిపిఐ నాయకులు పలుకూరు లక్ష్మయ్య సుబ్బయ్య కొత్తూరు సుబ్బరాజు పాల్గొన్నారు

ఏపీ పోలీస్ స్పోర్ట్స్ మీట్ మరియు డ్యూటీ మీట్ లో విజేతలుగా నిలిచిన ... కర్నూలు జిల్లా పోలీసు క్రీడాకారులు.

మొత్తం 32 పతకాలు సాధించిన కర్నూలు జిల్లా పోలీసు క్రీడాకారులు.

విజేతలను అభినందించిన కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్

పురుషుల విభాగంలో రాష్ట్రంలోనే హ్యాండ్ బాల్ లో మొదటిస్థానం.

మహిళల విభాగంలో రాష్ట్రంలోనే హ్యాండ్ బాల్ లో మూడవ స్థానం.

కబడ్డీలో మూడవ స్థానం. బాస్కెట్ బాల్ లో రెండవస్థానం.

విడియోగ్రఫీ , రెజ్లింగ్ , మహిళల 10 కె రేస్ వాక్ లో రాష్ట్రంలోనే మొదటి స్థానం.

పురుషుల విభాగంలో రాష్ట్రంలోనే హాకీ లో రెండవ స్థానం.

కర్నూల్ సిటీ నందిపత్రిక గుంటూరు నాగార్జున, విట్ యూనివర్సిటీలో సెప్టెంబర్ 1 నుంచి 4వ తేదీ వరకు నిర్వహించిన ఏపీ పోలీస్ స్పోర్ట్స్ మీట్ మరియు డ్యూటీ మీట్ లో కర్నూలు జిల్లాకు చెందిన పోలీసు అధికారులు, సిబ్బంది అద్భుత ప్రతిభ కనబరిచి మొత్తం 32 పతకాలు సాధించారు. కర్నూలు జిల్లాకు చెందిన 63 మంది పోలీసు అధికారులు, సిబ్బంది వివిధ క్రీడాంశాల్లో పాల్గొని 7 బంగారు, 11 వెండి, 14 కాంస్య పతకాలు సాధించారు. సైంటి ఫిక్ ఎయిడ్స్ ఇన్విస్టిగేషన్ , విడియోగ్రఫీ , జూడో, ఆర్చరీ, అథ్లెటిక్స్, వెయిట్‌లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్, బ్యాట్ మింటన్, హ్యాండ్ బాల్, కబడ్డీ, బాస్కెట్ బాల్, పుట్ బాల్, రెజ్లింగ్, ఆర్మ్ రెజ్లింగ్, బాక్సింగ్, మార్షల్ ఆర్ట్స్, తైక్వాండో, స్విమ్మింగ్ తదితర క్రీడాంశాల్లో కర్నూలు జిల్లా పోలీసు క్రీడాకారులు ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా సోమవారం కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ కర్నూలు ఎస్పీ క్యాంపు కార్యాలయంలో పతకాలు సాధించిన పోలీసు క్రీడాకారులను ఎస్పీ అభినందించారు. క్రీడలు పోలీసు సిబ్బందిలో శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం, క్రమశిక్షణను పెంపొందించడంతో పాటు క్రీడాస్ఫూర్తి, పరస్పర సహకారాన్ని పెంపొందిస్తాయని ఎస్పీ తెలిపారు.కర్నూలు జిల్లాకు మంచి పేరు తీసుకువచ్చిన పోలీసు క్రీడాకారులు భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఎస్పీ ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కర్నూలు ట్రాఫిక్ సిఐ మస్సురుద్దీన్, కర్నూలు ఒకటవ పట్టణ సిఐ మారుతిశంకర్, పత్తికొండ సిఐ జయన్న , ఆర్ ఐ జావేద్, ఎస్సై సామీర్ భాషా ఆర్ఐలు, ఎస్ఐలు, పోలీసు క్రీడాకారులు పాల్గొన్నారు.

బండి ఆత్మకూరు మండలాన్ని కరువు మండలం గా ప్రకటించాలి

బండి ఆత్మకూరు నంది పత్రిక సెప్టెంబర్ 7:బండి ఆత్మకూరు మండలాన్ని కరువు మండలం గా ప్రకటించాలని కోరుతూ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో బండి ఆత్మకూర్ తాసిల్దార్ కార్యాలయం ముందు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. ధర్నా కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రామచంద్రుడు జిల్లా నాయకుడు సురేష్ మండల నాయకుడు సుధాకర్ రెడ్డి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు డేవిడ్ సిఐటియు జిల్లా నాయకుడు రత్నమయ్య వ్యవసాయ కార్మిక సంఘం సీనియర్ నాయకులు రామచంద్రుడు లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో సాగు భూములు 34 వేల ఎకరాలు ఉండగా నేటికీ కేవలం 15 వేల ఎకరాల భూములలో అరకొర పంట వేయడం జరిగిందని అన్నారు. ప్రధానంగా వరి మొక్కజొన్న మినుము పంటలు సాగు చేశారని, బోర్లు వంక వాగులు ఆధారంగా సాగుచేసిన పంటలు ఎండిపోయాయని అన్నారు. మండలంలో సగటున 53 శాతం సాధారణ వర్షపాతం కూడా లేకపోవడంతో రైతులు వరి నారుమల్లనను,సాలు వరి వేసి నీరు అందక పంటలు ఎండిపోయి రైతుకు ఎకరాకు 20000 రూపాయలు పెట్టుబడి పెట్టి నష్టపోయారని రైతులను ఆదుకోవాలని కోరారు.మరోవైపు శ్రీశైలం తెలుగంగ కేసీ కెనాల్ సాగునీరు ఉన్న త్రాగునీటికే ప్రాధాన్యత ఇస్తున్నామన్న ప్రభుత్వం రైతులను ఆదుకోవడానికి సాగునీరైనా అందించాలని అన్నారు. లేకపోతే మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి రైతులకు బ్యాంకు రుణాలు రద్దు చేయాలని ఉచిత పంటల బీమా అమలు చేసి నష్టపరిహారం ఇవ్వాలని, వేలాది ఎకరాలు కౌలుకు తీసుకొని పంటలు పండించే కౌలు రైతులకు రుణాలు ఇవ్వాలని, ఆరుతడి పంటలు వేసుకునే రైతులకు ఉచితంగా విత్తనాలు ఎరువులు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కూలీలకు అన్ని గ్రామాలలో ఉపాధి పనులు కల్పించి కరువు కూపన్లు ఇవ్వాలని నిత్యవసర వస్తువులు ఉచితంగా అందించాలని కోరారు.కార్యక్రమంలో రైతులు తిమ్మయ్య,రమణ దాసు, దరగయ్యతదితరులు పాల్గొన్నారు.ధర్నా అనంతరం తాసిల్దార్ పద్మావతమ్మకు వినతి పత్రాన్ని అందజేశారు.

వినాయక చవితి పండుగను శాంతియుతంగా జరుపుకోవాలి

ఉలిందకొండ ఎస్సై నిరంజన్ రెడ్డి



కర్నూల్ సిటీ నంది పత్రిక కర్నూలు జిల్లా కల్లూరు మండలం ఉలిందకొండ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ రోజు ఉలిందకొండ పీస్ నందు అన్ని గ్రామాల ప్రజలతో పీస్ కమిటీ సమావేశం నిర్వహించడమైనది.ఈ సమావేశంలో ప్రతి విగ్రహ నిర్వాహకుడు ఆన్లైన్ నందు అప్లై చేసుకుని పర్మిషన్ పొందాలని తర్వాత భక్తులు శాంతియుతంగా ఆనందంగా ప్రశాంతంగా పండుగ జరుపుకోవాలని నిమజ్జనం రోజు ప్రతి ఒక్కరూ పోలీస్ సూచనలు పాటించి పోలీసులకు సహకరించాలని నిమజ్జనం జరిగే ప్రదేశానికి చిన్న పిల్లలను తీసుకురావద్దని మద్యం సేవించి నిమజ్జన కార్యక్రమంలో పాల్గొన్న రాదని తెలియజేయడమైనది.

తాతా మధును బర్తరఫ్ చేయాలి

తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ ను ఉద్దేశించి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసినట్టుగా భావిస్తున్న వ్యాఖ్యలు శాసనసభ వేదికగా తీవ్ర దుమారాన్ని రాజేశాయి. సభలో బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ... రాజ్యాంగబద్ధమైన స్థానంలో ఉన్న స్పీకర్‌పై తాతా మధు వాడిన భాషను తీవ్రంగా ఖండిస్తున్నామని బీజేపీ ఎమ్మెల్యేల తరఫున స్పష్టం చేశారు. ప్రతిపక్ష నేత కేసీఆర్ తక్షణమే దీనిపై సభకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. తాతా మధు కావాలని మాట్లాడారా లేక ఎవరైనా మాట్లాడించారా అని ప్రశ్నించిన ఏలేటి... ప్రజాస్వామ్య వ్యవస్థను అవమానించిన సదరు ఎమ్మెల్సీని పదవి నుంచి తక్షణమే బర్తరఫ్ చేయాలని పట్టుబట్టారు. ఇదే క్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా సభలో తీవ్రస్థాయిలో మండిపడుతూ, కేసీఆర్ క్షమాపణలు చెప్పాల్సిందేనని, మధుపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. దళిత వర్గానికి చెందిన స్పీకర్‌కు జరిగిన తీవ్ర పరాభవంపై మంత్రి సీతక్క అసెంబ్లీలోనే భావోద్వేగానికి గురై కంటతడి పెట్టగా... స్పీకర్ గడ్డం ప్రసాద్ కూడా తీవ్ర మనస్తాపంతో భావోద్వేగానికి లోనై కన్నీళ్లు పెట్టుకోవడం సభను కుదిపివేసింది. మరోవైపు 22-ఏ నిషిద్ధ భూముల వివాదంపై ప్రభుత్వాన్ని మహేశ్వర్ రెడ్డి నిలదీశారు. 22-ఏ భూముల్లో జరిగిన అక్రమాలపై స్వయంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డే క్షమాపణలు చెప్పాలని, అధికారుల మీద నెపం నెట్టి తప్పించుకోవాలని చూస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఈ భూకుంభకోణంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపిస్తామని మంత్రి శ్రీధర్ బాబు సభలోనే స్పష్టమైన హామీ ఇస్తే తమ నిరసనను విరమిస్తామని స్పష్టం చేశారు. దీనిపై ప్రభుత్వం నేరుగా సమాధానం చెప్పకుండా ఇతర అంశాలతో డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోందని మండిపడ్డారు. 'ధరణి'పై నిజంగానే ఫోరెన్సిక్ ఆడిట్ జరిగిందా అని నిలదీసిన ఆయన... ఒకవేళ జరిగితే ఆ ఆడిట్ నివేదికలను పబ్లిక్ డొమైన్‌లో పెట్టి ప్రజల ముందుకు తీసుకురావాలని డిమాండ్ చేశారు.

ముగిసిన బీఏసీ సమావేశాలు

శాసనసభ, మండలి సమావేశాల నిర్వహణపై జరిగిన బిజినెస్ అడ్వైజరీ కమిటీ (బీఏసీ) సమావేశాల్లో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ మేరకు ఉభయ సభలను ఈనెల 12 వరకు నిర్వహించాలని బీఏసీలో ప్రాథమికంగా నిర్ణయించారు. సమావేశాల పొడిగింపుపై అవసరమైతే మరోసారి సమీక్ష జరపాలని నిర్ణయించారు. స్పీకర్ గడ్డం ప్రసాద్?కుమార్ అధ్యక్షతన ఇవాళ జరిగిన శాసనసభ బీఏసీ సమావేశంలో ప్రధానంగా ప్రజా సమస్యలపై చర్చించేందుకు అజెండా రూపొందించారు. ఈ భేటీకి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, శాసనసభా వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబు, ఆది శ్రీనివాస్, బీర్ల ఐలయ్య, బీజేపీ శాసనసభా పక్షనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఎంఐఎం ఎమ్మెల్యే బలాల హాజరయ్యారు. ఉదయం శాసనసభకు వెళ్తున్న తమపై పోలీసులు దౌర్జన్యం చేశారని నిరసిస్తూ బీఆర్ఎస్ ఈ సమావేశాన్ని బహిష్కరించింది. అసెంబ్లీ బీఏసీ సమావేశంలో 22ఏ, ఫీజు రీఎంబర్స్‌మెంట్‌పై స్వల్పకాలిక చర్చలు జరిపేందుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇవాళ ఉదయం 22ఏ నిషేధిత భూముల జాబితాపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలని బీజేపీ నేతలు డిమాండ్ చేశారు. దీంతో పాటు మరో 22 కీలకమైన అంశాలపై చర్చ జరిపేందుకు కనీసం 15 రోజుల పాటు అసెంబ్లీలో సమావేశాలు నిర్వహించాలని బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఫీజు రీఎంబర్స్‌మెంట్‌తో పాటు మైనారిటీ అంశాలపైనా అసెంబ్లీలో చర్చలు జరపాలని ఎంఐఎం నేత బలాలా సైతం కోరారు. ఈ నేపథ్యంలో సభలో ఎన్నిరోజులైనా సమావేశాలు నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. కాగా బీఏసీ సమావేశాన్ని బహిష్కరించిన బీఆర్?ఎస్.. రాష్ట్రంలో ప్రజా సమస్యలు చాలా ఉన్నాయని, అసెంబ్లీని కనీసం 20 నుంచి 30 రోజుల పాటు నడపాలని ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్? డిమాండ్ .

కుప్పంలో టీచర్‌పై దాడిని తీవ్రంగా ఖండించిన విద్యాశాఖ..

చిత్తూరు జిల్లా కుప్పంలో అత్యంత దారుణమైన ఘటన చోటుచేసుకుంది. గురుపూజోత్సవం రోజే, తరగతి గదిలో విద్యార్థులకు పాఠాలు చెబుతున్న ఒక ఉపాధ్యాయుడిపై ఇద్దరు వ్యక్తులు దాడికి పాల్పడ్డారు. బాధితుడు దేశానికి సేవ చేసిన ఒక మాజీ సైనిక హవల్దార్ కావడం గమనార్హం. ఈ ఘటనను పాఠశాల విద్యాశాఖ సుమోటోగా స్వీకరించి, నిందితులపై కఠినమైన క్రిమినల్ చర్యలకు ఆదేశించింది. ఇది స్పోర్ట్స్ కోటాలో నియమితులైన ఉపాధ్యాయులను లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న ఒక వ్యవస్థీకృత బెదిరింపుల దందా అని అనుమానిస్తున్నామని అధికారులు తెలిపారు.

విద్యార్థుల ముందే దాడి వివరాల్లోకి వెళితే, సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవం రోజున కుప్పంలోని ఒక మోడల్ ప్రైమరీ స్కూల్‌లో ఈ ఘటన జరిగింది. మాజీ సైనికుడైన ఉపాధ్యాయుడు తరగతి గదిలో పాఠాలు చెబుతుండగా, ఇద్దరు వ్యక్తులు లోపలికి ప్రవేశించారు. తాము మీడియా ప్రతినిధులమని చెబుతూ, ఉపాధ్యాయుడి మిలిటరీ గుర్తింపు కార్డు, విద్యార్హత సర్టిఫికెట్లు చూపించాలంటూ దురుసుగా ప్రవర్తించారు. విద్యార్థుల ముందే అవమానకరంగా మాట్లాడారు. తన వ్యక్తిగత పత్రాలు అడిగే అధికారం మీకెక్కడిదని ఉపాధ్యాయుడు ప్రశ్నించడంతో, వారు రెచ్చిపోయి ఆయన కాలర్ పట్టుకుని గొడవకు పాల్పడ్డారు.

మహా అష్టమి రోజున లిక్కర్ బంద్..

దుర్గా పూజ వేడుకల నేపథ్యంలో పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం ఒక కీలక నిర్ణయం తీసుకుంది. పండగలో అత్యంత పవిత్రమైన రోజైన మహా అష్టమి నాడు రాష్ట్రవ్యాప్తంగా సంపూర్ణ మద్యం నిషేధాన్ని విధిస్తున్నట్లు ముఖ్యమంత్రి సువేందు అధికారి ప్రకటించారు. ఆ రోజున భక్తులు దుర్గాదేవికి అత్యంత భక్తిశ్రద్ధలతో పుష్పాంజలి సమర్పిస్తారని, ఆ పవిత్రతను కాపాడేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఈ ఏడాది అక్టోబర్ 19న మహా అష్టమి పర్వదినం జరగనుంది. సోమవారం కోల్‌కతాలోని మిలన్ మేళా ప్రాంగణంలో దుర్గా పూజ కమిటీలతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో ముఖ్యమంత్రి ఈ ప్రకటన చేశారు. "మహా అష్టమి రోజున రాష్ట్రంవ్యాప్తంగా అన్ని మద్యం దుకాణాలు, బార్లను మూసివేయాలి. ఆ రోజున మద్యం విక్రయాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతి లేదు" అని ఆయన తేల్చిచెప్పారు. దుర్గా పూజ ఉత్సవాల్లో భాగంగా మహా అష్టమి నాడు మద్యంపై నిషేధం విధించడం రాష్ట్ర చరిత్రలో ఇదే తొలిసారి.

ఓటరు జాబితా ప్రదర్శన

కొత్తపల్లి - నంది పత్రిక : మండలంలోని అయా గ్రామాలలో ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓటరు జాబితాను ప్రదర్శించామని డీప్యూటీ ఎంపీడీఓ మేరి, డీప్యూటీ ఎంపీడీఓ కె.పీ.ఆర్ శర్మలు అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాలకు ఓటరు జాబితాను ప్రదర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో 12 గ్రామ పంచాయతీలలోని స్వర్ణగ్రామ కార్యాలయాలలో ఈ ఓటరు జాబితాను ప్రదర్శించడం జరిగిందన్నారు. మండలంలో మొత్తం 25494 మంది ఎస్సీ, ఎస్టీ బీసీ ఓటర్లు ఉన్నారని అన్నారు. ఓటహక్కుకలిగిన అందరూ అందులో వారి వివరాలు ఉన్నాయో లేవో చూసుకోవాలని చెప్పారు.

ఎల్ఐసీ ఆత్మకూర్ శాఖలో 70వ వార్షికోత్సవ బీమా వారోత్సవాల ముగింపు

నంది పత్రిక ఆత్మకూరు.. ముఖ్య అతిథి డా. డి. నాగన్న మందులు మరియు యాంటీబయాటిక్స్‌ను బాధ్యతగా ఉపయోగించడంపై విలువైన సూచనలు అందించారు. దేశనిర్మాణంలో ఎల్ఐసీ పోషిస్తున్న ముఖ్యమైన పాత్రను, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థికభద్ర తకల్పించడంలో మాప్రాముఖ్యతను వి వరించారు.శాఖ మేనేజర్ జయసింహ జెరపు శాఖ పనితీరు మరియు విజయాలను వివరించా రూవారోత్సవాల్లో ఏజెంట్లు, ఉద్యోగులు మరియు పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు డా. డి. నాగన్న మరియు శాఖ మేనేజర్ జయసిం హజెరపు బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఏజెంట్స్ యూనియన్ నాయకులు సాయి బాబు, రాంబాబు, నాయకులు విజయ్ కుమార్ ,రవి కుమార్, జి. నాగన్న, ఫెడరేషన్ నాయకులు శ్రీ రాజు, ూూ రాజశేఖర్ నాయక్, స్టాఫ్ మిత్రులు పాల్గొన్నారు.

అన్నెం శివ నాగిరెడ్డి గారికి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు

శిరివెళ్ల (నంది పత్రిక)(కోటపాడు):- మండల పరిధిలోని కోటపాడు గ్రామానికి చెందిన అన్నెం శివ నాగిరెడ్డి గారు నేడు 61వ జన్మదిన వేడుకలు జరుపుకుంటున్న సుభ సందర్భంగా ఆయనకు పలువురు ఆప్తమిత్రులు శ్రేయోభిలాషులు బంధుమిత్రులు తన క్రింది స్థాయి సిబ్బంది హృదయపూర్వక జన్మదిన శు భాకాంక్షలు తెలియజేశారు. 61వ వసంతంలో కి అడుగుపెడుతున్న శుభ సందర్భంగా అన్నెం శివనాగిరెడ్డి గారు ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యా లతో సుఖసంతోషాలతో భోగభాగ్యాలతో వర్ధిల్లా లని పలువురు ఆ దేవుని వేడుకుంటున్నట్లు తెలియజేశారు. ఈ సందర్భంగా భారీ కేకును కట్ చేసి ఆయన అభిమానులు పంచిపెట్టారు

రహదారుల పక్కన చెత్త కుప్పలు కనిపిస్తే సహించేది లేదు

డంపింగ్ యార్డులకు అనువైన స్థలాలను గుర్తించాలి

చెత్తను రీసైక్లింగ్ చేసి సంపదగా మార్చాలి

డీపీఓ, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలకు ఆదేశాలు

జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

భీమవరం బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 7 నంది పత్రిక

జిల్లాలోని ప్రధాన రహదారులు, గ్రామీణ, పట్టణ పరిధిలో రహదారులు పక్కన చెత్త కుప్పలు కనిపించకుండా పటిష్టమైన పారిశుధ్య చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, డి పి ఓ, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓ లను ఆదేశించారు.జిల్లాలో పారిశుధ్య నిర్వహణ, ఘన వ్యర్థాల సేకరణ, రీసైక్లింగ్, డంపింగ్ యార్డుల ఏర్పాటు తదితర అంశాలపై సోమవారం కలెక్టరేట్ లోని పి జి ఆర్ ఎస్ సమావేశ మందిరంలో జరుగుతున్న పిజిఆర్ఎస్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సంబంధిత శాఖ అధికారులను పలు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ,జిల్లా లో రహదారుల పక్కన చెత్త కుప్పలు కనిపించడం ఏమాత్రం సహించేది లేదని హెచ్చరించారు. పట్టణాలు, గ్రామాల్లో ప్రతిరోజూ ఇంటింటి నుంచి చెత్తను సక్రమంగా సేకరించాలని, రహదారులు, కాలువలు, ఖాళీ ప్రదేశాల్లో చెత్త వేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. పారిశుధ్య నిర్వహణలో అధికారులు నిర్లక్ష్యం వహించకుండా క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.సేకరించిన చెత్తను కేవలం డంపింగ్ చేయకుండా తడి, పొడి చెత్తను వేరు చేసి, సాధ్యమైనంత మేర రీసైక్లింగ్ చేయాలని కలెక్టర్ సూచించారు. వ్యర్థాలను శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించడం ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు వ్యర్థాల నుంచి ఆదాయం సమకూరేలా చర్యలు చేపట్టాలని అన్నారు. ప్రతి మున్సిపాలిటీ, మండల పరిధిలో అవసరమైన మేరకు డంపింగ్ యార్డులు, నిర్వహణకు అనువైన స్థలాలను గుర్తించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ భూములు, ఇతర అనువైన ప్రాంతాలను పరిశీలించి, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని స్థలాలను ఎంపిక చేయాలని సూచించారు. గ్రామాల్లో పారిశుధ్య పరిస్థితులను ఎంపీడీఓలు, పంచాయతీ అధికారులు క్రమం తప్పకుండా పరిశీలించాలని, మున్సిపల్ కమిషనర్లు తమ పరిధిలోని పారిశుధ్య సిబ్బంది పనితీరును పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. చెత్త సేకరణ వాహనాలు, సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుని, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పారిశుధ్య సేవలు అందించాలని తెలిపారు. పరిశుభ్రమైన రహదారులు, పరిశు భ్రమైన గ్రామాలు, పరిశుభ్రమైన పట్టణాలే మన లక్ష్యం అని ఆమె అన్నారు. ప్రజారోగ్యానికి, పర్యావరణ పరిరక్షణకు పారిశుధ్య నిర్వహణ అత్యంత కీలక పాత్ర పోషిస్తుందని ఆమె అన్నారు. అధికారులు సమన్వయంతో పనిచేసి జిల్లాను పరిశుభ్రంగా తీర్చిదిద్దాలి అని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ కె.ఆర్ కల్పశ్రీ, డిఆర్ఓ పి గ్లోరియా, కలెక్టరేట్ కె ఆర్ సి డిప్యూటీ కలెక్టర్ పి. ప్రభాకర్, భీమవరం మునిసిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి, డి పి ఓ కె.అనురాధ, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో సత్తా చాటిన పశ్చిమగోదావరి జిల్లా క్రీడాకారులు...

పతక విజేతలకు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అభినందనలు

భీమవరం బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 7 నంది పత్రిక

జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ఆగస్టు 24 నుంచి 27వ తేదీ వరకు తిరుపతిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి అమరావతి ఛాంపియన్‌షిప్ క్రీడా పోటీల్లో పశ్చిమగోదావరి జిల్లా నుంచి పాల్గొని పలు పతకాలు సాధించిన క్రీడాకారులను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని పి.జి.ఆర్.ఎస్. సమావేశ మందిరంలో అభినందించారు. విజేతల మెడలో పతకాలు వేసి, వారి ప్రతిభను ప్రశంసిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ క్రీడల్లో ప్రతిభ కనబరుస్తూ రాష్ట్రస్థాయిలో పతకాలు సాధించిన క్రీడాకారులు పశ్చిమగోదావరి జిల్లాకు గర్వకారణమని అన్నారు. యోగా అండర్23 విభాగంలో ఐ. అర్మిత భవాని చౌదరి వెండి పతకం సాధించారని తెలిపారు. ఆర్చరీ అండర్17 విభాగంలో కె. హేమశ్రీ బంగారు పతకం సాధించగా, జట్టు విభాగంలో కనిష్క, శ్రద్ధ లు కూడా బంగారు పతకాలు సాధించారని వివరించారు.షటిల్ బ్యాడ్మింటన్ అండర్17 విభాగంలో ఎన్. హేమంత్ శ్రీ సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో బంగారు పతకాలు సాధించారని, సి.హెచ్. విజయ చరణ్ సింగిల్స్ విభాగంలో బంగారు పతకం సాధించారని జిల్లా కలెక్టర్ తెలిపారు. బాక్సింగ్ అండర్17 విభాగంలో బి. నదియా 7075 కేజీల విభాగంలో బంగారు పతకం సాధించగా, కె. శరణ్య 4446 కేజీల విభాగంలో వెండి పతకం సాధించారని వివరించారు.క్రీడాకారులు సాధించిన విజయాలు ఇతర విద్యార్థులు, యువతకు స్ఫూర్తిదాయకమని జిల్లా కలెక్టర్ అన్నారు. చదువుతో పాటు క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రతిభ ఉన్న క్రీడాకారులను గుర్తించి వారికి అవసరమైన ప్రోత్సాహం, శిక్షణ అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పశ్చిమగోదావరి జిల్లాకు మరింత గుర్తింపు తీసుకురావడానికి క్రీడాకారులు కృషి చేయాలని ఆమె అన్నారు. జిల్లాలో క్రీడా ప్రతిభను మరింతగా వెలికితీసేందుకు పాఠశాల స్థాయి నుంచే క్రీడాకారులను ప్రోత్సహించడం, వారికి మెరుగైన శిక్షణా అవకాశాలు కల్పించడం ఎంతో ముఖ్యమని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. పతకాలు సాధించిన క్రీడాకారులు తమ విజయ పరంపరను కొనసాగిస్తూ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత విజయాలు సాధించాలని ఆమె ఆకాంక్షించారు.జిల్లా జాయింట్ కలెక్టర్ కె కల్పశ్రీ మాట్లాడుతూ, రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో పశ్చిమగోదావరి జిల్లా క్రీడాకారులు ప్రతిభ కనబరిచి పతకాలు సాధించడం అభినందనీయమన్నారు. క్రీడల్లో విజయం సాధించేందుకు ప్రతిభతో పాటు నిరంతర సాధన, క్రమశిక్షణ, పట్టుదల ఎంతో అవసరమని అన్నారు. పతకాలు సాధించిన క్రీడాకారులు తమ విజయాలను స్ఫూర్తిగా తీసుకుని మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆమె తెలిపారు. క్రీడాకారులకు తల్లిదండ్రులు, కోచ్‌లు, పీఈటీలు అందిస్తున్న ప్రోత్సాహం, మార్గదర్శనం అభినంద నీయమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడల శాఖ అధికారి ఎన్. మోహన్ దాస్ తో పాటు, పీఈటీలు, పీడీలు, కోచ్‌లు, మేనేజర్లు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

బేతంచెర్ల మండల ఓటర్ల జాబితాను విడుదల చేసిన ఎంపీడీఓ.

బేతంచెర్ల సెప్టెంబర్ 7 (నందిపత్రిక). బేతంచెర్ల మండలంలోని 19 గ్రామ పంచాయితీల నందు ఓటర్ల జాబితాను 7/9/2026 వతేదీ సోమవారం నాడు ప్రచురించడము, ధ్రువీకరించడము జరిగినదని బేతంచెర్ల మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎం. ఫజుల్ రహిమాన్ ప్రకటన విడుదల చేశారు. 37,593(ముప్పై ఏడువేల, ఐదువందల,తొంభై మూడు మంది) ఓటర్లుగా నమోదు అయ్యాయని,ఇందులో ఎస్టీ పురుషులుగా 461,ఎస్టీ మహిళలు 476 మొత్తంగా ఎస్టీలు 937మంది ఓటర్లు, ఎస్సి పురుషులు 4,697, ఎస్సి మహిళలు 4,825,ఇతరులు 2(ఇద్దరు) మొత్తంగా ఎస్సీ లు 9,524 మంది ఓటర్లు,బిసి పురుషులు 9,652,బిసి మహిళలు 9,741 మంది మొత్తంగా 1,9396 మంది బిసి ఓటర్లు గాను,అలాగే ఇతరులు (ఓసి లు) 3,929 మంది పురుషులు,3,807 ఓసి మహిళలు మొత్తంగా ఓసీలు 7,736 మంది ఓటర్లుగా, 5 గురుఇతరులుగా ఓటర్లు నమోదు అయ్యాయని, మొత్తంగా 19 గ్రామ పంచాయితీలకు సంభందించి మొత్తం పురుష ఓటర్లు 18,739గా మరియు మహిళా ఓటర్లు 18,849 గాను , 5 గురు ఇతరులుగా,టోటల్ గా 37వేల 5వందల 93 మందిగా ఉన్న ఓటర్ల లిస్టును సోమవారం నాడు ఎంపీడీఓ విడుదల చేశారు.

గంగమ్మ దేవత నూతన విగ్రహ పున ప్రతిష్ట

రుద్రవరం ప్రతినిధి సెప్టెంబర్ 07 (నంది పత్రిక): మండల పరిధిలోని శ్రీరంగాపురం గ్రామంలో గంగమ్మ దేవత నూతన విగ్రహ పున ప్రతిష్ట కార్యక్రమాన్ని సోమవారం గ్రామస్తు లంతా ఘనంగా నిర్వహించారు. గతంలోని గంగమ్మ దేవత విగ్రహం దెబ్బ తినడంతో గ్రామస్తులంతా నూతన విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. అలాగే వర్షాలు కురిసి పాడి పంటలతో అందరూ సంతోషంగా సుఖశాంతులతో జీవించాలని గంగమ్మ దేవతను కనుల విందుగా అలంకరించి భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించి ఘనంగా పూజలు చేశారు. గంగమ్మ తల్లికి పూజలు చేసిన వెంటనే గ్రామంలో వర్షం పడడంతో గ్రామస్తులంతా సంతోషం వ్యక్తం చేశారు.

ఢిల్లీలో విషాదం..

దేశ రాజధాని ఢిల్లీలో ఆదివారం ఘోర ప్రమాదం సంభవించింది. విద్యార్థులు నివసించే ఐదంతస్తుల ప్రైవేట్ పేయింగ్ గెస్ట్ (పీజీ) వసతి గృహం కుప్పకూలిన ఘటనలో ఏడుగురు ప్రాణాలు కోల్పోగా, పలువురు తీవ్రంగా గాయపడ్డారు. సత్య నికేతన్ ప్రాంతంలో చోటుచేసుకున్న ఈ విషాదం, ఢిల్లీ యూనివర్సిటీలో నెలకొన్న తీవ్రమైన హాస్టళ్ల కొరతను, విద్యార్థుల భద్రత అంశాలను మరోసారి తెరపైకి తెచ్చింది. యూనివర్సిటీ సౌత్ క్యాంపస్‌కు సమీపంలో ఉన్న ఈ భవనాన్ని "హాస్టల్ డేజ్" పేరుతో బాలుర వసతి గృహంగా నిర్వహిస్తున్నారు. పాత భవనంలో మరమ్మతులు చేపడుతుండగా ఈ ప్రమాదం జరిగింది.

స్పీకర్‌పై తాతా మధు అనుచిత వ్యాఖ్యలు..!

బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ కాంగ్రెస్ తీవ్ర ఆరోపణలు చేస్తోంది. ఈ నేపథ్యంలో తెలంగాణలో రాజకీయ దుమారం నెలకొంది. మరోవైపు మంత్రి సీతక్క భావోద్వేగానికి గురికాగా, స్పీకర్ గడ్డం ప్రసాద్ కూడా సభలోనే కన్నీళ్లు పెట్టుకున్నారు. ఈ సందర్భంగా శాసనసభాపతిపై అనుచిత భాషలో వ్యాఖ్యలు చేయడాన్ని సీఎం రేవంత్ రెడ్డి తీవ్రంగా తప్పుబట్టారు. స్పీకర్ పదవిని అవమానించడం ఒక్క వ్యక్తిని కించపరచడం కాదని అది మొత్తం శాసనసభ గౌరవానికి, ప్రజాస్వామ్య వ్యవస్థకు జరిగిన అవమానమన్నారు. ఇది తెలంగాణ చరిత్రలోనే చీకటి రోజుగా సీఎం అభివర్ణించారు. ఈ వ్యవహారంపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ బహిరంగంగా క్షమాపణ చెప్పాలని సీఎం రేవంత్ డిమాండ్ చేశారు. అనుచిత వ్యాఖ్యలు చేసిన సభ్యుడితో తక్షణమే రాజీనామా చేయించాలని, అవసరమైతే అతని పార్టీ సభ్యత్వాన్ని కూడా రద్దు చేయాల్సిందిగా కోరారు.

శాసనసభలో జరిగిన ఈ ఘటనపై సీఎం తీవ్ర భావోద్వేగంతో మాట్లాడారు. "స్పీకర్ స్థానం రాజ్యాంగబద్ధమైన అత్యున్నత స్థానం.. సీఎం నుంచి సాధారణ సభ్యుడి వరకు ప్రతి ఒక్కరూ ఆ పదవిని గౌరవించాల్సిందే.. స్పీకర్ మనసు గాయపడేలా, ఆయన కుటుంబాన్ని కించపరిచేలా మాట్లాడటం క్షమించరాని నేరం" అని వ్యాఖ్యానించారు. దళిత సామాజిక వర్గానికి చెందిన సభాపతిని అవమానించిన అంశాన్ని తాను దళిత ప్రజాప్రతినిధులందరికీ జరిగిన అవమానంగా భావిస్తున్నానన్నారు. బీఆర్ఎస్ దళిత వ్యతిరేక వైఖరిని అవలంబిస్తోందని ఆరోపించారు. తెలంగాణ ఏర్పడితే దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తామని చెప్పి మాట తప్పారని, మూడెకరాల భూమి హామీని అమలు చేయలేదని రేవంత్ విమర్శించారు. తొలి ప్రభుత్వంలోనే దళిత ఉపముఖ్యమంత్రిని బర్తరఫ్ చేశారని, నేరెళ్ల ఘటనలో దళితులపై దాడులు జరిగాయని ప్రస్తావించారు.ఇలాంటి ఘటనలు రాజకీయాలకు అతీతంగా ఖండించాలని రేవంత్ రెడ్డి సూచించారు. ప్రభుత్వం సంయమనం పాటిస్తే బలహీనతగా భావించవద్దన్నారు. రాజ్యాంగ వ్యవస్థలను బెదిరింపులతో ప్రభావితం చేయాలనుకుంటే సహించబోమని స్పష్టం చేశారు. సభలో చర్చ అనంతరమే నిర్ణయాలు తీసుకుంటామన్నారు.ఘటనపై కఠిన సభా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ దుర్మార్గపు పోకడలను రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ ముక్తకంఠంతో ఖండించాలని సీఎం రేవంత్ పిలుపునిచ్చారు. ఇలాంటివి కట్టడి చేయకపోతే సమాజం మనలను క్షమించరని, ఇలాంటి దుర్మార్గమైన తక్షణమే చర్యలు కట్టడి చేయాలన్నారు. ప్రతిపక్ష నేత పామ్ హౌస్‌లో ఉండి ప్రోత్సహిస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు. స్పీకర్‌పై తాతా మధు వ్యాఖ్యలపై మంత్రి సీతక్క ఆగ్రహం వ్యక్తంచేశారు.

printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com

ప్రజా సమస్యల పరిష్కారానికి పి జి ఆర్ ఎస్ కార్యక్రమం చక్కటి వేదిక

అర్జీలు సత్వరమే పరిష్కరించాలి

జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు

భీమవరం బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 7 నంది పత్రిక

సోమవారం జిల్లా కలెక్టరేట్లోని పి జి ఆర్ ఎస్ సమావేశ మందిరంలో జరిగిన పి జి ఆర్ ఎస్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పాల్గొన్నారు. ఈ సమావేశానికి వచ్చిన వికలాంగులు,వృద్ధులు వద్దకు స్వయంగా ఆమె వెళ్లి వారి వద్ద నుండి ఫిర్యాదులు తీసుకున్నారు. ఎక్కడ నుండి వచ్చారు మీ సమస్య ఏమిటి అని స్వయంగా అడిగి తెలుసుకున్నారు. పి జి ఆర్ ఎస్ సమావేశానికి వచ్చిన ఫిర్యాదుదారులకు తులసి కన్వెన్షన్ వీరవాసరం తులసి రాంబాబు ఆధ్వర్యంలో ప్రతివారం నిర్వహిస్తున్న ఉచిత భోజన సదుపాయాలను ఆమె పరిశీలించారు. ఫిర్యాదు దారులతో మాట్లాడి భోజన సదుపాయాలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఫిర్యాదులు ఆన్ లైన్ చేస్తున్న విధానాన్ని స్వయంగా ఆమె పరిశీలించారు. ఆన్లైన్ విధానం లో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా ఫిర్యాదుల సంబంధిత శాఖల లాగిన్ లోకి పంపే విధంగా చూడాలన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, కలిసి జిల్లా జాయింట్ కలెక్టర్ కె.ఆర్ కల్పశ్రీ, డిఆర్ఓ పి. గ్లోరియా, కె ఆర్ ఆర్ సి డిప్యూటీ కలెక్టర్ పి .ప్రభాకర్, పి జి ఆర్ ఎస్ జిల్లా ప్రత్యేక అధికారి వై. దోసి రెడ్డి, డ్వామా పి డి డా. కె సి హెచ్ అప్పారావు, జిల్లాలో పలు ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారుల నుండి 214 పి జి ఆర్ ఎస్, పిటీషన్లు 83 రెవెన్యూ క్లినిక్ లు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ

తమ సమస్యలు పరిష్కారం అవుతాయని ఎంతో ఆశతో అధికారులు వద్దకు వచ్చిన వారిని ఆప్యాయంగా పలకరించి వారు చెప్పే మాటలను ఓపికగా వినాలని సూచించారు. సమస్య వారి పరిధిలో కానీ ఎడల పరిష్కరించేందుకు ఇతర శాఖల సమన్వయం అవసరమైతే సంబంధిత శాఖలతో మాట్లాడి పరిష్కార మార్గం చూపాలని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అలసత్వం నిర్లక్ష్యానికి తావు లేకుండా అధికారులు పనిచేయాలని. స్పష్టం చేశారు. పి జి ఆర్ ఎస్ ద్వారా అందిన ప్రతి అర్జీ సత్వరం పరిష్కారం అయ్యేలా నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు.

ఫిర్యాదులు లో కొన్ని ఈ విధంగా ఉన్నాయి మొగల్తూరు మండలం ముత్యాలపల్లి గ్రామ నుండి ఆర్.రాంబాబు, బర్రి సామేలు, పొన్నమండ సూరయ్య, వాటాల వెంకటేశ్వర్లు తదితరులు ఎన్ హెచ్ 216 హైవే రోడ్ మీద భారీ వాహనముల తో రొయ్య తలకాయలు చేప పిల్లలను తీసుకు వచ్చి పండుగప్ప సాగు చేస్తున్న చెరువుల యజమానులకు అమ్ముచున్నారు. వాటి ద్వారా వచ్చిన వ్యర్థ నీటిని రోడ్ పక్కన డ్రైన్ లోనికి వదులుచున్నారు. దాని వలన గ్రామంలో విపరీతమైన దుర్వాసన వస్తుంది ప్రజలు చాలా ఇబ్బందులకు గురి అవుతున్నారు. వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. పెనుమంట్ర మండలం బ్రాహ్మణ చెరువు గ్రామం నుండి కలిగితి ఆదినారాయణ 90 శాతం వికలాంగుడు ను జీవనోపాధి కొరకు సైకిల్ షాపు పని చేస్తున్నాను ఇంటికి బయటకు వెళ్లడానికి ఇబ్బందిగా ఉంది ఎలక్ట్రికల్ వాహనం మంజూరు చేయాలని కోరారు.

భీమవరం మండలం కొవ్వాడ పుంత వెంకటాపురం గ్రామం నుండి ఎన్. విజయలక్ష్మి, డి.శారద, పోలి నాయుడు తదితరులు మేము నివాసం ఉంటున్న ప్రాంతంలో రోడ్డు డ్రైన్ లేక రోడ్డు పైనే నీరు నిలబడిపోయి నడవడానికి వీలు లేక ఇబ్బంది పడుచున్నాము సి సి రోడ్డు, డ్రైను నిర్మించాలని కోరారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, వయోవృద్ధుల సంక్షేమ ట్రిబునల్ మెంబర్ మేళం దుర్గాప్రసాద్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సెప్టెంబర్ 11 నుంచి 24 వరకు జిల్లావ్యాప్తంగా ఇంటింటి కుష్ఠు వ్యాధి గుర్తింపు సర్వే

తొలిదశలోనే కుష్ఠు వ్యాధిని గుర్తించి చికిత్స అందిస్తే అంగవైకల్యాన్ని నివారించవచ్చు జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ

విజయవాడ: బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 7 నంది పత్రిక

జిల్లాలో సెప్టెంబర్ 11వ తేదీ నుంచి 24వ తేదీ వరకు నిర్వహించనున్న ఇంటింటి కుష్ఠు వ్యాధి గుర్తింపు సర్వేకు సంబంధించిన గోడ పత్రికను జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ సోమవారం కలెక్టరేట్లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ మాట్లాడుతూ, "అంగవైకల్యాన్ని నివారించడానికి ముందుగానే కుష్ఠు వ్యాధిని గుర్తించి చికిత్స అందిస్తాము" అనే లక్ష్యంతో జిల్లావ్యాప్తంగా రెండు వారాల పాటు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కుష్ఠు వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించి, సకాలంలో చికిత్స అందించడం ద్వారా వ్యాధి తీవ్రతను తగ్గించడంతో పాటు అంగవైకల్యాన్ని నివారించవచ్చని పేర్కొన్నారు. ప్రజలు ఈ సర్వేకు పూర్తి సహకారం అందించాలని, ఆరోగ్య సిబ్బంది తమ ఇళ్లకు వచ్చినప్పుడు కుటుంబ సభ్యుల ఆరోగ్య వివరాలను తెలియజేసి పరీక్షలకు సహకరించాలని జిల్లా కలెక్టర్ కోరారు. శరీరంపై స్పర్శ తెలియని లేదా స్పర్శ తగ్గిన అనుమానాస్పద మచ్చలు కనిపించినట్లయితే వాటిని నిర్లక్ష్యం చేయకుండా సర్వే బృందానికి తెలియజేసి పరీక్షలు చేయించుకోవాలని కలెక్టర్ సూచించారు. కుష్ఠు వ్యాధికి సంబంధించిన లక్షణాలను ప్రారంభ దశలోనే గుర్తించడం ద్వారా వ్యాధి ఇతరులకు వ్యాప్తి చెందకుండా నియంత్రించడంతో పాటు, బాధితులకు సకాలంలో చికిత్స అందించే అవకాశం ఉంటుందని తెలిపారు. సర్వేలో భాగంగా ఆశా కార్యకర్తలు, ఎంపిక చేసిన పురుష ఆరోగ్య కార్యకర్తలు బృందాలుగా ఏర్పడి జిల్లాలోని ప్రతి ఇంటినీ సందర్శించనున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రతి కుటుంబంలోని సభ్యులను ఆరోగ్య సిబ్బంది పరిశీలించి, కుష్ఠు వ్యాధికి సంబంధించిన అనుమానాస్పద లక్షణాలు ఉన్న వ్యక్తులను గుర్తిస్తారని చెప్పారు. ప్రజలు ఎటువంటి భయాందోళనలకు గురికాకుండా ఆరోగ్య సిబ్బందికి సహకరించాలని కోరారు.

ఇంటింటి సర్వేలో భాగంగా అనుమానిత కేసులను గుర్తించిన అనంతరం, సంబంధిత ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య బృందం ద్వారా మరోసారి వైద్య పరీక్షలు నిర్వహిస్తారని జిల్లా కలెక్టర్ వివరించారు. వైద్య పరీక్షల్లో కుష్ఠు వ్యాధి నిర్ధారణ అయిన వారికి వెంటనే మల్టీ డ్రగ్ థెరపీ బహుళ ఔషధ చికిత్స అందించనున్నట్లు తెలిపారు. చికిత్సను క్రమం తప్పకుండా తీసుకోవడం ద్వారా వ్యాధిని పూర్తిగా నియంత్రించవచ్చని పేర్కొన్నారు. కుష్ఠు వ్యాధికి సంబంధించిన పరీక్షలు, చికిత్సను ప్రభుత్వం పూర్తిగా ఉచితంగా అందిస్తోందని జిల్లా కలెక్టర్ తెలిపారు. వ్యాధి నిర్ధారణ అయిన వ్యక్తులు చికిత్స విషయంలో ఎటువంటి నిర్లక్ష్యం చేయకుండా వైద్యుల సూచనల మేరకు మందులు వినియోగించాలని సూచించారు. కుష్ఠు వ్యాధి పట్ల ప్రజల్లో ఉన్న అపోహలు, భయాలను తొలగించి, వ్యాధి లక్షణాలు ఉన్నవారు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి పరీక్షలు చేయించుకునేలా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.

జిల్లాలో నిర్వహించనున్న ఇంటింటి కుష్ఠు వ్యాధి గుర్తింపు సర్వేను విజయవంతం చేయడానికి అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఆరోగ్య సిబ్బంది తమ ఇళ్లకు వచ్చినప్పుడు కుటుంబ సభ్యులందరూ పరీక్షలకు సహకరించి, అనుమానాస్పద లక్షణాలు ఉంటే ఎటువంటి సంకోచం లేకుండా తెలియజేయాలని సూచించారు. తొలిదశలో వ్యాధిని గుర్తించడం సకాలంలో చికిత్స అందించడం అంగవైకల్యాన్ని నివారించడం అనే లక్ష్యంతో జిల్లా యంత్రాంగం, వైద్య ఆరోగ్య శాఖ సమన్వయంతో ఈ సర్వేను సమర్థవంతంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, డిఆర్ఓ ఎం.లక్ష్మీనరసింహం, జిల్లా లెప్రసీ, టీబీ, ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ బి.భాను నాయక్, డీఈఓ ఎల్.చంద్రకళ, పలువురు జిల్లా అధికారులు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ప్రథమ ప్రాధాన్యం

- ప్రజా సమస్యల పరిష్కారానికి వేదికగా పీజీఆర్ఎస్
- నాణ్యమైన సేవలు అందించడం అధికారుల బాధ్యత
- జిల్లాస్థాయి పీజీఆర్ఎస్‌కు 171 అర్జీలు: జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

విజయవాడ బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 7 నంది పత్రిక ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటిని నిర్ణీత గడువులో పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా స్నేహపూర్వక ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)ను మరింత సమర్థవంతంగా నిర్వహించడంలో భాగస్వాములు కావాలని, అర్జీల పరిష్కార నాణ్యతలో రాజీలేకుండా కృషిచేయాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. సోమవారం కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో జిల్లాస్థాయి పీజీఆర్ఎస్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో కలెక్టర్ లక్ష్మీశ.. జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం తదితరులతో కలసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 171 అర్జీలు వచ్చాయి. రెవెన్యూ సేవలకు సంబంధించి 50, పోలీసు శాఖకు 33, పురపాలక పట్టణాభివృద్ధికి 24, పంచాయతీరాజ్‌కు 15 అర్జీలు వచ్చాయి. విద్య, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖలకు ఏడు చొప్పున, వైద్య ఆరోగ్య శాఖకు 6, విద్యుత్ శాఖకు 4 అర్జీలు రాగా ఎండోమెంట్, ఇరిగేషన్, స్వర్ణ గ్రామం-స్వర్ణ వార్డు శాఖలకు మూడు చొప్పున, డీఆర్‌డీఏ, ఉపాధి కల్పన, సమగ్ర శిక్షలకు రెండేసి చొప్పున, పశుసంవర్ధక, ఐసీడీఎస్, సమాచార, మార్కెటింగ్, గ్రామీణ నీటి సరఫరా, రవాణా, సాంకేతిక విద్యా శాఖలకు ఒక్కో అర్జీ వచ్చాయి. వీటిని క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా, పీజీఆర్ఎస్ ద్వారా తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకువచ్చే అవకాశం కలుగుతోందన్నారు. ప్రజల నుంచి అందే ప్రతి అర్జీని బాధ్యతగా స్వీకరించి, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా అధికారులు పనిచేయాలని సూచించారు. పీజీఆర్ఎస్‌లో నమోదైన ప్రతి అర్జీని సంబంధిత శాఖల అధికారులు ప్రాధాన్యతతో పరిశీలించాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. అర్జీల పరిష్కారంలో వేగంతో పాటు నాణ్యత, పారదర్శకత, జవాబుదారీతనం ఉండాలని స్పష్టం చేశారు. ప్రజా సమస్యలను పరిష్కరించడం ద్వారా ప్రభుత్వంపై ప్రజలకు మరింత విశ్వాసం కలిగేలా అధికారులు పనిచేయాలని కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులతో పాటు పీజీఆర్ఎస్ నోడల్ అధికారి జి.జ్యోతి పాల్గొన్నారు.

జిల్లాలోని తీర ప్రాంతంలో ప్రజలకు త్రాగునీరు అందించడానికి 1400 కోట్లతో జరుగుతున్న జల జీవన్ మిషన్ పనులకు ఆటంకాలు లేకుండా అనుమతులు మంజూరు చేయడానికి సహకరించాలి

జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

భీమవరం, బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 7 నంది పత్రిక

పశ్చిమగోదావరి జిల్లాలో తీర ప్రాంతంలో ప్రజలకు త్రాగునీరు అందించ డానికి 1400 కోట్ల రూపాయలతో జరుగుతున్న జల జీవన్ మిషన్ పనులకు ఆటంకా లు లేకుండా అనుమతులు మంజూరు చేయ డానికి సహకరించా లని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులను కోరారు. సోమవారం స్థానిక వశిష్ట సమావేశ మందిరం లో పశ్చిమ గోదావరి జిల్లా తీర ప్రాంతం లో ప్రజలకు జల జీవన్ మిషన్ ద్వారా త్రాగునీటి ప్రాజెక్టు పనులకు అంతరాయం లేకుండా చేపట్ట డానికి అనుమతు లు మంజూరు చేయుటకు పంచాయితీరాజ్, ఆర్& బి, ఇరిగేషన్, మున్సిపల్ శాఖల అధికారులతో సమన్వయ సమావేశాన్ని జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడు తూ జిల్లాలో కోస్తా తీర ప్రాంతాల ప్రజలకు త్రాగునీరు అందించ డానికి ప్రభుత్వం జల జీవన్ మిషన్ ప్రాజెక్టును మంజూ రు చేయడం జరిగిందని ఆమె చెప్పారు. జల జీవన మిషన్ ప్రాజెక్టు ద్వారా త్రాగునీరు అందించడానికి అవసరమైన రోడ్లు, కాలువలు, నిర్మాణా లు తొలగి శీచవలసి న చోట అవసర మైతే ముందస్తుగా అనుమతులు తీసుకొని పనులు చేపట్టాలని ప్రాజెక్టు అధికారులకు చెప్పారు. జల జీవన మిషన్ పనులు చేపట్ట డానికి అవసరమైన చోట ప్రతిపాదనల ను అన్ని శాఖల అధికారులకు ముందుగా తెలియ జేయాలని ప్రాజెక్ట్ అధికారులకు చెప్పారు. ప్రతినెల పనులు జరిగే వివరాలను ముందస్తుగా అధికారులకు తెలియజేయాలని కలెక్టర్ చెప్పారు. ఈ సమావేశంలో ఆర్&బి ఎగ్జిక్యూ టివ్ ఇంజనీర్ ఏ. శ్రీనివాసులు, జిల్లా పంచాయతీ అధికారి కె.అను రాధ, ఇరిగేషన్ మున్సిపల్ మరియు మెగా ప్రాజెక్ట్ ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.



బాపట్ల జిల్లాలో భారీ వర్షం..

బాపట్ల జిల్లాలో సోమవారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం బీభత్సం సృష్టించింది. ముఖ్యంగా చినగంజాం మండలంలో కురిసిన కుండపోత వానకు జనజీవనం స్తంభించింది. పలు రహదారులు మోకాళ్ల లోతు నీటిలో మునిగిపోవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

‘బడి కోసం మన అందరం’ కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ సహకరించాలి

జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి..

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు దాతల భాగస్వామ్యం ఎంతో కీలకం

భీమవరం బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 7 నంది పత్రిక కలెక్టరేట్లోని పిజెఆర్ సమావేశం మందిరంలో సోమవారం సమగ్ర శిక్ష , పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో బడి కోసం మన అందరం, మన పిల్లల భవిష్యత్తు.. మన బాధ్యత గోడ పత్రికను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించడంతో పాటు, ఆహ్లాదకరమైన విద్యా వాతావరణాన్ని అందించేందుకు చేపట్టిన ‘బడి కోసం మన అందరం’ కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. ప్రతి చిన్నారి విద్యాభివృద్ధి సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, దాతలు భాగస్వాములు కావాలని ఆమె కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు, పాఠశాల భవనాల అభివృద్ధి, ఫర్నిచర్, విద్యా సామగ్రి తదితర సదుపాయాలను మెరుగుపరచేందుకు దాతలు ముందుకు రావాలని జిల్లా కలెక్టర్ సూచించారు. “బడి బాగుంటే పిల్లలు బాగుంటారు.. పిల్లలు బాగుంటే మన సమాజం బాగుంటుంది” అనే స్ఫూర్తితో పాఠశాలల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆమె అన్నారు. విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించడం ద్వారా వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేయవచ్చని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలను మరింత అభివృద్ధి చేసి, విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాన్ని పెంపొందించేందుకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు సమాజ సహకారం ఎంతో అవసరమన్నారు. పాఠశాలల అవసరాలను గుర్తించి, వాటి అభివృద్ధికి దాతలు తమకు సాధ్యమైన మేరకు విరాళాలు అందించాలని కోరారు.‘బడి కోసం మన అందరం’ కార్యక్రమం ద్వారా అందించే సహకారం విద్యార్థుల భవిష్యత్తుకు అందించే విలువైన బహుమతి వంటిదని జిల్లా కలెక్టర్ అన్నారు. విద్యార్థుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని పాఠశాలలకు అవసరమైన వసతులు సమకూర్చేందుకు దాతలు ముందుకు రావాలని, సమాజంలోని ప్రతి ఒక్కరి భాగస్వామ్యంతో ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేయవచ్చని తెలిపారు. దాతలు తమ విరాళాలను ‘డొనేషన్ పోర్టల్’ ద్వారా అందించవచ్చని ఆమె తెలిపారు. పాఠశాలల అభివృద్ధికి తమ వంతు సహకారం అందించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమానికి సంబంధించిన వివరాల కోసం టోల్‌ఫ్రీ నంబర్: 7075159996 ను సంప్రదించవచ్చు.సమగ్ర శిక్ష పాఠశాల విద్యాశాఖ, పశ్చిమగోదావరి జిల్లా ఆధ్వర్యంలో పాఠశాలల అభివృద్ధికి చేపడుతున్న ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై, ప్రభుత్వ పాఠశాలలను మరింత అభివృద్ధి చేయడానికి సహకరించాలని జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఏపీసి ఎం శ్యామసుందర్ పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం కేసు నమోదు

రుద్రవరం ప్రతినిధి సెప్టెంబర్ 07 (నంది పత్రిక): మండలంలోని శ్రీరంగాపురం గ్రామానికి చెందిన పెద్ద నరసింహులు అనే వ్యక్తి కనిపించకుండా పోవడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై జయప్ప తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ 19-7-2025 తేదీన శ్రీరంగాపురం గ్రామంలో రెండో భార్యతో గొడవపడి ఇంటి నుంచి వెళ్లిపోయాడన్నారు. అక్కడ నుంచి గిద్దలూరు మండలంలోని అంబవరం గ్రామంలోని తమ బంధువుల దగ్గరకు వెళ్లి అక్కడ కొద్దిసేపు ఉండి కనిపించకుండా పోయాడన్నారు. కనిపించకుండా పోయిన వ్యక్తి కుమారుడు సత్య నరసింహుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఆ కేసును గిద్దలూరు పోలీస్ స్టేషన్ కు బదిలీ చేసినట్లు ఎస్సై తెలిపారు.

వడ్డెమాన్ గ్రామం లో చండి, వరుణ యాగం లో పాల్గొన్న బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి.

నందికొట్కూరు సెప్టెంబర్ 7(నంది పత్రిక)నందికొట్కూరు మండల పరిధిలో వడ్డెమాన్ గ్రామంలో సోమవారం వైసీపీ నాయకులు రవికుమార్ రెడ్డి స్వగృహం లో నందు గ్రామ క్షేమం కోరుతూ చండియాగం, మరియు వరుణ యాగం కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమమునకు ముఖ్య అతిథులుగా వైసిపి రాష్ట్ర విభజన విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి హాజరయ్యారు. అనంతరం ఆయన వేద పండితుల మంత్రోచ్ఛరణాల జరిగిన చండీ, వరుణ యాగం ప్రత్యేక పూజలలో పాల్గొని పూర్ణాహుతి సమర్పించి వర్షాల సమృద్ధిగా కురవాలని, ప్రజల సంక్షేమం కోసం కోరుకున్నట్లు బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు బంధుమిత్రులు వైఎస్ఆర్సిపి నేతలు పాల్గొన్నారు.

2 లక్షల సీడ్‌బాల్స్‌తో ఎన్టీఆర్ జిల్లాలో పచ్చదనానికి బాట

పర్యావరణ పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం కీలకం

జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ.

విజయవాడ: బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 7, నంది పత్రిక

స్థానిక కలెక్టరేట్ ప్రాంగణంలో సోమవారం వన్ ఎర్త్‌వన్ లైఫ్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన సీడ్‌బాల్స్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ పాల్గొన్నారు. పచ్చదనం పెంపు, జీవవైవిధ్య పరిరక్షణ, పర్యావరణ సమతుల్యత సాధించాలనే లక్ష్యంతో వన్ ఎర్త్‌వన్ లైఫ్ చేపడుతున్న కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థులు, సంస్థ వాలంటీర్లు తయారు చేసిన 2 లక్షల సీడ్‌బాల్స్‌ను జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ అందజేశారు . ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ మాట్లాడుతూ సీడ్‌బాల్స్ ద్వారా ప్రకృతి పునరుత్పత్తికి, పచ్చదనం పెంపునకు అవకాశం కలుగుతుందని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ కోసం వన్ ఎర్త్‌వన్ లైఫ్ సంస్థ నిర్వహిస్తున్న కార్యక్రమాలు అభినందనీయమన్నారు. విద్యార్థులు, మహిళలు, యువతను పర్యావరణ కార్యక్రమాల్లో భాగస్వాములను చేయడం ద్వారా సమాజంలో పర్యావరణ స్పృహ మరింత పెరుగుతుందని పేర్కొన్నారు. కాలుష్య నియంత్రణ, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, ప్లాస్టిక్ నిషేధంపై ప్రజల్లో అవగాహన కల్పించడం, పరిశుభ్రత, రీసైక్లింగ్ తదితర అంశాలపై ప్రజలను చైతన్య పరచాలని తెలిపారు. అంతరించిపోతున్న దేశవాళీ విత్తనాలను సంరక్షిస్తూ, వాటిని ప్రజలకు ఉచితంగా పంపిణీకి చర్యలు తీసుకోవాలని తెలిపారు. సాంప్రదాయ విత్తన సంపదను భవిష్యత్ తరాలకు అందించేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. విద్యార్థులకు చిన్న వయస్సు నుంచే మైక్రో గార్డెనింగ్, మొక్కల పెంపకం, విత్తనాల సంరక్షణ, వ్యర్థాల విభజన, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. పిల్లల్లో ప్రకృతి పట్ల బాధ్యతను పెంపొందించడం ద్వారా భవిష్యత్ తరాలను పర్యావరణహిత జీవన విధానం వైపు నడిపించవచ్చని కలెక్టర్ అన్నారు. వన్ ఎర్త్‌వన్ లైఫ్ ఫౌండర్ ఏలూరి లీలా కుమారి మాట్లాడుతూ నగరాల్లో పచ్చదనం పెంచడంతో పాటు ప్రతి ఇంటికీ పర్యావరణ పరిరక్షణను చేరువ చేయాలనే ఉద్దేశంతో తమ సంస్థ నిరంతరం కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. ముఖ్యంగా మిద్దె తోటలను ప్రోత్సహిస్తూ గృహిణులకు మిద్దె తోటల పెంపకం, ఇంటి వ్యర్థాలతో కంపోస్టు తయారీ, పర్యావరణ పరిరక్షణ అంశాలపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్‌లో ‘ధన్వంతరి వనం’ పేరుతో ఔషధ మొక్కలు నాటే కార్యక్రమాన్ని వన్ ఎర్త్‌వన్ లైఫ్ ఆధ్వర్యంలో చేపట్టామని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ ఒక్కరోజు కార్యక్రమం కాదని, ప్రతి కుటుంబం, విద్యార్థి, మహిళ తమ రోజువారీ జీవితంలో భాగంగా చేసుకోవాల్సిన బాధ్యత అని లీలా కుమారి పేర్కొన్నారు. ఈ సందర్భంగా 2 లక్షల సీడ్‌బాల్స్‌ను అనుకూలమైన కొండలు, అటవీ, బంజరు ప్రాంతాల్లో డ్రోన్‌ల ద్వారా వెదజల్లి, సహజంగా విత్తనాలు మొలకెత్తేలా చర్యలు చేపట్టనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో వన్ ఎర్త్ వన్ లైఫ్ వాలంటీర్ టీం సభ్యులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ మార్కెట్లో మన ఎంఎస్ఎంఈలు!

- పరిశ్రమల రాణింపునకు ఎగుమతులకు కొత్త ద్వారాలు

- 200కు పైగా ఎంఎస్ఎంఈలు.. 34 మంది అంతర్జాతీయ కొనుగోలుదారులు

- 100 ఎగుమతి ఒప్పందాలు, రూ. 100 కోట్ల వ్యాపార అవకాశాలు లక్ష్యం

- ఏపీ రివర్స్ బయ్యర్‌సెల్లర్ మీట్‌లో జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

- ఎంఎస్ఎంఈలను కొత్త అంతర్జాతీయ మార్కెట్లను చేరువ చేసేందుకు కృషి

- ఆంధ్రప్రదేశ్ ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సీఈవో విశ్వ మనోహరన్

విజయవాడ బ్యూరో చీఫ్ ఫ్ సెప్టెంబర్ 7 నంది పత్రిక

రాష్ట్రంలోని ఎంఎస్ఎంఈలు దేశీయ మార్కెట్లకే పరిమితం కాకుండా ప్రపంచ మార్కెట్లలో పోటీపడే స్థాయికి ఎదగాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. రాష్ట్రంలో ఔత్సాహిక పారిశ్రామిక వాతావరణాన్ని బలోపేతం చేస్తూ ‘ఒక కుటుంబంఒక పారిశ్రామికవేత్త’ విధానంతో ఉద్యోగాలను కోరుకునే వారిని ఉద్యోగాలు కల్పించే పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఎంఎస్ఎంఈ ఎక్స్‌పోర్ట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (ఏపీ ఎంఎక్స్‌డీపీ)లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఎంఎస్ఎంఈలను అంతర్జాతీయ ఎగుమతులకు సిద్ధం చేయడం లక్ష్యంగా విజయవాడలోని నోవాటెల్ హోటల్‌లో సోమవారం ఏపీ రివర్స్ బయ్యర్‌సెల్లర్ మీట్2026 కార్యక్రమం ప్రారంభమైంది. ర్యాంప్ కార్యక్రమం స్ఫూర్తితో ఏపీ ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఇండియా ఎస్ఎంఈ ఫోరం భాగస్వామ్యంతో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ లక్ష్మీశ, ఆంధ్రప్రదేశ్ ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సీఈవో విశ్వ మనోహరన్‌తో పాటు అంతర్జాతీయ కొనుగోలుదారులు, రాష్ట్రంలోని ఎంఎస్ఎంఈల ప్రతినిధులు పాల్గొన్నారు. రాష్ట్రంలోని ఎంఎస్ఎంఈలకు అంతర్జాతీయ మార్కెట్లను చేరువ చేయడం, విదేశీ కొనుగోలుదారులతో ప్రత్యక్ష వ్యాపార సంబంధాలను ఏర్పరచడం లక్ష్యంగా రెండు రోజుల పాటు ఈ కార్యక్రమం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో 200కు పైగా ఎంఎస్ఎంఈలు, 34 మంది అంతర్జాతీయ కొనుగోలుదారులు పాల్గొంటున్నారు. బుర్కినా ఫాసో, కామెరూన్, కోట్ డి ఐవరీ, ఘనా, జపాన్, శ్రీలంక, దక్షిణాఫ్రికా, జాంబియా, జింబాబ్వే తదితర దేశాల నుంచి కొనుగోలుదారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ఆవిష్కరణలు, పెట్టుబడులు, అభివృద్ధి రంగాల్లో ముందంజలో ఉందన్నారు. రాష్ట్రంలోని పారిశ్రామికవేత్తలు అంతర్జాతీయ కొనుగోలు దారులతో నేరుగా చర్చించి తమ ఉత్పత్తులకు కొత్త మార్కెట్లను అన్వేషించడం జరుగుతుందన్నారు. ప్రపంచ మార్కెట్ల అవసరాలకు అనుగుణంగా మన ఎంఎస్ఎంఈలు తమ ఉత్పత్తుల నాణ్యత, ప్రమాణాలను మరింత మెరుగుపరుచుకోవాలని పేర్కొన్నారు. ఈ రివర్స్ బయ్యర్‌సెల్లర్ మీట్ ద్వారా కనీసం 100 ఎగుమతి ఒప్పందాలు, ఆర్డర్లు సాధించడంతో పాటు సుమారు రూ. 100 కోట్ల మేర ఎగుమతి వ్యాపార అవకాశాలను సృష్టించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు వివరించారు.

ఆంధ్రప్రదేశ్ ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సీఈవో విశ్వ మనోహరన్ మాట్లాడుతూ ప్రపంచంలోని వివిధ దేశాల నుంచి కొనుగోలుదారులను ఆంధ్రప్రదేశ్‌కు ఆహ్వానించడం ద్వారా రాష్ట్ర ఎంఎస్ఎంఈలకు కొత్త అంతర్జాతీయ మార్కెట్లను అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు తెలిపారు. కొనుగోలుదారులుఎంఎస్ఎంఈల మధ్య జరిగే చర్చలను వాస్తవ వ్యాపార ఒప్పందాలు, ఎగుమతి ఆర్డర్లు, దీర్ఘకాలిక అంతర్జాతీయ భాగస్వామ్యాలుగా మార్చడమే లక్ష్యంగా ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రివర్స్ బయ్యర్‌సెల్లర్ మీట్‌లో వ్యవసాయంఆహార ఉత్పత్తులు, వ్యవసాయ యంత్ర పరికరాలు, వస్త్రాలుదుస్తులు, ఎలక్ట్రానిక్స్ఎలక్ట్రికల్స్, ఔషధాలుఫార్మాస్యూటికల్స్, వైద్య పరికరాలు, ఆరోగ్యంవెల్‌నెస్, సౌర విద్యుత్ పరికరాలు, రసాయనాలు, ఆటోమొబైల్ఆటో కాంపోనెంట్స్, ఇంజినీరింగ్ ఉత్పత్తులు తదితర 11 ప్రాధాన్యతా రంగాలకు చెందిన సంస్థలు పాల్గొంటున్నాయన్నారు.ఇండియా ఎస్ఎంఈ ఫోరం అధ్యక్షుడు వినోద్ కుమార్ మాట్లాడుతూ ఎంఎస్ఎంఈలు కేవలం ఉత్పత్తిదారులుగా కాకుండా ప్రపంచ మార్కెట్లలో పోటీపడగలిగే స్థాయి సరఫరాదారులుగా ఎదగాల్సిన అవసరం ఉందన్నారు. అంతర్జాతీయ కొనుగోలుదారులను నేరుగా విజయవాడకు తీసుకురావడం ద్వారా చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు అంతర్జాతీయ మార్కెట్లను చేరుకునే అవకాశాన్ని సులభతరం చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశాల ద్వారా తక్షణ ఆర్డర్లతో పాటు పునరావృత వ్యాపారం, భాగస్వామ్యాలు, దీర్ఘకాలిక మార్కెట్ సంబంధాలు ఏర్పడే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్లు ప్రధాన విజయరామ్, నీలపు విజయానంద రెడ్డి, నల్లపనేని మురళీమోహన్, చిన్న రాజు, బండారు రవికాంత్, సత్యనారాయణమూర్తి , ఎన్టీఆర్ జిల్లా పరిశ్రమల అధికారి ఎం.మధు, అంతర్జాతీయ కొనుగోలుదారులు, ఎంఎస్ఎంఈ ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ జిల్లా కోర్ కమిటీ సమావేశం

కడప నండి పత్రిక ప్రతినిధి సెప్టెంబర్ 07కడపలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో జిల్లా కోర్ కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో పార్టీ భవిష్యత్ కార్యాచరణ, ప్రజా సమస్యలు, కూటమి ప్రభుత్వ విధానాలపై చర్చించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేయాలని నిర్ణయించారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలులో వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నేతలు పిలుపునిచ్చారు.సమావేశంలో కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, రాష్ట్ర సీఈసీ సభ్యుడు కే. సురేష్ బాబు, రాష్ట్ర డిప్యూటీ సీఎం ఎస్.బి. అంజాద్ భాషా, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి, బద్వేల్ ఎమ్మెల్యే డాక్టర్ సుధమ్మ, మాజీ ఎమ్మెల్యేలు రాచమల్లు శివప్రసాద్ రెడ్డి, సెట్టిపల్లి రఘురాం రెడ్డి, కమలాపురం ఇన్‌చార్జ్ పి. నరేన్ రెడ్డి, ఎమ్మెల్సీలు గోవింద్ రెడ్డి, రామచంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే మాజీ మేయర్ పాకా సురేష్, నియోజకవర్గాల అబ్జర్వర్లు, జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులు, సోషల్ మీడియా కోఆర్డినేటర్ వివేక్, ఇతర కోర్ కమిటీ సభ్యులు హాజరయ్యారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. రానున్న రోజుల్లో పార్టీ బలోపేతమే లక్ష్యంగా ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

అమ్మవారిపేటలో పోలీసుల అవగాహన కార్యక్రమం

బి.కోడూరు, సెప్టెంబర్ 7 (నంది పత్రిక) బి.కోడూరు పోలీస్ స్టేషన్ ఎస్ఐ తాయార్ హుసేన్ ఆధ్వర్యంలో అమ్మవారి పేట గ్రామంలో ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్, ఐపీఎస్ ఆదేశాల మేరకు గ్రామాన్ని సందర్శించిన ఎస్ఐ, సిబ్బంది ప్రజలతో సమావేశమయ్యారు.రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల నియమ నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఎలాంటి గొడవలు, వివాదాలకు తావివ్వకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా పోలీసులకు సహకరించాలని కోరారు.అలాగే మహిళల భద్రత, మహిళలపై జరిగే నేరాల నివారణ, వేధింపుల నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పించారు. మహిళలు తమకు ఎదురయ్యే సమస్యలను భయపడకుండా వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. గ్రామంలో శాంతిభద్రతలను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి పోలీసులకు సహకరించాలని ఎస్ఐ తాయార్ హుసేన్ కోరారు.

తిమ్మాపురం హైస్కూల్‌లో ఉపాధ్యాయుల ఉదారత

మహానంది సెప్టెంబర్ 07 (నంది పత్రిక):- మహానంది మండలం తిమ్మాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల తాగునీటి వసతి కోసం ఉపాధ్యాయ బృందం రూ.40,000 విరాళం అందజేశారు.హెచ్ఎం చంద్రశేఖరరెడ్డి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు తమ సొంత నిధులను సమీకరించారు.ఈ నిధులతో విద్యార్థుల కొరకు మోటార్,వాటర్ ట్యాంక్ ఏర్పాటు చేయనున్నారు.దాతలుగా నిలిచిన ఉపాధ్యాయులు ఎన్.శ్రీనివాసరావు, మధుసూదన్, పార్వతమ్మ, హరిత, రామకృష్ణారెడ్డి, సుజాత,అల్తాఫ్, ప్రసాద్, హనుమంతు,స్వర్ణ, చంద్రశేఖర్ రెడ్డిలను హెచ్ఎం అభినందించారు.

నేడు మహానంది క్షేత్రంలో ప్రదోషకాల నందీశ్వర అభిషేక పూజలు

మహానంది సెప్టెంబర్ 07 (నంది పత్రిక):- మాసోత్సవాలలో భాగంగా నందీశ్వరుడు జన్మించిన మహానంది క్షేత్రంలో మంగళవారం శ్రావణ బహుళ త్రయోదశి (ప్రదోష సమయంలో) నంది ప్రదోషం సందర్భంగా ప్రదోషకాల నందీశ్వరాభిషేకం వైభవంగా నిర్వహించడం జరుగుతుందని వేదపండితులు రవిశంకర్ అవధాని తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈవో శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో గర్భాలయం ఎదురుగా కొలువైన నందీశ్వరునికి ప్రదోషకాలంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించడం జరుగుతుందన్నారు.ఈ పూజలో పాల్గొనే భక్తులు మంగళవారం సాయంత్రం 4.00 గంటలకు సేవా రుసుము తీసుకుని ఆలయం వద్దకు చేరుకోవాలన్నారు. పవిత్రమైన ,గౌరిదేవి,కి ప్రీతికరమైన శ్రావణ మంగళవారంతో కూడిన మహాప్రదోష కాల శుభ దినాన్ని అందరు ఉపయోగించుకుని నంది అభిషేకంలో పాల్గొనాలని కోరారు.

ఉయ్యాలవాడ మండలం ఒంటెద్దుపల్లి గ్రామంలో పేకాట రాయుళ్ల అరెస్టు

ఉయ్యాలవాడ సెప్టెంబర్ 7 నంది పత్రిక ఉయ్యాలవాడ మండల పరిధిలోని రూపనగుడి గ్రామ పొలిమేరలో గల కంపచెట్లలో పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను ఉయ్యాలవాడ పోలీసులు అరెస్టు చేశారు.ఈ ఘటనకు సంబంధించి ఉయ్యాలవాడ ఎస్సై రామిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం సమాచారం అందుకున్న ఎస్ఐ తన సిబ్బందితో కలిసి ఆ ప్రాంతంలో దాడులు నిర్వహించారు.ఈ దాడుల్లో పేకాట ఆడుతున్న ఎనిమిది మందిలో ఇద్దరు పారిపోగా మిగిలిన ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకోగా, వారి వద్ద నుండి రూ. 10,200/- నగదుతో పాటు 52 పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ రామిరెడ్డి మాట్లాడుతూ ఉయ్యాలవాడ మండల పరిధిలో ఎవరైనా సరే పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. చట్టవిరుద్ధమైన పనులకు పాల్పడే వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

సీఎం చంద్రబాబు లీడర్‌షిప్ కాంక్లేవ్ లో పాల్గొనడం అదృష్టం.

నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి.

మంగళగిరి. సెప్టెంబర్ 07 . (నంది పత్రిక):మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో టీడీపీ జాతీయ అధ్యక్షులు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో సోమవారం జరిగిన లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో పాల్గొనడం అదృష్టం గా భావిస్తున్నానని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు.తెలుగుదేశం పార్టీ బలోపేతం, రాష్ట్ర ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించడం, కూటమి ఐక్యత, భవిష్యత్ కార్యాచరణపై ఈ సమావేశంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విలువైన మార్గనిర్దేశం అందించారని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు.

మద్యం సేవించి వాహనం నడిపితే జైలు శిక్ష... ఎస్సై రాజారెడ్డి

చాగలమర్రి సెప్టెంబర్ 7 నంది పత్రిక మద్యం సేవించి వాహనాలు నడిపితే జైలు శిక్ష తప్పదని ఎస్సై రాజారెడ్డి అన్నారు. సోమవారం మద్యం సేవించిన డ్రైవర్ విట్టల్ ను ఆళ్లగడ్డ స్పెషల్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పరచగా ముద్దాయి విట్టల్ కు 5 రోజులు సాధారణ జైలు శిక్ష విధించారని ఎస్ఐ తెలిపారు. వివరాల మేరకు సెప్టెంబర్ 7వ తేదీ తెల్లవారుజామున టోల్ ప్లాజా వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా అతిగా మద్యం సేవించి ఏఆర్ 01 క్యూ 8808 ఎల్లో ట్రావెల్ విట్టల్ మారుతి హైదరాబాద్ నడుపుతూ వస్తుండగా వాహనాన్ని ఆపి బ్లీచింగ్ అనలైజర్ తో పరీక్షించగా 100 పరిమితికి మించి మోతాదు నిర్ధారణ అయింది. మద్యం సేవించిన డ్రైవర్ను కోర్టు ఖాదర్పరచుగా జైలు శిక్ష విధించారు.

సెప్టెంబర్ 12వ తేదీ న నంద్యాల లో రాష్ట్రస్థాయి చెస్ పోటీలు

నంద్యాల ప్రతినిధి. సెప్టెంబర్ 07 . (నంది పత్రిక):నంద్యాల జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, ఎన్ ఆర్ జి చెస్ అకాడమీ నిర్వహణలో ఈనెల 12వ తేదీన నంద్యాల టెక్కే లో ఉన్న నెరవాటి ఇంగ్లీష్ మీడియం పాఠశాల నందు రాష్ట్ర స్థాయి చెస్ పోటీలు నిర్వహిస్తున్నామని నంద్యాల జిల్లా చెస్ సంఘం అధ్యక్షుడు డాక్టర్ రవి కృష్ణ, కార్యదర్శి రామ సుబ్బా రెడ్డి ఒక ప్రకటన లో తెలిపారు. ఈ పోటీలు 12 వివిధ వయసు విభాగాల్లో వేరువేరుగా జరుగుతాయని తెలిపారు. టోర్నమెంట్ కోఆర్డినేటర్స్ గా నెరవాటి స్కూల్ డైరెక్టర్ & కరస్పాండెంట్ ఆనందగుప్తా,కృష్ణ సాయి రోహిత్ లు వ్యవహరిస్తారని అన్నారు.రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీల్లో మంచి ప్రతిభ కనబరిచిన వారికి ఒక్కొక్క క్యాటగిరి లో 10 ప్రైజ్ ల చొప్పున మొత్తం 120 ప్రైజ్ లను ఇవ్వడం జరుగుతుందన్నారు.ఆసక్తి ఉన్న చెస్ క్రీడాకారులు ఏపీ చెస్ వెబ్సైట్ ద్వారా ఈనెల 09 వ తేదీ సాయంత్రం లోపు ఎంట్రీలు నమోదు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 9010451585, 9573661799 నెంబర్ లను సంప్రదించాలని తెలిపారు.

వినాయక చవితి వేడుకలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలి: డీఎస్పీ రామాంజి నాయక్.

నందికొట్కూరు సెప్టెంబర్ 7(నంది పత్రిక) వినాయక చవితి వేడుకలను ఇతరులకు ఇబ్బంది కలిగించకుండా, మండపాల ఏర్పాట్ల తగు జాగ్రత్తలు పాటిస్తూ ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించుకోవాలని ఆత్మకూరు డిఎస్పి రామాంజీ నాయక్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సోమవారం నందికొట్కూరు పట్టణంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పట్టణ సీఐ అశోక్ కుమార్, రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం అధ్యక్షతన టిటిడి కళ్యాణ మండపం నందు వినాయక చవితి వేడుకల సందర్భంగా పీస్ కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆత్మకూరు డిఎస్పి రామాంజీ నాయక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక చవితి నవరాత్రి వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని, మండపాల ఏర్పాటుకు పోలీస్ శాఖ వారి అనుమతి తీసుకోవాలని, తగు జాగ్రత్తలతో ఇతరులకు ఇబ్బందులు కలవకుండా నిర్వహించుకోవాల్సిన బాధ్యత మనందరిన్నారు. ప్రపంచంలో మన దేశము సంస్కృతి సంప్రదాయాలకు ప్రజలు సోదరా భావంతో మెలుగుతారన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. మనం నిర్వహించే వేడుకలు ఇతరులకు ఇబ్బంది కలిగించకూడదు, డిజె సౌండ్ పెట్టరాదని కమిటీ నిర్వాహకులకు ఆయన సూచించారు. ఇతరులకు ఆటంకాలు కలిగించి ఇబ్బందులు సృష్టిస్తే అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఏదైనా సమాచారం ఉంటే పోలీస్ శాఖ వారికి తప్పకుండా చేరవేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సై చంద్రశేఖర్ మరియు పట్టణ ఎస్సీ ఎస్టీ బీసీ ముస్లిం మైనార్టీ ప్రజలు పీస్ కమిటీ సభ్యులు నిర్వాహకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ లో గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేందుకు అందరూ సహకరించాలి..

పట్టణ సి.ఐ నాగ రాజా రావు

ఆళ్లగడ్డ ప్రతినిధి సెప్టెంబర్ 7 నంది పత్రికఆళ్లగడ్డ పట్టణంలో గణేష్ ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా అన్ని మతాల పెద్దలు, ప్రజలు సహకరించాలని ఆళ్లగడ్డ టౌన్ సీఐ నాగరాజారావు కోరారు. సోమవారం సాయంత్రం టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో పీస్ కమిటీ సమావేశం నిర్వ హించారు. గణేష్ విగ్రహాల ఏర్పాటుకు సింగిల్ విండోలో ప్రత్యేక పోర్టల్ ద్వారా అనుమతి పొందాలన్నారు. గణేష్ మంటపాల దగ్గర అశ్లీల నృత్యాలు, డీజే లు నిషిద్ధమన్నారు. గణేష్ ఉత్సవాలలో ఈవ్ టీజింగ్ లాంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సిఐ నాగరాజు రావ్ హెచ్చరించారు. మండపాల వద్ద విద్యుత్ ప్రమాదాలు జరగకుండా తగు జాగ్రత్తలు వహించాలని గణేష్ ఉత్సవ కమిటీలకు సూచించారు. నిమజ్జన కార్యక్రమం సాయంత్రం లోగా పూర్తయ్యేలా చూసుకోవాలని సీఐ నాగరాజారావు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో పట్టణ ఎస్సైలు పీరయ్య శ్రీనివాస గౌడ్, రామకృష్ణారెడ్డి, విశ్వహిందూ పరిషత్ అధ్యక్షుడు, న్యాయవాది ఆవుల విజయభాస్కర్ రెడ్డి, ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షుడు గుండా మనీ, అధ్యాపకులు పిచ్చల మల్లేశ్వర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ హుస్సేన్ భాష అమీర్ భాష, మాదం కిషోర్, రామాచారి, శ్రీనివాసరెడ్డి, పోలీస్ సిబ్బంది, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



పశ్చిమగోదావరి జిల్లా వ్యవసాయ శాఖ అధికారిగా జి. సునీత బాధ్యతల స్వీకరణ

జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మర్యాదపూర్వకంగా కలిసిన వ్యవసాయ శాఖ అధికారి జి సునీత

భీమవరం బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 7 నంది పత్రికపశ్చిమగోదావరి జిల్లా నూతన వ్యవసాయ శాఖ అధికారిగా జి. సునీత సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు గుంటూరులోని వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యాలయంలో డిప్యూటీ డైరెక్టర్ హోదాలో విధులు నిర్వహించిన ఆమెకు పదోన్నతిపై పశ్చిమగోదావరి జిల్లా వ్యవసాయ శాఖ అధికారిగా నియామకం జరిగింది.బాధ్యతలు స్వీకరించిన అనంతరం జి. సునీత జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణిని కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్‌కు మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ పశ్చిమగోదావరి జిల్లా వ్యవసాయ రంగంలో రాష్ట్రంలోనే కీలక స్థానాన్ని కలిగి ఉందన్నారు. జిల్లాలో రైతులకు ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ, అభివృద్ధి పథకాలు సమర్థవంతంగా అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, సాగునీరు, సాంకేతిక సలహాలు సకాలంలో అందేలా వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయాలని అన్నారు.

వైఎస్సార్‌సీపీ జిల్లా విస్తృత స్థాయి సమావేశం

కడప నంది పత్రిక ప్రతినీది సెప్టెంబర్ 07 కడప: వైఎస్సార్ కడప జిల్లా కడప కన్వెన్షన్ హాల్‌లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి పార్టీ జిల్లా అబ్జర్వర్ అజయ్ రెడ్డి, కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, రాష్ట్ర సీఈసీ సభ్యుడు కే. సురేష్ బాబు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి తదితరులు హాజరయ్యారు.రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీ శ్రేణులను సమాయత్తం చేయడం, నాయకులుకార్యకర్తల మధ్య సమన్వయంతో పార్టీని మరింత బలోపేతం చేయడంపై సమావేశంలో చర్చించారు. జగన్మోహన్ రెడ్డి ఆశయాలను ముందుకు తీసుకెళ్లడంతో పాటు రాబోయే ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా పనిచేయాలని నాయకులు పిలుపునిచ్చారు. సమావేశంలో మైదుకూరు మాజీ ఎమ్మెల్యే సెట్టిపల్లి రఘురామిరెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం ఎస్.బి. అంజద్ బాషా, బద్వేలు ఎమ్మెల్యే సుధమ్మ, కమలాపురం ఇన్‌చార్జ్ నరేన్ రెడ్డి, ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి, ఎమ్మెల్సీ గోవింద్ రెడ్డి, కడప అబ్జర్వర్ గురు మోహన్‌తో పాటు జిల్లా నాయకులు, నియోజకవర్గ సమన్వయకర్తలు, మండల నాయకులు, వివిధ అనుబంధ విభాగాల అధ్యక్షులు, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు. వైఎస్సార్ కడప జిల్లాలో పార్టీ బలాన్ని మరింత పెంచేందుకు అందరూ ఐక్యంగా పనిచేయాలని నాయకులు సూచించారు.

డంప్‌యార్డ్ ను మార్చండి.. ప్రజల ఆరోగ్యమును కాపాడండి : పిక్మిలి వెంకటేశ్వర్లు.

ఆత్మకూరు నుంచి వచ్చే చెత్తను నందికొట్కూరుకు తరలించకుండా చూడాలి

నందికొట్కూరు సెప్టెంబర్ 7(నంది పత్రిక)పట్టణంలోని డంప్‌యార్డ్‌ను తక్షణమే మార్చాలని, ఆత్మకూరు మున్సిపాలిటీ నుంచి వచ్చే చెత్తను నందికొట్కూరు డంప్‌యార్డ్‌కు తరలించకుండా చర్యలు తీసుకోవాలని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీ జిల్లా కార్యదర్శి పిక్మిలి వెంకటేశ్వర్లు, యువజన నాయకులు షేక్ సెమీవుల్లా, షేక్ లడ్డు, అబ్దుల్లా, ఎస్. సత్తార్ డిమాండ్ చేశారు. సోమవారం కుమ్మరిపేట కాలనీవాసులు, యువజన సంఘం నాయకుల ఆధ్వర్యంలో కుమ్మరిపేట, వాల్మీకి నగర్, పగిడాల రోడ్డు మీదుగా మున్సిపల్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టి, మున్సిపల్ కమిషనర్ జి. వెంకట్రామిరెడ్డికి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, పట్టణంలోని డంప్‌యార్డ్ కారణంగా పరిసర కాలనీల ప్రజలు దుర్వాసన, దుమ్ముధూళి, పొగతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు, మహిళలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆత్మకూరు మున్సిపాలిటీ నుంచి చెత్తను నందికొట్కూరుకు తరలించి రీసైక్లింగ్ ప్రక్రియ చేపట్టడం వల్ల దుర్గంధం, దుమ్ముధూళి మరింత పెరుగుతున్నాయని, కాలనీల్లోని ఇళ్లలోకి చెత్త దుమ్ము చేరుతోందని తెలిపారు. కుమ్మరి వీధి, వాల్మీకి నగర్, బైరెడ్డి నగర్, గాంధీనగర్, ఏబీఎన్ పాలెం, ఇందిరానగర్ తదితర ప్రాంతాల ప్రజల సమస్యలను దృష్టిలో ఉంచుకుని డంప్‌యార్డ్‌ను నివాస ప్రాంతాలకు దూరంగా తరలించాలని డిమాండ్ చేశారు. చెత్తను శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించాలని, ఆత్మకూరు నుంచి చెత్తను నందికొట్కూరు డంప్‌యార్డ్‌కు తీసుకురాకుండా చూడాలని మున్సిపల్ అధికారులను కోరారు. ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ కోసం సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్. సెమీవుల్లా, షేక్ లడ్డు, అబ్దుల్లా, షేక్ సత్తార్, కలాం, దావత్, అద్రిమ్, రియాజ్, మహమ్మద్ మన్సూర్ తదితరులు పాల్గొన్నారు.



మహానంది నిత్య అన్నదాన పథకానికి రూ.15,116 విరాళం

మహానంది సెప్టెంబర్ 07 (నంది పత్రిక):- ప్రముఖ శైవ క్షేత్రమైన మహానందిలో వెలసిన శ్రీ మహానందీశ్వర స్వామివారి నిత్య అన్నదాన పథకానికి భక్తులు విరాళం అందజేశారు. సిరివెళ్ల మండలం గంగవరం గ్రామానికి చెందిన కొత్తకాపు గుర్రమ్మ సోమవారం రూ.15,116 నగదును దేవస్థానం అధికారులకు విరాళంగా అందజేశారు. దాతను అధికారులు అభినందించి, అన్నదాన బాండు, స్వామివారి ప్రసాదాలను అందజేశారు.

ఎండిపోతున్న పంట పొలాలు సాగునీటిపై వైకాపా, తెదేపా నేతల సవాల్-ప్రతిసవాల్

వెలుగోడు సెప్టెంబర్ 07 (నంది పత్రిక): నియోజకవర్గంలో సాగునీటి కొరత వల్ల పంట పొలాలు ఎండిపోతుండటం, రైతుల ఆందోళన తీవ్ర రాజకీయాంశంగా మారింది. ఒకవైపు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు సాగునీటి విడుదలకై ఆందోళన వ్యక్తం చేస్తుండగా, మరొకవైపు వారి ఆరోపణలను శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి ఘాటుగా తిప్పికొట్టారు.సాగునీరు విడుదల చేయాలి: వైసీపీ రాష్ట్ర కార్యదర్శి బుడ్డా శేషారెడ్డి విజ్ఞప్తిసాగునీరు అందక ఎకరాల కొద్దీ పంట పొలాలు, నారుమడులు ఎండిపోతుండటంతో రైతన్నలు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి బుడ్డా శేషారెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఎండిపోయిన పొలాలను స్వయంగా పరిశీలించిన ఆయన, రైతుల పరిస్థితిపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

ప్రధాన డిమాండ్లు & ఆరోపణలు: సాగునీటి ఎద్దడి: కాలువలకు సరైన సమయానికి నీటిని విడుదల చేయకపోవడంతో వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టిన రైతులు నారుమడులు ఎండిపోయి తీవ్రంగా నష్టపోతున్నారు.పక్షపాత వైఖరి: కూటమి నాయకులు, ప్రజాప్రతినిధుల పొలాలకు నీరు అందుతుంటే, సామాన్య రైతులకు మాత్రం నీరు అందకపోవడం సరికాదని ప్రశ్నించారు.జిల్లా యంత్రాంగానికి విజ్ఞప్తి: పరిస్థితి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని గౌరవనీయ జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ తక్షణమే జోక్యం చేసుకోవాలని, ఎండిపోతున్న పంటలను కాపాడేందుకు కాలువలకు సాగునీటిని విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. తప్పుడు ప్రచారాలను తిప్పికొట్టిన శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి వైసీపీ నేత బుడ్డా శేషారెడ్డి చేసిన ఆరోపణలపై శ్రీశైలం శాసనసభ్యులు బుడ్డా రాజశేఖర రెడ్డి తీవ్రంగా స్పందించారు. శేషారెడ్డి స్వార్థ రాజకీయం కోసం అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు.

ఎమ్మెల్యే రాజశేఖర రెడ్డి వివరణ: తప్పుడు ప్రచారం ఖండన: తాగునీటి అవసరాలు, బావులు మరియు బోర్లు రీఛార్జ్ చేయడానికి విడుదల చేసిన నీటిని తాను సొంత పొలానికి వాడుకుంటున్నట్లు చేస్తున్న ఆరోపణలు కేవలం అబద్ధమని స్పష్టం చేశారు. ఇతరుల పచ్చటి పొలాన్ని తనదిగా చూపించి బురదజల్లే యత్నం చేస్తున్నారని మండిపడ్డారు.డ్రైవర్ ద్వారా వాస్తవాల వెల్లడి: శేషారెడ్డి అబద్ధాలను శేషారెడ్డి సొంత డ్రైవర్ చేతనే చూపించి, అసలు నిజాలను ప్రజల ముందుంచారు.స్వయంగా ఎండిన పొలాన్ని చూపిన ఎమ్మెల్యే: ఎమ్మెల్యే స్వయంగా తన పొలానికి వెళ్లి, అది ఎండిపోయి ఉన్న తీరును మీడియాకు, రైతులకు చూపించారు. గత 9 ఏళ్లుగా తన పొలాన్ని గుత్తకు ఇచ్చానని, తాను స్వయంగా సాగు చేయడం లేదని వెల్లడించారు. ఎల్ నినో ప్రభావం ఉన్నందున ఈసారి పంట వేయవద్దని ముందే గుత్తేదారునికి సూచించినట్లు తెలిపారు.

వ్యక్తిగత ఆస్తిపై తప్పుడు ప్రచారం: శేషారెడ్డి అధీనంలో ఉన్న బుడ్డా కుటుంబానికి చెందిన 'గయి' (గుంత)ను గ్రామ చెరువుగా చిత్రీకరిస్తూ, అందులోకి నీరు నింపడం లేదని చెప్పడం సిగ్గుచేటని వ్యాఖ్యానించారు. పంటలను కాపాడేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని, రైతులను అనవసరంగా గందరగోళానికి గురిచేసే తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి కోరారు.

ఇది శాసనసభ కాదు.. కౌరవసభ..

తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడిన హరీశ్‌రావు, ప్రస్తుత శాసనసభ ప్రజాస్వామ్యబద్ధంగా నడవడం లేదని, అది కౌరవ సభను తలపిస్తోందని మండిపడ్డారు. తెలంగాణ అసెంబ్లీ చరిత్రలోనే ఈరోజు అత్యంత నల్లని రోజుగా మిగిలిపోతుందని, ప్రజా సమస్యలను లేవనెత్తుతున్న ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం పోలీసులను దుర్మార్గంగా ప్రయోగిస్తోందని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ అసెంబ్లీ ప్రధాన గేటు వద్ద బీఆర్ఎస్ సభ్యులు, పోలీసుల మధ్య వాగ్వాదంతో ఉద్రిక్తత చోటు చేసుకుంది. నినాదాలతో కూడిన టీషర్టులతో రావొద్దని బీఆర్ఎస్ సభ్యులను పోలీసులు అడ్డుకున్నారు. పోలీసుల అభ్యంతరంతో మాజీ మంత్రి హరీశ్‌రావు, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు టీ షర్టులు విప్పేశారు. బలియన్లపై ఉన్న హరీశ్‌రావు, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం అసెంబ్లీ ప్రధాన ద్వారం వద్ద కేటీఆర్, హరీశ్‌రావును పోలీసులు అరెస్టు చేశారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. పోలీసుల తీరుపై సునీతా లక్ష్మారెడ్డి తీవ్రంగా మండిపడ్డారు. పోలీసులు తన పట్ల అమానుషంగా వ్యవహరిస్తున్నారని ఆమె కంటతడి పెట్టుకున్నారు. పోలీసుల వైఖరిని కేటీఆర్, హరీశ్‌రావు, బీఆర్ఎస్ నేతలు తప్పుపట్టారు. ఈ సందర్భంగా హరీశ్?రావు మాట్లాడారు. రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ టీషర్టులు వేసుకుని పార్లమెంట్‌కు వెళ్లారని, తాము అలా అసెంబ్లీకి రాకూడదా అని ప్రశ్నించారు. నల్ల టీషర్టుపై హామీలు అమలు చేయాలని మాత్రమే ఉందని తెలిపారు. నిరసన తెలిపే హక్కు తమకు ఉందన్న ఆయన, తమ ఎమ్మెల్యేలపై పోలీసులు దురుసుగా ప్రవర్తించారని ఆరోపించారు. బీఆర్ఎస్ సభ్యులు అసెంబ్లీకి రాకూడదనే ఇలాంటివి చేస్తున్నారన్నారు. బీఆర్ఎస్ సభ్యులు అసెంబ్లీకి వస్తే ప్రశ్నిస్తారనే అడ్డుకుంటున్నారని, ప్రధాన ప్రతిపక్షం లేకుండానే చర్చ జరపాలని చూస్తున్నారని మండిపడ్డారు. ఇదిలా ఉండగా, బీఆర్?ఎస్? నేతల ఆరోపణలపై ఖైరతాబాద్? డీసీపీ శిల్పవల్లి స్పందించారు. నల్ల టీషర్టులతో అసెంబ్లీకి రావడం నేరం కాదని పేర్కొన్నారు. నల్ల టీషర్టులపై అభ్యంతరకర పదాలున్నాయని తెలిపారు. టీషర్ట్‌లపై ఉన్న పదాల కారణంగానే అసెంబ్లీ లోపలికి అనుమతించలేదని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో పోలీసులు అసభ్యంగా ప్రవర్తించలేదన్న డీసీపీ, పోలీసుల తీరుపై బీఆర్ఎస్ ఆరోపణలను పరిశీలిస్తామన్నారు. స్పీకర్ సూచనల మేరకే పోలీసులు వ్యవహరించారన్న శిల్పవల్లి, అసెంబ్లీ గేటు దగ్గర జరిగిన ఘటన వీడియోలను పరిశీలిస్తామన్నారు. ఆందోళన సందర్భంగా పోలీసులు ప్రవర్తించిన తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన హరీశ్‌రావు, మహిళా ప్రజాప్రతినిధుల పట్ల అత్యంత హేయంగా ప్రవర్తించారని ఆరోపించారు. ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి చీర లాగడం, సబితా ఇంద్రారెడ్డి గొంతు నొక్కడం వంటి ఘటనలు అత్యంత అమానుషమని ధ్వజమెత్తారు. మహిళా సభ్యుల పట్ల దుర్మార్గంగా వ్యవహరించిన అధికారులను సప్త సముద్రాల అవతల ఉన్నా వదిలిపెట్టేది లేదని తీవ్ర స్థాయిలో హెచ్చరించారు. తోపులాటలో జగదీష్ రెడ్డిని కింద పడేసి తొక్కేందుకు యత్నించారని, కేటీఆర్, సంజయ్, యాదవరెడ్డి, రాజశేఖర రెడ్డిలకు తీవ్ర గాయాలయ్యాయని తెలిపారు.ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీల అమలు వైఫల్యాలు, పింఛన్లు, మూడేళ్లుగా నిలిచిపోయిన ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపాధ్యాయులు, ఉద్యోగుల సమస్యల నుంచి తప్పించుకోవడానికే ఈ దాడులకు తెగబడ్డారని విమర్శించారు. ప్రభుత్వం వెయ్యి రోజుల విఫల పాలన వాస్తవాలు సభలో బట్టబయలవుతాయనే భయంతోనే తమపై పథకం ప్రకారం కుట్ర పన్ని సస్పెండ్ చేశారని ఆరోపించారు. సభలో ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ లేకుండా చేసి, బీజేపీ -- కాంగ్రెస్ కలిసి నామమాత్రపు చర్చలతో మ్యాచ్ ఫిక్సింగ్ రాజకీయం చేస్తున్నాయని హరీశ్‌రావు ఎండగట్టారు. ప్రజా సమస్యలపై ప్రశ్నించేందుకు అసెంబ్లీకి వెళ్లిన ప్రతిపక్ష సభ్యులపై పోలీసులు అత్యంత కిరాతకంగా వ్యవహరించారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను విస్మరించి 1000 రోజులుగా పాలన సాగిస్తోందని, దీనిపై శాంతియుతంగా నిరసన తెలిపేందుకు వెళ్తే తమపై ఉక్కుపాదం మోపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ పార్లమెంట్‌లో నిరసన తెలిపినట్లే తాము కూడా నిరసన తెలిపేందుకు యత్నించామని, తాము ఎలాంటి అన్‌పార్లమెంటరీ, నికృష్టమైన భాష మాట్లాడలేదని స్పష్టం చేశారు. గతంలో వైఎస్సార్, కిరణ్‌కుమార్ రెడ్డి కేబినెట్లలో మంత్రులుగా, మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా పనిచేసిన అత్యంత అనుభవజ్ఞురాళ్లు, సౌమ్యులైన సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిల పట్ల పోలీసులు ప్రవర్తించిన తీరు దారుణం అంటూ కేటీఆర్ తీవ్రంగా ఆవేదన వ్యక్తం చేశారు. "ఒకవైపు రాహుల్ గాంధీ ఢిల్లీలో 'స్మాష్ ది పాట్రియార్కీ' అంటూ మహిళా సాధికారతపై గొప్పలు చెప్తారు. కానీ ఇక్కడ రాహుల్ గాంధీ రాజకీయాల్లోకి రాకముందే మంత్రులుగా పనిచేసిన సీనియర్ మహిళా నేతల జుట్టు పట్టుకుని, గొంతు పిసికే ప్రయత్నం చేశారు" అని నిలదీశారు. పోలీసులు సునీతా లక్ష్మారెడ్డి చీర పట్టుకుని లాగుతుంటే... కోవ లక్ష్మి అడ్డుకోకపోయి ఉంటే తీవ్ర ప్రమాదం జరిగి ఉండేదని, ఈ ఘటనతో సునీతమ్మ కంటనీరు పెట్టుకోవడం చూస్తే ఇది శాసనసభలా కాకుండా దుశ్శాసన సభలా మారిందని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సీనియర్ నాయకురాళ్ల పట్ల జరిగిన ఈ దాడి, అనాగరిక ప్రవర్తన వెనుక స్పష్టంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుట్ర ఉందే తప్ప మరొకటి కాదని కేటీఆర్ ఆరోపించారు.

ప్రారంభమైన తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు

నిషేధిత భూములు 22ఏ జాబితాపై సభలో రగడ

ప్లకార్డులు ప్రదర్శిస్తూ సభలో బీజేపీ నినాదాలు

22ఏ అంశంపై చర్చకు పూర్తిగా సిద్ధంగా ఉన్నాం

సభ సజావుగా సాగేందుకు సహకరించాలి

22ఏ జాబితాపై మంత్రి శ్రీధర్ బాబు వివరణ

వచ్చే బోనాల నాటికి ఇందిరమ్మ ఇళ్లు పూర్తి

అసెంబ్లీలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమైన వెంటనే నిషేధిత భూములు 22ఏ జాబితా వ్యవహారంపై సభలో రగడ మొదలైంది. 22ఆ నిషేధిత భూముల నిబంధన కింద ప్రైవేట్ భూముల నమోదుపై సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరిపించాలని బీజేపీ ఎమ్మెల్యేలు ప్లకార్డులు ప్రదర్శిస్తూ సభలో నినాదాలు చేశారు. ఈ వివాదంపై తక్షణమే విచారణ కమిటీని వేయాలని బీజేపీ సభ్యులు ప్రభుత్వాన్ని పట్టుబట్టారు. ఈ ఆందోళనపై శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పందించారు. 22ఆ అంశంపై సభలో స్వల్పకాలిక చర్చ చేపట్టేందుకు తమ ప్రభుత్వం సంపూర్ణ సిద్ధంగా ఉందన్నారు. బిజినెస్ అడ్వైజరీ కమిటీ సమావేశంలో ఈ అంశానికి తొలి ప్రాధాన్యత ఇస్తామని, నిబంధనలకు అనుగుణంగా చర్చపై నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. రాజకీయ ప్రయోజనాల కోసం సభను అడ్డుకోవడం సరికాదని, సమావేశాలు సజావుగా సాగేందుకు సహకరించాలని బీజేపీ ఎమ్మెల్యేలకు ఆయన విజ్ఞప్తి చేశారు. అయితే స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రి శ్రీధర్ బాబు సర్దిచెప్పినప్పటికీ బీజేపీ ఎమ్మెల్యేలు వెనక్కి తగ్గకుండా పోడియం వద్ద కాసేపు నినాదాలు చేశారు. విచారణకు నిర్ణయం తీసుకుంటున్నట్లు ప్రకటన చేసేవరకు వెనక్కి తగ్గేదే లేదని స్పష్టం చేయడంతో సభలో తీవ్ర గందరగోళం నెలకొంది. దాంతో తెలంగాణ అసెంబ్లీ 15 నిమిషాల పాటు వాయిదా వేశారు. ఆ తరువాత సభ ప్రారంభం కాగా, బీజేపీ, బీఆర్ఎస్ కుమ్మక్కయ్యాయని బయట వాళ్లు, లోపల వీళ్లు ఆందోళనకు దిగుతున్నారంటూ కాంగ్రెస్ సభ్యులు వ్యాఖ్యానించారు. సభలో ప్రజా సమస్యల పరిష్కారానికి, అర్థవంతమైన చర్చలకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నప్పటికీ బీఆర్ఎస్, బీజేపీ కుమ్మక్కై సభా సమయాన్ని వృధా చేస్తున్నాయని

మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. ఎస్సీల అభివృద్ధితో పాటు ఫీజు రీయింబర్స్‌మెంట్, క్రీడల అభివృద్ధి వంటి కీలక అంశాలపై ప్రభుత్వం చర్చకు సిద్ధంగా ఉన్నా... వాటిని వదిలేసి బురదజల్లే రాజకీయం చేయడం ప్రతిపక్షాలకు తగదని సూచించారు.రాష్ట్రంలో కీలకమైన కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన లక్ష కోట్ల కుంభకోణంపై విచారణ కోరుతూ తెలంగాణ ప్రభుత్వం ఏడాది క్రితమే కేంద్రానికి లేఖ రాసినా... ఆ ఎంక్వయిరీని ఎందుకు తొక్కిపెడుతున్నారని బీజేపీ ఎమ్మెల్యేల్ని మంత్రి కోమటిరెడ్డి ప్రశ్నించారు.

కాళేశ్వరం విషయంలో విచారణను ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి అమిత్ షా ఎందుకు ఆపుతున్నారో బీజేపీ నేతలు సమాధానం చెప్పాలన్నారు. దీనిపై మంత్రి శ్రీధర్ బాబు స్పందిస్తూ 22ఏపై స్వల్ప కాలిక చర్చ పెట్టాలని తెలంగాణ ప్రభుత్వం భావిస్తోందని, 22 ఏ అంశంపై చర్చకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. బీజేపీ సభ్యులు కూర్చోవాలన్న స్పీకర్?, సభ సజావుగా సాగేందుకు సహకరించాలని ఆ పార్టీ సభ్యులను కోరారు. బీఏసీలో నిర్ణయం తీసుకుని 22ఏపై చర్చిద్దామని తెలిపారు.బీఏసీ సమావేశంలో 22 ఏ అంశాన్ని మొదటి ప్రాధాన్యతగా తీసుకుంటామని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. 22 ఏపై స్వల్ప కాలిక చర్చకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమని హామీ ఇచ్చారు. నియమ నిబంధనలకు అనుగుణంగా బీఏసీ సమావేశంలో నిర్ణయం తీసుకుంటామని బీజేపీ ఎమ్మెల్యేలకు చెప్పారు. ప్రతిపక్షాలు చర్చకు సహకరించాలని కోరారు. మంత్రి శ్రీధర్ బాబు, స్పీకర్ సర్దిచెప్పినా బీజేపీ ఎమ్మెల్యేలు వినకుండా 22ఏపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని నినాదాలు చేశారు. రాజకీయాల కోసం సభను అడ్డుకోవడం సరైంది కాదని శ్రీధర్ బాబు విమర్శించారు. సభ సజావుగా సాగేందుకు సహకరించాలని బీజేపీ ఎమ్మెల్యేలను కోరారు. అయితే శ్రీధర్ బాబు విజ్ఞప్తిని బీజేపీ సభ్యులు పట్టించుకోలేదు. పదేపదే ఆయన కోరినా 22ఏ పై తక్షణమే చర్చ జరిగాలని పట్టుపట్టారు. దీంతో సభలో గందరగోళం చెలరేగింది. ఓ దశలో స్పీకర్ సభను వాయిదా వేశారు. సభ తిరిగి ప్రారంభమైన తరువాత కూడా బీజేపీ సభ్యులు తమ ఆందోళనను కొనసాగించారు.

వచ్చే బోనాల పండుగ నాటికి ఇందిరమ్మ ఇళ్లు పూర్తి చేస్తామని శాసన మండలిలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపునకు నియోజకవర్గాన్ని యూనిట్?గా తీసుకున్నట్లుగా వివరించారు. లబ్ధిదారులకు మార్కెట్ ధర కంటే తక్కువ రేటుకే సిమెంట్ ఇప్పిస్తామని చెప్పారు.పేదలు నివసించే ప్రాంతంలోనే ఇందిరమ్మ ఇళ్లను కట్టించి ఇస్తామని పొంగులేటి వెల్లడించారు. 2023 ఎన్నికలకు ముందు బీఆర్ఎస్? ప్రభుత్వం హడావిడిగా కొంతమందికి పట్టాలిచ్చిందన్నారు. వారు ఇచ్చిన ఇళ్లలో చాలా మంది నివసించట్లేదని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో పేదలు నివసించే ప్రాంతానికి 30-40 కిలోమీటర్ల దూరంలో ఇళ్లు ఇచ్చారని, డబుల్? బెడ్?రూమ్? ఇళ్లలో నివసించే వారిని అంటరాని వారిగా చూసేవారని ఆయన తెలిపారు.

ఉపాధి పనుల్లో ప్రగతి పెంచాలి

జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి .....

తక్కువ ప్రగతి ఉన్న మండలాల్లో పనుల వేగం పెంచాలి...

భీమవరం బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 7 నంది పత్రిక ఉపాధి హామీ పథకం పనుల్లో తక్కువ ప్రగతి ఉన్న మండలాల్లో పనుల వేగాన్ని పెంచి, నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులను ఆదేశించారు. సోమవారం పశుసంవర్ధక శాఖ, జిల్లా నీటి యాజమాన్యం సంస్థ, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, సంబంధిత సిబ్బందితో జూమ్ సమావేశం నిర్వహించి పలు ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నరసాపురం, భీమవరం, మొగల్తూరు, ఉండి, ఆకివీడు మండలాల్లో ఉపాధి హామీ పనుల ప్రగతి చాలా తక్కువగా ఉందని, ఆయా మండలాల్లో పనుల ప్రగతిని వేగవంతం చేయాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్, మండల పరిషత్ అభివృద్ధి అధికారులను ఆదేశించారు. ఆయా మండలాల్లో కూలీల సంఖ్య కూడా తక్కువగా ఉందని, కూలీల సంఖ్యను పెంచేందుకు క్షేత్రస్థాయి సహాయకులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని సూచించారు.జిల్లాలో పలు ప్రాంతాల్లో పశువుల షెడ్ల నిర్మాణానికి అర్హులైన లబ్ధిదారులను గుర్తించి, పశుసంవర్ధక శాఖ అధికారులతో సమన్వయం చేసుకుని నిర్మాణాలకు సంబంధించిన అంచనాలను సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. పశువుల షెడ్ల నిర్మాణం ద్వారా పశుపోషకులకు ప్రయోజనం కల్పించడంతో పాటు ఉపాధి హామీ పనుల్లో కూడా ప్రగతి సాధించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.జలధారజలహారతి కార్యక్రమానికి సంబంధించి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పరిధిలోకి తీసుకున్న సాగునీటి చెరువుల పనులను ఇంజినీరింగ్ సహాయకులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, పనుల వివరాలు, పురోగతికి సంబంధించిన ఫొటోలను తమ మొబైల్ యాప్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ పనుల్లో కూడా ప్రగతిని మరింత పెంచాలని ఆదేశించారు.రానున్న జిల్లా కలెక్టర్ల సమావేశం నాటికి నిర్దేశించిన పనులన్నింటినీ పూర్తి చేసి, జిల్లాలో పనుల అమలు ప్రగతిని పెంచి మెరుగైన ఫలితాలు సాధించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయి అధికారులు నిరంతరం పనులను పర్యవేక్షిస్తూ, సమస్యలు ఎదురైతే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ కె.సి.హెచ్. అప్పారావు, అన్ని మండలాల మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, బీవీజీ రాంజీ, సిబ్బంది, పశు సంవర్ధక శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ భరోసా కొత్త పింఛన్లకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోండి

జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

భీమవరం బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 7 నంది పత్రిక ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పింఛన్ల పథకానికి జిల్లాలో అర్హులైన ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ పి జి ఆర్ ఎస్ సమావేశ మందిరంలో జరిగిన సమావేశంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ, ఎన్టీఆర్ భరోసా పింఛన్లకు నూతనంగా అర్హులైన లబ్ధిదారుల పింఛన్ల మంజూరుకు ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసిందని ఆమె పేర్కొన్నారు. జిల్లాలో అర్హత కలిగిన వారు సెప్టెంబర్ 7వ తేదీ నుంచి 16వ తేదీ వరకు కొత్త పింఛన్ల మంజూరు కోసం దరఖాస్తు చేసుకోవాలని ఆమె అన్నారు. వచ్చిన దరఖాస్తులను ఈనెల 17వ తేదీ నుండి 21 తేదీ వరకు పరిశీలించాలని సంబంధిత అధికారులు ఆదేశించారు. అనంతరం సెప్టెంబరు 22, 23 ,24, తేదీలలో ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, బడ్జెట్ ప్రతిపాదనలకు గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) కు పంపాలని ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలు, అర్హత ప్రమాణాలకు అనుగుణంగా ఉన్న పేదలు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు మరియు ఇతర అర్హులైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకం ప్రయోజనాలు అందేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని, అర్హులైన వారి నుంచి దరఖాస్తులు స్వీకరించి ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం పరిశీలన పూర్తి చేయాలని అన్నారు. పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకునే అర్హులైన ప్రజలు నిర్ణీత గడువులోగా దరఖాస్తు చేసుకుని ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ కె.ఆర్ కల్పశ్రీ, డిఆర్ఓ పి గ్లోరియా, కలెక్టరేట్ కె ఆర్ సి డిప్యూటీ కలెక్టర్ పి. ప్రభాకర్, పిజిఆర్ఎస్ జిల్లా ప్రత్యేక అధికారి వై దోసిరెడ్డి, డ్వామా పిడి డా కె సి హెచ్ అప్పారావు,వివిధ శాఖలజిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఏపీలో పదో తరగతి అర్హతతో 913 ఉద్యోగాలు

అందించింది. రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న 913 ఆశా కార్యకర్తల పోస్టులను భర్తీ చేయనున్నట్లు వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ ప్రకటించారు. ఈ నియామక ప్రక్రియను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్లు ఆయన వెల్లడించారు.ఈ నియామకాలను జిల్లా కలెక్టర్ల అధ్యక్షతన ఉండే జిల్లా ఆరోగ్య సొసైటీల ద్వారా చేపట్టనున్నారు. ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. అలాగే, దరఖాస్తుదారుల వయసు 25 నుంచి 45 ఏళ్ల మధ్య ఉండటం తప్పనిసరి. సంబంధిత గ్రామాలు లేదా వార్డులకు చెందిన స్థానిక మహిళలకు ఈ నియామకాల్లో ప్రాధాన్యత కల్పించనున్నారు. ఎంపికైన ఆశా కార్యకర్తలకు నెలకు రూ.10,000 చొప్పున గౌరవ వేతనం లభిస్తుంది. రాష్ట్రంలో ఇప్పటికే 1,294 ఆశా కార్యకర్తల పోస్టులను భర్తీ చేశామని మంత్రి సత్యకుమార్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. తాజాగా మరో 913 పోస్టుల భర్తీకి ఆమోదం తెలిపామని, వీటిని కూడా త్వరితగతిన పూర్తి చేసి క్షేత్రస్థాయిలో వైద్య సేవలను మరింత బలోపేతం చేస్తామని ఆయన వివరించారు. ప్రభుత్వ నిర్ణయంతో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజారోగ్య సేవలు మరింత మెరుగుపడనున్నాయి.

printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com